
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-2-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 362 పేజీలు: 10+4 వెల: 6.50

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు
మరణించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కుటుంబానికి కోటి సాయం 3






# 3 కర్తవ్యాల కొత్తపద్దు

## 2026-27 కేంద్ర బడ్జెట్‌లో 6 కీలక రంగాల్లో సంస్కరణలు

### ఆర్థిక సుస్థిరత దిశగా వివిధ శాఖలకు కేటాయింపులు

మొత్తం బడ్జెట్: రూ.53.47 లక్షల కోట్లు

రెవిన్యూ వసూళ్లు: రూ.35.33 లక్షల కోట్లు

మూలధన వసూళ్లు: రూ.18.14 లక్షల కోట్లు

ద్రవ్యలోటు: 4.3 శాతంగా అంచనా

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 1:** కొత్త ఆర్థికసంవత్సరానికిగాను ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ రూ.53.47 లక్షల కోట్లతోకూడిన బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించారు. గత ఏడాది బడ్జెట్ అంచనాలతోపోలిస్తే స్వల్పంగా బడ్జెట్ స్వరూపం మారింది. ఆదాయ వనరులు రూ.35,33,150 కోట్లు కాగా మూలధన రాబడులే రూ. 18,14,165 కోట్లుగా ఉన్నాయి. ఈ మొత్తం రాబడులు 53,47,315 కోట్లుగా పద్దుల్లో పేర్కొన్నారు. ఇక మొత్తంవ్యయం కూడా గత ఏడాదితోపోలిస్తే సమాంతరంగాపెరుగుతూ వచ్చింది. >>2




**ధరలు తగ్గేవి**
కేన్సర్ మందులు, విదేశీ ప్రయాణాలు, విద్య, మొబైల్ ఫోన్లు, టివి పరికరాలు, పాదరక్షలు, తోలు వస్తువులు, సోలార్ ప్యానెల్స్ తయారీ పరికరాలు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు




**ధరలు పెరిగేవి**
మద్యం, బొగ్గు, సిగరెట్లు, పొగాకు, విలాసవంతమైన వాచ్‌లు, ఆల్కహాలు, కాఫీరోస్టింగ్ మిషన్లు, కెమెరాలు, కొన్ని రకాల స్క్రాప్ వస్తువుల ధరలు

మరికొన్ని బడ్జెట్ వార్తలు 5, 6, 7 పేజీల్లో



ఆదివారం విచారణ అనంతరం అభిమానులకు అభివాదం చేస్తున్న కెసిఆర్. చిత్రంలో కెటిఆర్

# 4.45 గం. విచారణ

## ప్రభాకర్‌రావుకు ఎక్స్‌టెన్షన్ ఎలా ఇచ్చారు? ఏం ఆశించారు?

వేలాది ఫోన్ల ట్యాపింగ్ మర్మమేమిటి?
బెదిరించి విరాళాలు సేకరించారా?
సుప్రీం పెద్దాయన అంటే మీరేనా?

### ఆడియోలు, విడియోల ఆధారాలతో కెసిఆర్‌ను ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు

### విచారణ అనంతరం సిట్‌బాస్ సజ్జనార్‌తో భేటీ అయిన బృందం

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఆదివారం నాడు సిట్ అధికారులు నాలుగున్నర గంటల పాటు విచారించారు. ఇదే కేసులో గడచిన పది రోజుల వ్యవధిలో పార్టీ ఎంఎల్‌సి నవీన్‌రావు, అగ్రనేతలు హరీష్‌రావు, కెటిఆర్‌తో పాటు మాజీ ఎంపి సంతోష్ రావులను సిట్ అధికారులు సుధీర్ఘంగా విచారించడం తెలిసిందే. వీరి విచారణ తరువాత బిఆర్ ఎస్ అధినేత కెసిఆర్‌ను విచారించే వీలుందని వార్తలు రాగా వీటిని నిజం చేస్తూ గురువారం మొదటిసారిగా కెసిఆర్‌కు నోటీసు ఇచ్చి శుక్రవారం విచారణకు రావాలని కోరారు. ఈ నోటీసుకు కెసిఆర్ సమాధానం ఇస్తూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు రాలేనని మరోదఫా విచారణకు వస్తానని తెలిపారు. దీనిపై సిట్ అధికారులు శనివారం మరో సారి నోటీసు ఇచ్చి ఆదివారం విచారణకు హైదరాబాద్‌కు రావాలని కోరారు. ఈ నోటీసుకు కెసిఆర్ సానుకూలంగా స్పందించి మధ్యాహ్నం 12 గంటలకే నందీనగర్‌లోని తన ఇంటికి వచ్చారు. విచారణ సందర్భంగా కెసిఆర్ ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కెసిఆర్ ఇంట్లో రెండవ >>2



మంచిర్యాలలో బాల్కసుమన్ బైక్ ర్యాలీ



నిజామాబాద్‌లో రోడ్డుపై బైఠాయించిన బిఆర్ఎస్ నాయకులు

## కలలో కూడా అనుకోలేదు..

### కెసిఆర్ భావోద్వేగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి1:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిట్ విచారణ ఎదుర్కొన్నారు. ఆదివారం నందినగర్ లోని ఆయన నివాసంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ విచారణ షురూ అయింది. అయితే సిట్ విచారణకు ముందు పార్టీ నాయకులతో కెసిఆర్ లంచ్ మీట్‌లో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో >>2

## సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదు..

### ప్రతి ప్రశ్నకు కెసిఆర్ కుండ బద్దలు కొట్టినట్టు బదులిచ్చారు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి1:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు సిట్ విచారణపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదని, అయినా సరే కేసీఆర్‌ను విచారణకు సంపూర్ణంగా సహకరించారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగించినట్టుగా సిట్ ప్రశ్నలు వేస్తోందని మండిపడిన ఆయన.. ప్రతి పశ్నకు కుండబద్ధలు కొట్టినట్టు కేసీఆర్ బదులిచ్చాని వెల్లడించారు. సిట్ విచారణ ఎర్రవల్లిలోనే జరిపే విషయంపై కోర్టుకు వెళ్తే తమకు అనుకులూంగా తీర్పు వచ్చేదని.. కానీ తాము అలా చేయలేదని కేటీఆర్ చెప్పారు. ఆదివారం రాత్రి కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యాక నందినగర్‌లోని నివాసంలోనే కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో అపోహలు, అసత్యాలు సృష్టించేందుకు సిట్ విచారణను కాంగ్రెస్ సర్కార్ కొనసాగిస్తోందని కేటీఆర్ దుయ్యబట్టారు. ఈ కేసులో లీకులే తప్ప అధారాలు లేవు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో డొల్లతనం క్రమంగా బయటపడుతోంది. ఎలాంటి తప్పు జరగలేదని తేలిపోయింది అని కెటిఆర్ పేర్కొన్నారు. రెండేళ్లకాంగ్రెస్ పాలనను మూడుముక్కల్లో చెప్పొచ్చు. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడమే కాంగ్రెస్ పాలన.. కాంగ్రెస్ బీజేపీ అసమర్థత వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోంది అని ఆయన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఈసారికూడాఅన్యాయంజరిగింది. 8+8 గుండుసున్నా అని కాంగ్రెస్, బీజేపీకి తెలుసు. డైవర్షన్, సబ్‌వర్షన్ పర్వర్షన్ అని కేటీఆర్ మండిపడ్డారు. ఢిల్లీకి రేవంత్ 50-60 ట్రిప్పులు కొట్టినా ఏం సాధించలేకపోయారని ఆయన ఎద్దేవా చేశారు. ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను గంజాయి ముఠా చంపితే పట్టించుకునే నాథుడే లేడని, మేడారం జాతరలోని వసతలు అధ్వాన్నంగా ఉన్నాయని భక్తులు అసంతృప్తి వెళ్లగక్కారని ఆయన ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనను ఖండించారు. ఇకనైనా డైవర్షన్ రాజకీయాలు ఆపేసి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని.. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# తెలంగాణకు అన్యాయమే

### జాతీయ ఉపాధి పథకానికి తూట్లు

### ఎస్సీ, ఎస్టీ మైనార్టీల ఊసేలేదు

### బడ్జెట్‌లో రాష్ట్రానికి సీతారామన్ ఏం ఇచ్చారు?: డి.సిఎం భట్టి



ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి1:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం అన్యాయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు క్యాబినెట్ మంత్రులు, పార్లమెంటు సభ్యులు బృందాలుగా వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌లను పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశపరిచిందని పేర్కొన్నారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మూసి పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్ హైదరాబాద్ నగర అభివృద్ధి మెట్రో రైల్ విస్తరణ ఇతర మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఆశించామన్నారు.బయో ఫార్మా అంటే ముందుగా కేంద్రానికి గుర్తు రావాల్సింది తెలంగాణ ప్రభుత్వం. కేంద్రం ప్రకటించిన బయో ఫార్మాలో తెలంగాణకు నిధులను పొందుపరచకపోవడం తీవ్ర నిరాశపరిచిందన్నారు. కేంద్ర బడ్జెట్లో ఎలక్ట్రానిక్స్‌కు రూ.40 వేల కోట్ల కేటాయింపులు చేశారు ఇందులో కూడా తెలంగాణకు ఒక పైసా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. హైదరాబాదులో ఎలక్ట్రానిక్ ఎకో సిస్టం విస్తారంగా అభివృద్ధి చెందింది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈసీఐ లాంటిసంస్థలను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ హైదరాబాద్ అంటే ఎలక్ట్రానిక్స్ అన్నట్టుగా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి ఈ విభాగంలో కూడా నిధులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఫార్మ హబ్‌గా ప్రపంచానికి హైదరాబాదు గుర్తింపు కోవిడ్ సమయంలో ఈ దేశానికే కాకుండా ప్రపంచాన్ని కూడా భారత్ బయోటెక్ ఔషధాలను అందించింది సాక్షాత్తు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కోవిడ్ సమయంలో సందర్శించారు. కానీ ఫార్మ హబ్‌లో కూడా తెలంగాణను పేర్కొనలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగంపైన ఫోకస్ పెట్టింది గ్లోబల్ >>2

# టిటిడి ఇఒ సింఘాల్‌పై బదలీ వేటు

### ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందేనన్న సింఘాల్



**తిరుమల, ఫిబ్రవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు కల్తీనెయ్యి సరఫరా చేసిన పాపంలో 2019లో టెండర్ నిబంధనలు సడలించి, ఇష్టానుసారం వ్యవహరించారనే సిబిఐ సిట్ అధికారుల నివేదికలు ప్రామాణికంగా అప్పటి,ప్రస్తుతం టిటిడి ఇఒగా కొనసాగుతున్న అనిల్‌కుమార్‌సింఘాల్‌పై ప్రభుత్వం బదిలీ వేటువేసింది. ఆదివారం మధ్యాహ్నం రాష్ట్రప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందగానే ఆగమేఘాలపై ఆయన ఇఒ పదవినుండి తప్పుకుని ఇన్‌ఛార్జి ఇఒగా ప్రస్తుత టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఆయన అదనపు బాధ్యతలు అప్పగించారు. బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రకారం సింఘాల్ అదనపు ఇఒ చౌదరికి బాధ్యతలు ఇచ్చారు. చివరగా ఆదివారం ఉదయం ఇఒ హోదాలో అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు ఇష్టదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని భారమైన హృదయంతో ఆలయం వెలుపలకు >>2

టిటిడి కొత్త ఇఒగా ముద్దాడ రవిచంద్ర 3

సింగరేణిపై కమిటీ నివేదిక అందింది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి 2



పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్

# ఇది సంస్కరణల ఎక్స్‌ప్రెస్

## బడ్జెట్‌పై ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** "నేటి బడ్జెటు చరిత్రాత్మకమైందనీ, దేశ మహిళల సాధికార భావనకు ఇది అద్దం పడుతోందనీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్ణించారు. భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్‌గా నిలుస్తుందని చెప్పారు. త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. చరిత్రాత్మక బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మహిళా ఆర్థిక మంత్రిగా వరుసగా తొమ్మిదో సారి దేశ బడ్జెటును ప్రవేశపెట్టి, రికార్డును నెలకొల్పారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ప్రధాని మోడీ తన స్పందనను తెలియజేస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. "ఈ బడ్జెట్ అనేక అవకాశాలకు రాచబాటను వేసింది ఇది భారత వర్తమాన కలల్ని నెరవేర్చడంతో పాటు, ఉజ్వల భవితకు బలమైన పునాదిని కూడా వేస్తుంది" అని ప్రధానమంత్రి తెలిపారు. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు భారత్‌కు ఈ బడ్జెటు రెక్కలు తొడుగుతుందని ఆయన స్పష్టం చేశారు. భారత్‌లో ప్రస్తుతం సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోందనీ, ఈ బడ్జెటుతో ఈ ఎక్స్‌ప్రెస్ ఒక కొత్త శక్తినే కాకుండా ఓ కొత్త జోరును కూడా అందుకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌లో వృద్ధిలోకి రావాలని తపించిపోతున్న, ధైర్యవంతులైన, ప్రతిభావంతులైన యువతకు వారు ఉవ్వెత్తున ఎగరడానికి విశాల గగనాన్ని బడ్జెటు వారి ఎదుట ఆవిష్కరించిందని ఆయన అన్నారు. నమ్మకమైన పాలన, దేశ పౌరుల ప్రయోజనాలకు ప్రాముఖ్యాన్నిచ్చే ఆర్థిక ప్రణాళిక.. ఈ రెండు దృష్టికోణాలనూ బడ్జెటు సాకారం చేసిందని కూడా ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. ద్రవ్య లోటును తగ్గించడం, ధరల పెరుగుదలకు కళ్లెం వేయడం, అదే సమయంలో అధిక మూలధన వ్యయానికీ, అధిక అభివృద్ధికీ పూచీని ఇవ్వడం.. వీటిపై దృష్టిని కేంద్రీకరించిన అద్వితీయ బడ్జెటు ఇదని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతోనే భారత్‌లోని 140 కోట్ల మంది పౌరులు సంతృప్తి చెందడం లేదనీ, త్వరలో ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని దేశ ప్రజలు దృఢంగా తీర్మానించుకొన్నారనీ ఆయన స్పష్టం చేశారు. ఇది లక్షలాది భారతీయుల ఉమ్మడి సంకల్పమని ఆయన అన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు

## డి.సిఎం భట్టి విక్రమార్క

### పెండింగ్ బిల్లులు రూ.720 కోట్లు విడుదల

### సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు క్లియర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి1:** ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తూ వస్తోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం గ్రీన్ ఛానల్‌లో పెండింగ్ నిధులను నెలవారీగా విడుదల చేస్తూ వస్తుంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ.720 కోట్లు విడుదల చేసింది. జనవరి మాసానికి సంబంధించిన పెండింగ్ బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం రూ.720 కోట్లు విడుదల చేశారు. గత ప్రభుత్వానికి ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకాయిలకు సంబంధించి ప్రతి నెల రూ.700 కోట్లకు పైగా నిధులు విడుదల చేస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. గత సంవత్సరం జూన్ నెలాఖరులో రూ.183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆ తర్వాత గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసంగా రూ. 700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది.తాజాగా విడుదల చేసిన నిధులలో2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సరెండర్ లీవుల ఎన్‌క్యాష్ మనేటి పెండింగ్ మొత్తం ఒకేసారి క్లియర్ చేసింది. వీటితోపాటు విడుదలైన బిల్లులో గ్రాట్యుటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్ లు, అడ్వాన్సులు ఉన్నాయి.

# కెసిఆర్ అజేయుడు..

## చిల్లర రాజకీయాలకు వణకడు

### కాంగ్రెస్ సర్కార్‌పై కెటిఆర్ ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి1:** మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును సిట్ అధికారులు ఆదివారం విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో సెకను కాలం కూడా పక్కకు తప్పుకోని ధీశాలి కేసీఆర్ అని కొనియాడారు. ఈ రాష్ట్రం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయని వ్యక్తి కేసీఆర్ అని తెలిపారు. దుష్ట శక్తులకు వ్యతిరేకంగా పర్వతంలా నిలబడిన మనిషి కేసీఆర్ అని, చిల్లర రాజకీయాలు, నీచమైన ఎత్తుగడలకు ఆయన వణికిపోయే వ్యక్తి కాదని.. కేసీఆర్ అజేయుడు అని కొనియాడారు. మూర్ఖులు చరిత్రను సృష్టించడం పక్కన పెడితే.. కనీసం చరిత్రను అర్థం కూడా చేసుకోలేరని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎవరు ఎంత విషం చిమ్మినా.. ఆయన్ను ఏమీ చేయలేరని హెచ్చరించారు. కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్ర.. ఆ చరిత్రలో మీరు కనీసం ఒక చిన్న ఫుట్‌నోట్ కూడా కాలేరని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## టిటిడి ఇఒ సింఘాల్‌పై బదలీ వేటు

>> వచ్చారు. ప్రభుత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయాలు, ఆదేశాలను అమలుచేయాల్సిందేనని తనను కలిసిన మీడియాప్రతినిధులతో తెలిపారు. దేవుని చెంత రెండవసారి పనిచేసే అవకాశం కలగడం, ఆ స్వామివారి ఆశీస్సులందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సీనియర్ ఐఎఎస్ అధికారి అయిన అనిల్‌కుమార్‌సింఘాల్ టిటిడి పాలనలో అనుభవం ఉండటంతో గతంలో 2017 నుండి 2020 అక్టోబర్ వరకు ఇఒగా ఆయన సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. పలు సంస్కరణలు,నూతన దర్శన విధానాల అమలులో కొంతవరకు సఫలీకృతులయ్యారు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా ఏడునెలలు ఇఒగా పనిచేశారు. ఆ సమయంలో అప్పటి వైసిపి నేతృత్వంలోని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధ్యక్షతన కొలువుదీరిన బోర్డు పెద్దలు నెయ్యి టెండర్లలో నిబంధనలు పూర్తిగా మార్పుచేసి తమకు అనుకూలంగా మార్చుకున్నా ఇఒహోదాలో అధికారులతో కలసిదీన్ని అడ్డుకోలేదనే తాజాగా సిబిఐ సిట్‌నివేదికఇచ్చింది.ఈ నివేదిక ఆధారంగా ఐదునెలలుగా ఇఒగా రెండవసారి వచ్చి కొనసాగుతున్న సింఘాల్ తప్పిదం ఉందని స్పష్టం కావడంతో బదలీ చేసింది.

## రూపాయి రాక

- అప్పులు, ఇతర రుణాలు 24 పైసలు
- కార్పోరేషన్ పన్ను 18 పైసలు
- ఆదాయపు పన్ను 21 పైసలు
- కస్టమ్స్ సుంకం 4 పైసలు
- కేంద్ర ఎక్సైజ్ సుంకం 6 పైసలు
- జిఎస్‌టి, ఇతర పన్నులు 15 పైసలు
- పన్నేతర ఆదాయం 10 పైసలు
- రుణేతర మూలధన వసూళ్లు 2 పైసలు

## రూపాయి పోక

- పన్నులు, సుంకాలులో రాష్ట్రాల వాటా 22 పైసలు
- ఆర్థిక సంఘం గ్రాంట్లు, ఇతర బదిలీలు 7 పైసలు
- కేంద్ర ప్రాయోజిత పథకాలు 8 పైసలు
- వడ్డీ చెల్లింపులు 20 పైసలు
- రక్షణ రంగం 11 పైసలు
- సబ్సిడీలు 6 పైసలు
- కేంద్ర రంగ పథకాలు 17 పైసలు
- పెన్షన్లు 2 పైసలు
- ఇతర ఖర్చులు 7 పైసలు

# నందినగర్‌లో కార్యకర్తలకు కెసిఆర్ అభివాదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి1:** సిట్ విచారణ అనంతరం పార్టీ కీలక నేతలతో భేటీ అయిన బిఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు తర్వాత బయటకొచ్చి కార్యకర్తలు,అభిమానులకు అభివాదం చేశారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉదయమే చేరుకున్న వారిని పోలీసులు తెలంగాణ భవన్ వద్దే అడ్డుకున్నారు. ఓ దశల పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సిట్ విచారణ ముగిసిన తర్వాత తెలంగాణ భవన్ నుంచి కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున నడుచుకుంటూ నందినగర్‌లోని కెసిఆర్ నివాసానికి చేరుకున్నారు. సిఎం కెసిఆర్ అంటూ నినాదాలు చేశారు. తర్వాత నందినగర్ నివాసం నుంచి కెసిఆర్ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు బయలుదేరుతూ కారులో నుంచి కార్యకర్తలకు,అభిమానులకు అభివాదం చేశారు.

## వారం - వర్జ్యం

02-02-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, శ్రవణ కార్తె
కృ.పాడ్యమి రా. 1.55
ఆశ్లేష రా. 10.51
వర్జ్యం : ఉ.10.33-12.06
దు.ము.12.45-1.31, 2)మ.3.02-3.48
శుభసమయం : ఉ.6.15-7.00, సా.6.15-7.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్తులకు అనుకూలంగా వుంటుంది.వస్త్ర లాభం.

**వృషభం:** ముఖ్యమైన విషయాలలో ఆచితూచి ముందుకు సాగండి. వివాదాలకు దూరంగా వుండండి.కొత్త మిత్రులు పరిచయం.

**మిథునం:**సన్నిహితులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. ఆరోగ్యం, వాహనాల విషయంలో మెలుకువ అవసరం. ధన లాభం.

**కర్కాటకం:**భూ వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.శ్రమ అధికం.

**సింహం:** జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య:** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఋణాలు తీరుతాయి.

**తుల :** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. ఆదాయ, వ్యయాలలో సమతుల్యత లభిస్తుంది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం:**కారణం లేని చికాకులు చోటు చేసుకుంటాయి. పెద్దల సలహాలను పరిగణలోనికి తీసుకుంటారు. శ్రమ అధికం.

**ధనుస్సు:** ఒకే సమయంలో అనేకమైన పనులు సానుకూలపరుచుకోవలసి వస్తుంది. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:**కార్యాలయంలో స్వల్పమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.వాహన సౌలభ్యం.

**కుంభం:**కుటుంబ సభ్యులతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు సమసిపోయే విధంగా సూచిస్తోంది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** తొందరపాటుతనం వద్దు. దూరప్రాంతాల నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది.సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 3 కర్తవ్యాల కొత్త పద్దు

>> గత ఏడాది బడ్జెట్ సవరణ అంచనాల్లో రూ.49,64,842 కోట్లుగా ఉంటే ఈ ఏడాది బడ్జెట్ అంచనాలు రూ.53,47,315 కోట్లుగా ఉంటాయని ఆర్థికమంత్రి వివరించారు. ఇక మూలధన వ్యయం ఈ సారం గణనీయంగా పెరిగింది. గత ఏడాది సవరించిన అంచనాలకంటే ఈసారి బడ్జెట్ అంచనాలు రూ.17,14,523 కోట్లుగా ఉన్నాయి. ఇక రెవెన్యూలోటు రూ.5,92,344 కోట్లుగా ఉంటే ప్రభావిత రెవెన్యూ లోటు రూ.99,642 కోట్లుగా అంచనావేసారు. ఇక ఆర్థికలోటు ఈసారి రూ.16,95,768 కోట్లుగాచూపించారు. రుణేతర రాబడులు వ్యయం మొత్తం 53.5 లక్షలకోట్లుగా అంచనావేసారు. వీటిలో రుణేతర రాబడులు 36.5 లక్షలుకోట్లుగా అంచనావేసారు. కేంద్రం నికర పన్నురాబడులు రూ.28.7 లక్షలకోట్లు ఉంటాయని అంచనాగా ఉంది. మార్కెట్లనుంచి రుణసమీకరణలు రూ.11.7 లక్షలకోట్లవరకూ ఉంటాయని బడ్జెట్‌లోప్రస్తావించారు. సవరించిన మొత్తం వ్యయం రూ.49.6 లక్షలకోట్లుగా ఉంటుంది. వాటిలోమూలధన వ్యయం రూ.11 లక్షలకోట్లు దాటింది. అంటే ఈసారి మూలధన వ్యయాన్ని గణనీయంగా పెంచింది. ఆర్థికలోటును 2026-27 ఆర్థికసంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తిలో 4.3శాతంగా ఉంటుందని పద్దుల్లో చూపించారు. 2025-26లో ఆర్థికలోటు బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా 4.4శాతంగానే చూపించారు. ఇక రుణం, జిడిపి నిష్పత్తినిచూస్తే కొత్త సంవత్సరంలో జిడిపిలో 55.6శాతంగా ఉంటుందని అంచనావేసారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌ప్రసంగంలో కొత్త పార్లమెంటుభవనం కర్తవ్యభవన్‌లో మొట్టమొదటి బడ్జెట్‌అని చెపుతూ మూడు కర్తవ్యాలదిశగా తమ బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. సుస్థిర ఆర్థికవృద్ధి, ఉత్పాదకతను పెంచుకోవడం, పోటీతత్వానికి అనుగుణంగా సామర్థ్యం పెంపు, గ్లోబల్ అనిశ్చితిని మనకు అనుకూలంగా మార్చుకోవడం ప్రధానలక్ష్యంగా ఉంచుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ సామర్థ్యం పెంచుకోడానికి అనువైన వాతావరణం కల్పించడంతోపాటు భారత్ ఆర్థికవృద్ధి బాటలో ప్రజలను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందని ఆర్థిక మంత్రి వివరించారు. సబ్‌కాసాత్‌సబ్‌కా వికాస్ లక్ష్యంగాచేసుకుని వికసిత్‌భారత్ లక్ష్యసాధన దిశగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆర్థికమంత్రి వివరించారు. కేంద్రంనుంచి నికర పన్ను వసూళ్లు 28.7 లక్షలకోట్లుగా ఉన్నాయి. మార్కెట్లనుంచి రుణసమీకరణలు మొత్తం రూ.17.2 లక్షలకోట్లవరకూ ఉండవచ్చని వీటిలో సెక్యూరిటీలపరంగా కూడా రూ.11.7 లక్షలకోట్లమొత్తం ఉందన్నారు. ఆపరేషన్‌సిందూర్ సామర్థ్యంతో రక్షణ వ్యయాన్ని మరింతగాపెంచారు. కొత్త బడ్జెట్‌లో రూ.7.85 లక్షలకోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు రూ.6.81 లక్షలకోట్లకంటే ఎనిమిదిశాతం ఎక్కువగా ఉంది. ఇక ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి కొత్త ఆదాయపు పన్నుచట్టం అమలులోకి వస్తుందని కేంద్ర మంత్రి ప్రకటించారు.

# తెలంగాణకు అన్యాయమే

>> సమ్మిట్‌లో 2047 విజన్ డాక్యుమెంట్ సందర్భంగా కూడా ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడితో క్రీడలు నిర్వహించాం, క్రీడారంగం పైన ప్రత్యేక దృష్టి సారించి ముందుకెళ్తున్న క్రమంలో తెలంగాణ కేంద్రానికి ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఆరెంజ్ ఎకానమిలో హైదరాబాద్ సెంట్రిక్ ముంబైకి తరలించారు. తెలంగాణ ఏమి తప్పు చేసిందని ప్రశ్నించారు. ఆడియో వీడియో గేమింగ్ కామెక్స్ లాంటి వాటికి హైదరాబాద్ నగరం బిగ్గెస్ట్ సెంటర్,. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ పై దృష్టి పెట్టకుండా ముంబైలో పెట్టడం ఏంటి అని ప్రశ్నించారు. హైదరాబాద్ మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతున్నది దేశంతో పాటు ఇతర దేశాల నుంచి కూడా హైదరాబాదులో అందుబాటులో ఉన్న మెడికల్ ఫెసిలిటీని ఉపయోగించుకోవడానికి వస్తున్నారు. రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌లో ఇతర రాష్ట్రాలకు ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. టూరిజం విభాగంలో కూడా తెలంగాణ రాష్ట్రాన్ని పొందుపరచకపోవడం అన్యాయం అన్నారు. యునెస్కో గుర్తించిన రామప్ప లాంటి హెరిటేజ్ దేవాలయం మన్ననూరు టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ వాటర్ ఫాల్స్ కృష్ణ గోదావరి తీరం వెంట ఉన్న ఆలయాలు అటవీ ఇటీవల జరిగిన మేడారం సమ్మక్క సారక్క జాతరకు న్యూజిలాండ్ దేశస్తులు వచ్చి దర్శించుకున్నారు ఇంత గొప్పగా ఉన్న తెలంగాణ టూరిజంను ప్యాకేజీలో పేర్కొన లేదని చెప్పారు. రేర్ ఎర్త్ మినరల్స్ లో కూడా తెలంగాణ పై కేంద్రం దృష్టి సారించలేదని,. ఇప్పటికే సింగరేణి సంస్థ సత్తుపల్లి రామగుండంలో స్కాండియం, లిథియంను వెలికితీయడానికి రేర్ ఎర్త్ మినరల్స్ ప్రాసెస్‌ను నడుపుతున్నదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సెమీ కండక్టర్ మంజూరు చేయాలని ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా వెళ్లి ప్రధానమంత్రిని కలిసినప్పటికీ బడ్జెట్‌లో మిగతా రాష్ట్రాలకు ఇచ్చి తెలంగాణకు మొండి చేయి చూపించారని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమంపై ఈ బడ్జెట్ లో దృష్టి సారించలేదన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచే పని చేస్తున్నారు దీనివల్ల గ్రామీణ ప్రాంత పేదలకు తీవ్ర నష్టం జరగనుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వికసిత్ భారత్ గోలుకు కాంట్రిబ్యూట్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి త్రీ మిలియన్ డాలర్ ఎకానమీగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ లక్ష్యం చేరుకోవడానికి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బలమైన పునాదులకు ప్రోత్సాహం అందించి ముందుకెళ్లాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా పెట్టుకొని రాజకీయాల కతీతంగా తెలంగాణ పార్లమెంటు సభ్యులు ఈ బడ్జెట్ సెషన్‌లో ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్‌లను నిధులు కేటాయించాలని వినతి పత్రాలు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు.

# కలలో కూడా అనుకోలేదు..

>> కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు తెలిసింది. నందినగర్ నివాసం నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊపిరి పోశానని, ఉద్యమ రచన చేశానని ఇప్పుడు ఈ ఇంటి గదిలోనే విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం ఇదే గదిలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. కీలక చర్చలు జరిపాను. అలాంటి చోట ఈ పరిస్థితి వస్తుందని ఊహించలేదు అని కేసీఆర్ వ్యాఖ్యానించినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఆనాటి సంగతులను గుర్తు చేసుకున్నారు.ఇప్పుడు అదే గదిలో విచారణను ఎదుర్కోవడం దురదృష్టకరమంటూ పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కెసిఆర్ ఉద్వేగానికి గురయ్యారు.నందినగరలోని నివాసంలో కెసిఆర్‌ను ఐదుగురు సభ్యుల సిట్ బృందం ప్రశ్నించింది. భవనంలోని రెండో ఫ్లోర్‌లో విచారణ జరిగింది. విచారణ నేపథ్యంలో నందినగర్‌లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నందినగర్ పరిసరాల్లో భారీ బందోబస్తు మోహరించారు. విచారణ ప్రారంభం కాగానే మాజీ మంత్రి హరీష్ రావు,కెటిఆర్‌లతో పాటు ఇతర నేతలను బయటకు పంపించారు. నిబంధనల ప్రకారం కేసీఆర్ తరఫున న్యాయవాదులను లోపలికి అనుమతించేందుకు సిట్ అధికారులు నిరాకరించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి ఉదయం బయలుదేరి మధ్యాహ్నం వరకు నందినగర్‌కు చేరుకున్న కేసీఆర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి విచారణలో పాల్గొన్నారు. ఈ కేసు విచారణ తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## అంబటి రాంబాబుకు 14 రోజులు రిమాండ్

**గుంటూరు,ఫిబ్రవరి 1:** ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలుచేసారన్న ఆరోపణలపై అరెస్టు అయిన వైఎస్సార్సీపీనేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు. అంబటిని శాంతిభద్రతల దృష్ట్యా రాజమండ్రి జైలుకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్యపరీక్షలు పూర్తిచేసిన తర్వాత అంబటిని స్పెషల్‌మొబైల్‌కోర్టులో హాజరపరిచిన పోలీసులు అంబటి వివాదాస్పద ప్రకటనలతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నదని ఆయనపై 16 కేసులు నమోదయి ఉన్నాయని పోలీసులు వాదనలు వినిపించారు. కుట్రపూరితంగానే కేసులునమోదుచేసారని వాదనలు చేసినా న్యాయమూర్తి మాత్రం 14 రోజులు రిమాండ్ విధించారు. మరో కేసులో స్టేషన్ బెయిల్ లభించింది.

# 4.45 గం. విచారణ

>> ఫ్లోర్‌లో ఈ విచారణ సాగింది. విచారణ సమయంలో కెటిఆర్, హరీష్ రావు సహా ఎవరినీ అనుమతించలేదు. న్యాయ సలహాదారు రామచంద్రరావు, సంతోష్ రావును మాత్రమే అనుమతించారు. కాగా కెసిఆర్ విచారణలో సి ట్ అధికారులు ఆడియో, వీడియో సాక్ష్యాలు, ఆధారాలతో పక్కాగా ప్రశ్నించారని తెలిసింది. ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుకు రెండుసార్లు ఎ క్స్‌టెన్షన్ ఎందుకు ఇచ్చారు..? ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధం కాదా...? ఏం ఆశించి దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు...? దీంతో పాటు అప్ప ట్లో వేలాది ఫోన్‌ల ట్యాపింగ్ వెనుక వున్న మర్మమేమిటీ...? అనే కోణంలో కెసిఆర్‌ను విచారించినట్లు తెలిసింది. కెసిఆర్ విచారణకు సిట్ ఉప బా స్‌గా వున్న సిటీ ఎస్‌బి జాయింట్ పోలీసు కమిషనర్ విజయ్ కుమార్, సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు, కుత్బుల్లాపూర్ డిసిపి రితిరాజ్, అదనపు ఎస్పి ఎ. శ్రీనివాసరావు, జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరిలు పాల్గొన్నారు. గతంలో విజయ్ కుమార్ పశ్చిమ మండల డిసిపిగా వున్న సమయంలోనే ఫోన్ ట్యాపింగ్ వెలుగు చూసింది. అప్పట్లో ఏర్పాటైన మొదటి సిట్‌లో



ఎర్రవల్లి నుంచి హైదరాబాద్ వస్తున్న కెసిఆర్ వాహనశ్రేణిపై అభిమానుల గులాబీపూల వాన దృశ్యం

ఆయన సభ్యుడుగా వున్నారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ తుది దశకు చేరింది. 2024 మార్చిలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ పై మొదట పంజాగుట్టలో కేసు నమోదు కాగా దీనిపై విచారణకు ఎసిపి స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయగా దాదాపు రెండేళ్లు ఈ సిట్ వి చారణ సాగించింది. రెండు నెలల క్రితం దీనిపై సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నేతృత్వంలో మరో సిట్‌ను ఏర్పాటు చేశారు. మొదటి సిట్ హయాంలో న లుగురు పోలీసు అధికారులు అరెస్టంగా మీడియా అధినేత శ్రవణ్ రావు ముందస్తు బెయిల్ పొంది విచారణకు హాజరుకాగా ఎస్ఐబి మాజీ బాస్ ప్ర భాకర్ రావు అమెరికా నుంచే ముందస్తు బెయిల్ పొంది మొదటి సిట్ సమయంలో లేఖలు పంపి విచారణ ముగించగా రెండవ సిట్ ఏర్పాటయ్యా క విచారణకు హాజరయ్యారు. ఈ క్రమంలోనే ప్రభాకర్ రావును పోలీసులు కోర్టు అనుమతితో రెండు వారాల పాటు పోలీసు కస్టడీలో వుంచి ప్రశ్నిం చారు. ప్రభాకర్ రావు విచారణలో ఎలాంటి వివరాలు వెల్లడికాలేదని సిట్ అధికారులు సుప్రీం కోర్టుకు తెలిపారు.

కెసిఆర్ విచారణ మధ్యాహ్నం మూడు గంటలకు మొదలవగా ఆయన 12 గంటల కే తన ఇంటికి వచ్చారు. పోలీసులు కూడా అదే సమయంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలను ట్రంకు పెట్టెలో వుంచి కెసి ఆర్ ఇంటికి తీసుకు వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలకు మొదలైన కెసిఆర్ విచారణ రాత్రి ఏడు గంటల 45 నిమిషాల వరకు సాగింది. ప్రభాకర్ రావుపై అంత ప్రేమ చూపాల్సిన అవసరం ఎందుకు వచ్చింది...? ఆయనతో మీకు ఎంతకాలం నుంచి పరిచయం వుంది...? మీ సామాజిక వర్గానికి చెందిన అధికారి అయినందున, మీ ప్రోద్బలం వల్లే ప్రభాకర్ రావుకు పదవీ విరమణ తరువాత కూడా రెండుసార్లు ఎక్స్‌టెన్షన్ లభించిందా...? అని సిట్ అధికారులు కెసిఆర్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. నిఘా విభాగంలో ఎంతో కీలకంగా వుండే ఎస్ఐబికి బాస్‌గా పదవీ విర మణ చేసిన అధికారిని కొనసాగించడం నిబంధనలకు విరుద్ధమని మీకు తెలుసా...? ఒకవేళ తెలిస్తే...? ఇలా ఎందుకు చేశారని కెసిఆర్‌ను సిట్ అ ధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ వల్లే మీ పార్టీకి వందల కోట్ల రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్లు వచ్చాయా...? కొందరు వ్యాపారులను బెదిరించి విరాళాలు సేకరించారా...? అని సిట్ అడిగినట్లు సమాచారం. అప్పట్లో వెలుగు చూ సిన మొయినాబాద్ ఫాం హౌస్ ఎంఎల్‌ఎల కొనుగోలు ఆడియోలు మీకు ఎలా అందాయి...? ఎవరు వీటిని అందించారు. ఇది కూడా ఫోన్ ట్యా పింగ్ వల్లే సాధ్యమయ్యిందా...? అని కెసిఆర్‌ను సిట్ అధికారులు అడిగినట్లు సమాచారం. ఈ కేసులో అరెస్టయిన నలుగురు అధికారులతో పాటు నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు చెప్పినట్లుగా సుప్రీం పెద్దాయన అంటే మీరేనా...? ఇంకా ఎవరైనా వున్నారా...? అని సిట్ అధికారులు కెసిఆ ర్‌ను అడిగినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌లోకు సహకరించిన రాజకీయ నేతలు, మీడియా అధినేతలు, పోలీసు అధికారులు ఎవరు...? అని కెసిఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. మీడియా అధినేత శ్రవణ్ రావుతో మీకు వున్న సంబంధాలు ఏమిటీ...? ఫోన్ ట్యాపింగ్‌లో ఆ యన పాత్ర ఏమిటీ...? ఎవరి ఫోన్లు ట్యాపింగ్ చేయాలనే దానిపై జాబితాను రోజువారిగా శ్రవణ్ రావు ఏ హోదాలో ఎస్ఐబి నాటి బాస్ ప్రభాకర్ రావుకు అందించారు...? ఇందులో మీ పాత్ర ఎంత వరకు వుంది...? అసలు ఫోన్ ట్యాపింగ్ అక్రమమని మీకు తెలుసా,..? ఈ నేరం రుజువైతే కఠిన శిక్షలు పడుతాయని విషయం మీకు తెలుసా,..? అని కెసిఆర్‌ను అడిగినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్‌లో అరెస్టయిన పోలీసు అధికారు లు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావుల వాంగ్మూలంతో పాటు పోలీసు కస్టడీలో ప్రభాకర్ రావు వెల్లడించిన అన్ని విషయా లను కెసిఆర్ ఎదుట వుంచిన సిట్ అధికారులు వాటికి సమాధానాలు రాబట్టారని తెలిసింది. దీంతో పాటు ఎంఎల్‌సి నవీన్ రావు, అగ్రనేతలు హ రీష్ రావు, కెటిఆర్, మాజీ ఎంపి సంతోష్ రావులు ఇదే కేసులో వెల్లడించిన వివరాల ఆధారంగా సిట్ అధికారులు కెసిఆర్‌ను గుచ్చి గుచ్చి ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. కాగా సిట్ ప్రశ్నలకు చాలా వాటికి కెసిఆర్ సరైన సమాధానాలు చెప్పలేదని సమాచారం. కొన్నింటికి పొడిపొడిగా ముక్తసరి గా సమాధానాలు చెప్పారని తెలిసింది. మరికొన్నింటికి మౌనం వహించినట్లు తెలిసింది.

విచారణ తరువాత కెసిఆర్ మీడియాతో మాట్లాడకుండా బ యటవున్న పార్టీ కార్యకర్తలకు అభివాదం చేశారు. ఆయన వెంట కెటిఆర్‌తో పాటు సబితా ఇంద్రారెడ్డి తదితరులున్నారు. కాగా కెసిఆర్ విచారణ అ ంతా సిట్ అధికారులు వీడియో ద్వారా రికార్డింగ్ చేశారు. కాగా కెసిఆర్ విచారణ తరువాత సిట్ బృందంలోని సభ్యులు సిట్ బాస్ సజ్జన్నార్‌తో భే టీ అయ్యారు. కెసిఆర్ విచారణ జరిగిన తీరును వారు ఆయనకు వివరించారు. విచారణలో వెలుగు చూసిన అంశాలను వారు సజ్జన్నార్‌కు వివరిం చారు. రెండు ట్రంకు పెట్టెలలో వున్న ఆధారాలు, సాక్ష్యాలను సిట్ బృందం సజ్జన్నార్‌కు చూపించింది.

## శాఖల వారీగా కేటాయింపులు (కోట్లలో)

| | |
|---|---|
| ఆర్థికశాఖ | రూ.19,72,509.48 |
| రక్షణశాఖ | రూ.7,84,678.28 |
| రోడ్డురవాణా హైవేలు.. | రూ.3,09,875.30 |
| రైల్వేలు | రూ.2,81,377.32 |
| హోం వ్యవహారాలు | రూ.2,55,233.53 |
| ఆహార ప్రజాపంపిణీ | రూ.2,39,521.37 |
| ఎరువులు | రూ.17,70,061.47 |
| రైతు సంక్షేమం | రూ.1,40,528.78 |
| విద్యశాఖ | రూ.1,39,289.48 |
| కుటుంబసంక్షేమం | రూ.1,06,530.42 |
| కమ్యూనికేషన్లు | రూ.1,02,267.02 |
| జల్‌శక్తి | రూ.94,807.84 |
| హౌసింగ్ | రూ.85,522,39 |
| సైన్స్ టెక్నాలజీ | రూ.38,260.94 |
| పునరుత్పత్తి విద్యుత్ | రూ.32,914.67 |
| కార్మిక, ఉపాధిరంగం | రూ.32,666.31 |
| పెట్రోలియం, గ్యాస్ | రూ.30,44.3.22 |
| విద్యుత్ | రూ.29,996,85 |
| మహిళా శిశుసంక్షేమం. | రూ.38,183.06 |
| ఎంఎస్ఎంఇ రంగం | రూ.24,566.27 |
| అణువిద్యుత్ | రూ.24,123.92 |
| విదేశాంగశాఖ | రూ.22,118.97 |
| ఎలక్ట్రానిక్స్ ఐటిశాఖ | రూ.21,632.96 |
| వాణిజ్యం పరిశ్రమలు | రూ.17,843.90 |
| గిరిజన వ్యవహారాలు | రూ.15,421.97 |
| సామాజిక న్యాయం | రూ.15,357.31 |
| అంతరిక్షవిభాగం | రూ.13,705.63 |
| వృత్తినైపుణ్యం | రూ.9885.80 |
| మత్స్య,పశుసంవర్ధకం | రూ.8915.26 |
| భారీ పరిశ్రమలు | రూ.7839.90 |
| ఈశాన్యరాష్ట్రాలఅభివృద్ధి | రూ.6812.30 |
| కార్పొరేట్ వ్యవహారాలు | రూ.5561.86 |
| న్యాయశాఖ | రూ.5513.39 |
| అర్థగణాంకశాఖ | రూ.5502.89 |
| వస్త్రపరిశ్రమ | రూ.5279.01 |
| ఓడరేవులు,వాటర్‌వేస్ | రూ.5164.80 |
| యువజన, క్రీడలు | రూ.4479.88 |
| ఆయుష్ | రూ.4408.93 |
| ఆహారశుద్ధిపరిశ్రమలు | రూ.4064.16 |
| గనులశాఖ | రూ.3806.45 |
| ఎర్త్‌సైన్సెస్ | రూ.3789.23 |
| వాతావరణ మార్పులు | రూ.3759.46 |
| బొగ్గు | రూ.3635.32 |
| సాంస్కృతికం | రూ.3416.63 |
| మైనార్టీ వ్యవహారాలు | రూ.3,400 |
| పింఛన్లు | రూ.2662.01 |
| పర్యాటకరంగం | రూ.2438.40 |
| పౌరవిమానయానం | రూ.2102.87 |
| సహకారరంగం | రూ.1744.74 |
| ప్రణాళికా విభాగం | రూ.1232.16 |

## సింగరేణిపై కమిటీ నివేదిక అందింది: కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి1:** సింగరేణి కాలరీస్ కంపెనీ వ్యవహారాలపై అధికారుల కమిటీ నివేదిక అందిందని బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. దీనిని పరిశీలించాల్సి ఉందని ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సింగరేణిలో ఎక్కువ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.51,000 కోట్లు సంస్థకు బకాయి పడిందని చెప్పారు. కాగా, నైనీ బొగ్గు గనుల టెండర్లు,సిఎస్ఆర్ నిధులపై వివాదం నెలకొనడం తెలిసిందే.

# తెలంగాణను విస్మరించిన కేంద్ర బడ్జెట్

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 01:** కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా దేశాభివృద్ధితోపాటు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను ఏమాత్రం ఉపయోగపడే విధంగాలేదని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రూ. 14 లక్షల కోట్ల అప్పులు, వడ్డీలు కట్టాల్సి వస్తున్నదని, పని దినాలు పెంచామని చెప్పినప్పటికీ వీబీ జీరాంజీ పథకానికి కేవలం రూ. 93 వేల కోట్లు కేటాయించి గతంలో పోలిస్తే కోత పెట్టారని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి నిధులు తగ్గించారన్నారు. ఈ రంగాలకు గతంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు చేయలేదని... కానీ దేశంలో కార్పొరేట్ సంస్థలైన ఆదానీ, అంబానీ తదితరులకు డేటా సెంటర్ల పేరుతో రాయితీలు ప్రకటించారని విమర్శించారు. సంక్షేమ పథకాలు, ఎరువుల రాయితీలు, చిన్న పరిశ్రమలకు ఎలాంటి రాయితీలు ప్రకటించలేదని, ఉద్యోగులకు ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచకుండా నిరాశపరిచిందన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రానికి వాటాగా రావలసిన నిధులను తగ్గించారని, పన్నుల వాటాలో 2.11 శాతం ప్రకారం రూ. 63 వేల కోట్లు రావాల్సి ఉండగా.. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 4 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి కొనసాగేట్లు కనిపిస్తున్నదన్నారు. జీఎస్టీ పన్నుల వల్ల ఇప్పటికే రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోయామని తుంటే పన్నుల వాటాను కేంద్రం తగ్గించిందన్నారు. పాలమూరు, రంగారెడ్డి సాగు నీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా యివ్వాలని కోరు తున్నా వాటి ఊసే లేదని జాన్‌వెస్లీ మండి పడ్డారు. హైదరాబాదు మెట్రో రైల్ విస్తరణకు నిధులు ఇవ్వలేదని, ఫార్మా రంగానికి అవసరమైన నిధులు కేటాయించ లేదన్నారు. ఇక విద్యా, వైద్య రంగాలు పూర్తిగా కార్పొరేట్‌మయమవుతున్న పరిస్థితుల్లో పేదలకు ఆ రంగాలు అందుబాటులోకి తేవడానికి తగినన్ని నిధులు కేటాయించ వాల్సి ఉండగా అది కూడా చేయలేదన్నారు. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు.. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవన్నారు. రాష్ట్రంలో 8మంది బిజెపి ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో విఫలం చెందారన్నారు. సామాజిక తరగతులు, శ్రామిక వర్గాల ప్రయోజనాలకు కేటాయింపులు చేయకుండా కార్పొరేట్ ప్రయోజనాలకే ఉపయోగపడే విధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని జాన్‌వెస్లీ విమర్శించారు.



ఆదివారం హైదరాబాద్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# మరణించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం

### నగదుతో పాటు సౌమ్యకుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం: మంత్రి జూపల్లి

### సౌమ్య మృతి పట్ల సిఎం రేవంత్, మహేశ్‌కుమార్‌గౌడ్ సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి1:** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య(25) కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. రూ.కోటి నగదు, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ కొలువు ఇవ్వనున్నట్లుగా మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. విధి నిర్వహణలో గాజుల సౌమ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎక్సైజ్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయుధాలను సమకూర్చుతామని జూపల్లి కృష్ణారావు చెప్పారు. నిజామాబాద్‌లో జనవరి 23వ తేదీన అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు తన ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా సౌమ్య ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్రమ రవాణాదారులు ఆమెను వాహనంతో బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో సౌమ్యకు చికిత్స అందించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆమె శనివారం రాత్రి కన్నుమూశారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మృతికి కారణమైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను ఆదేశించారు. సౌమ్య కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని సీఎం హామీ ఇచ్చారు.గంజాయి స్మగ్లర్ల దాడిలో తీవ్రంగా గాయపడి, నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో భాగంగా అక్రమ గంజాయి రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో ఆమె ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన సౌమ్య సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని, ఇలాంటి దారుణ ఘటనలు ప్రజాస్వామ్య సమాజానికి మచ్చగా మిగులుతాయని అన్నారు. గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం కలచివేసిందని కల్వకుంట్ల కవిత అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కవిత కోరారు.అందివచ్చిన కుమార్తె మృతిపట్ల ఆమె తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమ ముద్దు కుమార్తె ఇక లేదనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం

### కేంద్ర మొండివైఖరిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 01:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం సామాజిక న్యాయ స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీసినట్టేనని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. బడ్జెట్‌ను పరిశీలిస్తే దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతిపై కేంద్ర ప్రభుత్వానికి కనీస చిత్తశుద్ధి కూడా లేదన్న విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఉపాధి, విద్య, ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ వర్గాల భవిష్యత్తును పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు వివిధ కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణ అభివృద్ధి, సామాజిక సంక్షేమ అంశాలపై విన్నవించినా, కేంద్రం మాత్రం మొండి వైఖరితో వ్యవహరిస్తోందన్నారు.

# నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

### ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహణ

### 5,26,192 మంది విద్యార్థులు.. 1440 కేంద్రాలు ఏర్పాటు

### సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పర్యవేక్షణ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 01:** తెలంగాణ రాష్ట్రంలో నేటి(సోమవారం) నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షల కోసం ఇంటర్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిర్వహణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. ఈ ఏడాది సీసీ కెమెరాలు ఉన్న కాలేజీలకు మాత్రమే ఇంటర్ బోర్డు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 5,26,192 మంది విద్యార్థులు హాజరు కానుండగా.. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1440 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఎంపీసీ విద్యార్థులు 2,74,007 మంది, బైపీసీ విద్యార్థులు 1,33,415 మంది హాజరు కానుండగా.. ఒకేషనల్ విద్యార్థులు 1,18,770 మంది హాజరు కానున్నారు. మొత్తంగా ప్రాక్టికల్ పరీక్షలకు 5,26,192 మంది హాజరు కానున్నారని.. వారి కోసం 1440 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం సెషన్‌ను 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు 7559 మంది ఎగ్జామినర్లను నియమించారు. వారిలో 1814 మంది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లను ఎగ్జామినర్లుగా నియమించగా.. 3856 మంది ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో పనిచేసే లెక్చరర్లను ఎగ్జామినర్లుగా నియమించారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్ల లింక్‌ను ఇంటర్ బోర్డు విద్యార్థుల ఫోన్ నంబర్లకు పంపించింది. దీంతో విద్యార్థులు కాలేజీలకు వెళ్లకుండా నేరుగా తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే వీలు ఏర్పడనుంది.

# కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులు రాజకీయ కక్షసాధింపు చర్యలే: హారీశ్‌రావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి1:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ఎస్ఐటి కాదని, సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్ అని ఆయన కొత్త అర్థం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల నుంచి ఫోన్‌లో ఏది చెబితే, పోలీసులు ఇక్కడ అదే పాటిస్తున్నారని ఆరోపించారు. సిట్ స్వతంత్రంగా పనిచేయడం లేదని, సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారమే నడుచుకుంటోందని, 'సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్' అన్నట్లుగా వారి వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. మాజీ సిఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో పరాకాష్ఠ అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఈ నోటీసుల వెనుక చట్టం లేదని, కేవలం సీఎం రేవంత్ రెడ్డి అహంకారం, రాజకీయ ప్రతీకారం మాత్రమే ఉన్నాయని ధ్వజమెత్తారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన నేతకు కనీస మర్యాద ఇవ్వకుండా, ఆయన నివాసం ఎక్కడ ఉందో రాష్ట్రమంతటికీ తెలిసినా, నందినగర్‌లోని ఇంటి గోడకు నోటీసులు అంటించడం కాంగ్రెస్ ప్రభుత్వ చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. పాలన చేతకాక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే ఈ సిట్ డ్రామా ఆడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. వరుస కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చరిత్రను సృష్టించిన వ్యక్తి కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు చట్టబద్ధం కానప్పటికీ, అనుసరించిన విధానం రాజ్యాంగ విరుద్ధమైనప్పటికీ.. కేసీఆర్ ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా, భారత పౌరుడిగా దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారని హరీశ్ రావు స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని, గజ్వేల్ నుంచి హైదరాబాద్ వరకు వేలాది మందిని మోహరించి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రైతుల కష్టాలు, యువత ఉద్యోగాలు, పింఛన్ల పెంపు వంటి అంశాలను గాలికొదిలి, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు.

# 8,294 కేసులు పరిష్కారం పెండింగ్‌లో 14,392

### సమాచార కమిషన్ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** సమాచార హక్కు చట్టంలో భాగంగా వివిధ అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులపై రాష్ట్రం సమాచార కమిషన్ దృష్టిసారించింది. ఈ ఇందులో భాగంగా పెండింగ్ కేసులను త్వరిత గతిన పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అంతేకాకుండా సమాచార హక్కు చట్టం వార్షిక నివేదిక సైతం సిద్ధమైంది. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలు, ప్రభుత్వ శాఖల్లో దరఖాస్తుల పెండింగ్, కమిషన్ వద్ద పెండింగ్ కేసుల వివరాలన్నీ వార్షిక నివేదికలో పొందుపరుస్తారు. దీంతో చట్టం అమలులో లోటుపాట్లు, సమస్యలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. గత ఏడాది జూన్‌లో బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర సమాచార కమిషన్ చట్టం అమలులో లోటు పాట్లపై ముఖ్యంగా దృష్టి సారించింది. ఉమ్మడి రాష్ట్రం 2012 నుంచి ఉన్న పెండింగ్‌లోని వేలాది దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాము బాధ్యతలు స్వీకరించేనాటికి 22,686 కేసులు పెండింగులో ఉన్నాయన్నారు.

# టిటిడి కొత్త ఇఒగా ముద్దాడ రవిచంద్ర



**తిరుమల, ఫిబ్రవరి 1ప్రభాత వార్తప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధిచెందిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం పరి పాలన వ్యవహారాలం చక్కబెట్టేందుకు ఇఒగా నియమితులైన సీనియర్ ఐఎఎస్ అధికారి, సిఎం కార్యాలయం ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర నిజాయితీ. సమర్థవంతమైన అధికారి అని అధికార వర్గాల్లో చర్చమొదలైంది. ఏ శాఖలో ఏ బాధ్యతల్లో ఉన్నా తనకు అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించే అధికారిగా రవిచంద్ర పేరుతెచ్చుకున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వ్యక్తిగత పేరు కంటే ప్రభుత్వానికి పేరురావాలని ఆయన కష్టపడిపనిచేసే తత్త్వం అలవరచుకున్నారనేది ఆయన అనుచరుల మాట. 1996 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన శ్రీకాకుళం జిల్లా వాసి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో రంగారెడ్డి జిల్లా సంయుక్తకలెక్టర్‌గా అప్పట్లో సంచలనం సృష్టించారు. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో మంచి అధికారిగా పేరుంది. 2008-2009లో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా, అంతకు ముందు డిఆర్‌డిఎ పిడిగా బాధ్యతలు నిర్వహించారు, చిత్తూరుజిల్లాతో మంచి అనుబంధం కలిగి ఉన్నారు. జిల్లా కలెక్టర్‌గా ఆయన జిల్లా ప్రజలకు చేరువై అనేక సమస్యలు పరిష్కారంలో తనదైన శైలిలో పాలనసాగించారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ముఖ్యంగా ఆయన ఆర్థికశాఖ, సాంఘిక సంక్షేమం, వైద్యఆరోగ్య శాఖల్లో కీలక పదవుల్లో సమర్థవంతమైన పనితీరు సాగించారు.

ప్రస్తుతం ఆయన ముఖ్య మంత్రి చంద్రబాబు పేషీలో ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

# సంత్ కవి సంత్ శిరోమణి రవిదాస్‌కు నివాళులు అర్పించిన

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** సామాజిక సంస్కర్త, సంత్ కవి సంత్ శిరోమణి రవిదాస్ జయంతి సందర్భంగా నాంపల్లి బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు రవిదాస్ చిత్రపటానికి పుష్పాంజలి అర్పించి ఘన నివాళులు అర్పించారు. సంత్ రవిదాస్ బోధనలు సమానత్వం, సామరస్యం, మానవత్వంపై ఆధారపడి మన సమాజాన్ని గౌరవం, సోదరభావం, సామాజిక ఐక్యత వైపు నడిపిస్తున్నాయన్నారు. ఆయన జీవితాంతం వెనుకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతికి అంకితభావంతో చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ శక్తివంతమైన ప్రేరణగా నిలుస్తున్నాయి. మన బాధ్యత సమానత్వం, ఐక్యత, సామాజిక న్యాయం వంటి విలువలను అందరికి విస్తరించడమే అన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా

### కార్పొరేట్లకు వరంగా కేంద్ర బడ్జెట్.. సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 01:** ఆదివారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌లో తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, ఇది పూర్తిగా నిరాశజనకమని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రం నుండి కేంద్రానికి వేల కోట్ల రూపాయల పన్నులు వెళ్తున్నప్పటికీ, తిరిగి నిధులు కేటాయించడంలో కేంద్రం మరోసారి తెలంగాణ పట్ల వివక్ష చూపిందని మండిపడ్డారు. విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తకపోవడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిలేమికి నిదర్శనమన్నారు. వ్యవసాయ ఆధారిత దేశంలో, రైతుల సంక్షేమాన్ని కేంద్రం గాలికి వదిలేసిందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) చట్టంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. ఎరువుల సబ్సిడీలలో కోత విధించడంతో రైతులపై పెనుభారం మోపుతుందన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులు ఎప్పటినుండో కోరుతున్నట్లుగా, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తివేయకపోవడం శోచనీయమని, ముడి సరుకుల ధరలు పెరిగి నేతన్నలు ఇబ్బంది పడుతుంటే, బడ్జెట్‌లో వారికి ఎలాంటి ఊరట కల్పించలేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడం వల్ల నిత్యావసర ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతుంటే, యువతకు ఉపాధి కల్పించే నిర్దిష్ట ప్రణాళికలేవీ ఈ బడ్జెట్‌లో లేవని, తెలంగాణకు రైల్వే లైన్లు, కోచ్ ఫ్యాక్టరీ, విమానాశ్రయాల అభివృద్ధి, భారత్ ఫ్యూచర్ సిటీ, మెట్రో కారిడార్, నిరుద్యోగం రూపు మాపేందుకు, ఉద్యోగ, ఉపాధి మార్గాలు, కొత్త జాతీయ రహదారులకు

బడ్జెట్‌లో ఏమాత్రం కేటాయింపులు లేకపోవటం కాంగ్రెస్ ప్రభుత్వంపై వివక్ష చూపిందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మండిపడ్డారు. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా అంకెల గారడీ తప్పా... పేద, మధ్య తరగతి, రైతు, మహిళలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఇది పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని, రాష్ట్ర హక్కుల సాధన కోసం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పుతామని స్పష్టం చేశారు.



# మెజారిటీ స్థానాలను గెలవడమే లక్ష్యం

### మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బి ఫాం అందించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రతి చోటా పోటీలో నిలిచిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో మున్సిపల్, కార్పొరేషన్లలో మేయర్, ఛైర్మన్ పీఠాలను సాధించడం, అలాగే మెజారిటీ స్థానాలను గెలవడం భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యం అన్నారు. పార్టీ అభ్యర్థులందరితో సమగ్ర సంప్రదింపులు జరిపి, సమిష్టి నిర్ణయంతో టికెట్లు కేటాయించి, బిఫామ్ ఇవ్వడం జరిగిందని, గెలిచే అవకాశం ఉన్న స్థానాల్లోనే టిక్కెట్లు కేటాయించామన్నారు. టిక్కెట్లు పొందని కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, తక్షణమే పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా వ్యవహరించడం క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణించబడుతుందన్నారు. పార్టీ టికెట్ పొందని కార్యకర్తలు, అసంతృప్తితో ఇతర కారణాల వల్ల ఇండిపెండెంట్, ఇతర మార్గాల ద్వారా నామినేషన్ వేస్తే, అది పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించడమే అవుతుందన్నారు. అలాంటి సందర్భాల్లో నామినేషన్లను ఉపసంహరించుకోవాలని సూచిస్తున్నాం. పార్టీ నియమావళి ప్రకారం కఠిన క్రమశిక్షణ చర్యలు తప్పనిసరి అన్నారు. భారతీయ జనతా పార్టీలో ప్రతి కార్యకర్తకు సముచిత న్యాయం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని, పార్టీలో ఉండి ఇతర పార్టీ తరఫున నామినేషన్ వేయడం ద్వారా నియమావళిని ఉల్లంఘించినవారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఈ నిర్ణయం జాతీయ నాయకత్వ ఆదేశాల మేరకు తీసుకోబడిందని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యం అన్నారు. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టే దిశగా ప్రజలు, కార్యకర్తల సమగ్ర భాగస్వామ్యం అత్యంత ముఖ్యమే అన్నారు.

# కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి మొండి చేయి: మండిపడ్డ విద్యార్థి సంఘాలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 01:** కేంద్రం ప్రవేశ పెట్టిన రూ. 53.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ. 1,39,289 కోట్లను కేటాయించడం పట్ల విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయని, దేశ భవిష్యత్తును నిర్మించే విద్యారంగాన్ని ప్రాధాన్యంగా చూడాల్సిన సమయంలో, కేంద్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా పక్కన పెట్టిందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) విమర్శించింది. బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించింది రూ.1,39,289 కోట్లు మాత్రమేనని, ఇది మొత్తం కేంద్ర బడ్జెట్‌లో సుమారు 2.6 శాతం మాత్రమేనని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. జీడీపీలో విద్యకు 6 శాతం ఖర్చు చేయాలనే లక్ష్యానికి ఇది చాలా దూరంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమి కొనసాగుతున్నప్పటికీ, నిధుల పెంపు జరగలేదన్నారు. దేశవ్యాప్తంగా వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే విధానం అమలవుతుండటం అత్యంత ఆందోళనకరమన్నారు. మహిళా విద్యను పెంచటానికి నూతనంగా జిల్లాకు ఒక బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు కానీ.. అందుకనుగుణంగా నిధులు కేటాయింపులు చేయలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం చేసిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందన్నారు.12 ఏళ్ల మోడీపాలనలో విద్యా రంగానికి కేటాయింపులు తగినమొత్తంలో జరగటంలేదని.. ఈ ఏడాది రూ. 53.5 లక్షల కోట్ల మొత్తం బడ్జెట్లో విద్యకు కేటాయించిన నిధులు కేవలం రూ. 1,39,289 కోట్లు. ఇది మొత్తం బడ్జెట్లో 2.6 శాతం మాత్రమేనన్నారు. కేంద్ర బడ్జెట్ లో కనీసం 10 శాతం, జిడిపిలో 6శాతం నిధులు కేటాయించాలని అనేక సంవత్సరాలుగా విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా కూడా ప్రభుత్వం కనీసం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ విభజన హామీ చట్టంలో ఉన్న విద్యాసంస్థలను కేటాయించకుండా, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా అడుగడుగునా మొండి వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు.

# విద్యారంగానికి సరిపడా నిధులను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించ లేదు: మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 01:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపడా నిధులను కేటాయించ లేదని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. విద్యారంగానికి బడ్జెట్‌లో 6 శాతం నిధులను కేటాయించాల్సి ఉండగా.. ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 2.6 శాతం నిధులనే కేటాయించడంతో ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయింపులు సార్వత్రిక విద్యా సాధన లక్ష్యానికి దూరంగా ఉన్నాయని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ అన్నారు. గత సంవత్సరం రూ. 1,28,650 కోట్లు కెటాయించగా ఈ సంవత్సరం రూ. 1,39,289 కోట్లు కేటాయించారు. అంకెల్లో స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ మొత్తం బడ్జెట్ దామాషాలో తక్కువగానే ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ విద్యా రంగం, మధ్యతరగతి వేతన జీవుల ఆశలను పూర్తిస్థాయిలో ప్రతిబింబించలేకపోయిందని తెలంగాణ రాష్ట్ర టీచర్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజి రెడ్డి అభిప్రాయపడ్డారు. సాంకేతిక పరిజ్ఞానానికి, విదేశీ పెట్టుబడులకు బడ్జెట్‌లో పెద్దపీట వేయడం శుభపరిణామమే అయినప్పటికీ, దేశ భవిష్యత్తుకు పునాదులైన ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి, నిరంతరం పన్నులు చెల్లించే ఉద్యోగుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత లభించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.53.5 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ. 1,39,289 కోట్ల నిధులు విద్యకు కేటాయించారని టిపిటిఎఫ్ తెలిపింది. మొత్తం బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 2.6 శాతమే మాత్రమే కేటాయించారని పేర్కొంది.

**భారత్ డైనమిక్స్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వ రంగ సంస్థ, రక్షణ మంత్రిత్వ శాఖ)
CIN No.:- L24292TG1970GOI001353
కార్పొరేట్ కార్యాలయం: ప్లాట్ నం.38-39, TSFC బిల్డింగ్, ICICI టవర్‌ల దగ్గర, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రాంగూడ, హైదరాబాద్-500032
నమోదిత కార్యాలయం: కాంచన్‌బాగ్, హైదరాబాద్-500058
టెలి: 040-23456145, ఫ్యాక్స్: 040-23456110
ఇ-మెయిల్: investors@bdl-india.in, వెబ్‌సైట్: https://bdl-india.in

**31 డిసెంబర్ 2025 అంతమయ్యే తొమ్మిది నెలలు మరియు త్రైమాసికం కొరకు ఆడిటెడ్ కాని ఆర్థిక ఫలితాలు**

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ("ది కంపెనీ") యొక్క బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు కంపెనీ యొక్క ఆడిట్ కమిటీ యొక్క సిఫార్సుపై 31వ జనవరి 2026న నిర్వహించబడిన సమావేశంలో 31 డిసెంబర్ 2025 అంతమయ్యే తొమ్మిది నెలలు మరియు త్రైమాసికం కొరకు ఆడిట్ కాని ఆర్థిక ఫలితాలను ఆమోదించారు. ("ది రిజల్ట్స్")

పూర్తి ఫలితాలు లిమిటెడ్ రివ్యూ రిపోర్ట్‌తోసహా, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల యొక్క వెబ్‌సైట్ (www.bseindia.com పై ఉంచబడినవి మరియు www.nseindia.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ https://bdl-india.in/financial-results?field_financial_results_year_value=2025_26 మరియు క్రింద ఏర్పాటు చేయబడిన క్విక్ రెస్పాన్స్ (QR) కోడ్ స్కానింగ్‌చే కూడా పొందవచ్చును.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కొరకు
సం/-
Cmde. A. మాధవరావు (Retd.)
ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్
(DIN: 09808949)

ప్రదేశం : హైదరాబాద్
తేది : 31/01/2026

# ఈ యేడాది అనావృష్టి - ఎల్‌నినోతో నైరుతిపై ప్రతికూలం

### దేశంలో కరవు పరిస్థితులపై ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త** దేశంలో ఈ ఏడాది అనావృష్టి పరిస్థితులకు అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్‌లో రుతుపవన ప్రభావంతో కురిసే వర్షాలు ఈసారి తగ్గిపోయే అవకాశం ఉంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ వచ్చని కొన్ని వాతావరణ మోడళ్లు లెక్కగట్టాయి. వర్షాలు రాకకు కీలకంగా వ్యవహరిస్తున్న నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. దీనికి ఎల్‌నినో కారణమని ప్రముఖ ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. భూమధ్య రేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడే ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయని వెల్లడించింది. సరిగ్గా ఇది నైరుతీ రుతుపవనాలు ఊపందుకునే సమయంతో పాటుగా, ఉత్తరార్ధ గోళంలో శీతాకాలం గరిష్ఠస్థాయికి చేరుకుంటుంది. ఈ సమయంలో ఎల్‌నినో ప్రపంచ వాతావరణంపై ప్రభావం చూపనుంది. దీని ముప్పు ఎక్కువగా దక్షిణాసియా దేశాలపై ఉంటుందని పేర్కొంటోంది. అలాగే ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా, భారత ఉప ఖండంలోని దేశాల్లో వర్షపాతంపై తీవ్ర ప్రభావం పడనుంది అని స్కైమెట్ సంస్థ తొలిసారిగా అంచనా వేసింది. జూలై నెలలో ఎల్‌నినో ఏర్పడ వచ్చని, దీనితో కరువు పరిస్థితులు ఉత్పన్నమవుతాయని ఆసియా, పసిఫిక్ క్లైమేట్ సెంటర్ (ఏపీసీసీ) కూడా స్పష్టం చేసింది. ఏపీసీసీ అంచనా ప్రకారం ఉష్ణమండల పసిఫిక్ మహా సముద్రంలో గత నెల నుంచి లానినా బలహీనపడుతూ వస్తోంది. వచ్చే నెలకు పూర్తిగా బలహీనపడి తటస్థ పరిస్థితులు. ఏప్రిల్ నెలలో తటస్థ పరిస్థితుల ప్రభావం బలహీనపడి ఎల్‌నినో మొదలవుతుంది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరించే సమయంలోనే ఈ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండటం గమనార్హం. దక్షిణాసియా దేశాలపై ఈ ముప్పు ఎక్కువగా ఉండనుంది. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా దేశాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం.

వార్త

చాలా మంది తమ అంతరాత్మలోకి వచ్చే గొప్ప ఆలోచనల్ని నిర్లక్ష్యం చేస్తారు. కాని అవే ఆలోచనలు ఎదుటి వారిలో చూసి అంతగొప్ప ఆలోచన వచ్చినందుకు ఆశ్చర్యపోతారు.

న-సోమర్‌సెట్‌మామ్

# 'సాధారణ' పద్దు!

ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ సాధారణ బడ్జెట్‌గానే కనిపించింది. వికసిత్‌భారత్ లక్ష్యసాధన దిశగా కేంద్ర బడ్జెట్‌ను రూపకల్పనచేసినట్లుగా ఆర్థికమంత్రి నిర్మలమ్మ తన ప్రసంగంలో వివరించినప్పటికీ పెద్దగా ఊరడింపులేవీ కనిపించలేదు. పన్నుశ్లాబుల్లో పెద్ద మార్పులు లేకపోయినా రక్షణరంగం, మౌలికవనరుల రంగానికి అత్యధికప్రాధాన్యం ఇచ్చారు. అదేవిధంగా వ్యవసాయ రంగానికి కూడా కొంతప్రాధాన్యం పెంచారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశ రక్షణ సామర్థ్యం ప్రపంచానికి తెలిసింది. శతృదేశాల రక్షణ వ్యవస్థకు ధీటుగా భారత్ వ్యవస్థను మరింత శక్తివంతంచేసేందుకు బడ్జెట్‌లో రూ.7.85 లక్షల కోట్లు కేటాయింపులు జరిపారు. సంస్కరణల భారత్‌కు కొత్తశక్తి ఇచ్చేదిగా ఉందని చెపుతున్న ఈ బడ్జెట్‌లో మౌలికవనరుల రంగానికి అంటే రవాణా రంగానికి కూడా ప్రాధాన్యతను పెంచారు. ఈ బడ్జెట్‌లో 5.84 లక్షల కోట్లు కేటాయింపులు జరిపితే వ్యవసాయ రంగానికి రూ.1.62 లక్షలకోట్లు కేటాయించడం గమనార్హం. కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే అమలులోకి తెస్తామని కేంద్రం ప్రకటించింది. ఆర్థిక వ్యవస్థలో సంతులనం పాటిస్తూ మొత్తం ఆర్థిక లోటును జిడిపిలో 4.3శాతంగా ఉంటుందని అంచనా వేసిన కేంద్రం రాష్ట్రాలకు ఆర్థికసంఘం గ్రాంట్లుకింద రూ.1.4 లక్షలకోట్లు కేటాయించడం రాష్ట్రాల ఆర్థిక పరిపుష్టికి కొంతమేర ఫోకస్‌పెంచినట్లు తెలు స్తోంది. గడచిన పదేళ్లలోనే 25 కోట్లమంది పేదరికం నుంచి విముక్తి కాగలిగారని చెపు తున్న కేంద్రం సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ కర్తవ్య పథాన్ని వీడలేదని చెపుతూనే కీలక రంగాలకు మాత్రమే కేటా యింపులు పెంచింది. సెమి కండక్టర్ పరిశ్రమలకు ముందునుంచే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన మోడీ సర్కారు కొత్త బడ్జెట్‌లో బేసిక్ సుంకాల న్నింటినీ మినహాయించింది. ప్రత్యేకించి ఫార్మా రంగంలో సుంకాల మినహాయింపులిచ్చి మందులను అందుబాటు ధరల్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. ప్రధానంగా 17 ఔషధాలపై కస్టమ్స్ సుంకాలు మొత్తం తొలగించింది. బయోలాజిక్స్, బయోసిమిలర్స్ దేశీయ ఉత్పత్తి వ్యవస్థలకోసం బయోఫార్మా శక్తి కింద రూ.10 వేల కోట్లు కేటాయించడం ఈ రంగానికున్న ప్రాధాన్య తను తెలియజెప్పింది. సన్నచిన్నతరహా పరి శ్రమలకోసం ఎస్ఎంఇ గ్రోత్‌ఫండ్‌కింద రూ.10వేల కోట్లతో నిధి ఏర్పాటుచేసారు. బడ్జెట్‌లో మూల ధన వ్యయాన్ని గత బడ్జెట్‌కంటే పెంచింది. 12.2 లక్షల కోట్లకు పెంచింది. దీనివల్ల మౌలికవనరుల రంగంపై ఎక్కువ వ్యయం చేసేందుకు వీలుకలుగుతుంది. రవాణరంగ పరంగా హైస్పీడ్ కారిడారు చేర్చింది. పర్యాటకరంగాన్ని కూడాప్రోత్స హించేదిశగా కేంద్రంచేపట్టిన చర్యల్లో ఈసారి ఈశాన్యరాష్ట్రాలకుసైతం ప్రాధాన్యత ను పెంచింది. క్రీడల్లో మరింత రాణించేందుకు వీలుగా వచ్చే దశాబ్ద కాలానికిగాను ఖేలో ఇండియా మిషన్ ఏర్పాటు చేస్తోంది. ప్రధానంగా కృత్రిమమేధ వినియోగం అన్ని రంగాలకు విస్తరింపచేసేందుకువీలుగా వ్యవసాయ రంగంలోకూడా ఎఐ వ్యవస్థను మరింతగా పెంచాలని చూస్తోంది. టెక్నాలజీ ఆధారిత రంగాలకు ఇతోధిక ప్రాధాన్యం కల్పించిన ఆర్థిక మంత్రి బడ్జెట్ ఐటీ,ఐటి అనుసంధానిత రంగాలు కూడా ఉన్నాయి. మొత్తంగా చూస్తే 53.47 లక్షలకోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్టాక్ మార్కెట్లకు సైతం అంతగా రుచించలేదు. వ్యవసాయ, సహకార రంగాలకు ఇతోధిక ప్రాధాన్యం కల్పించారు. సన్న చిన్నకారు రైతులకు ప్రోత్సాహకరమైన వ్యవస్థలు తీసుకువస్తామని ప్రకటించిన ఆర్థికమంత్రి ప్రధానంగా పిఎం కిసాన్ పెంపుపై ప్రస్తావించలేదు. అదేవిధంగా వ్యక్తిగత పన్నుశ్లాబుల్లోను ఎలాంటి మార్పులను తీసుకు రాలేదు. అయితే ఈక్విటీ రంగాలపై పన్నుల భారం మాత్రం మోపారు. ఫ్యూచర్స్, ఆప్షన్స్‌పైనా పెంచిన కేంద్రం ఎల్టీసీజి, ఎస్టీసిజి, ఎస్‌టిటి వంటి వాటిపై చురకలువేసింది. గ్లోబల్ ట్యాలెంట్ వెలికితీతకు భారత్ లో ఐదేళ్లవరకూ పనిచేసిన ప్రవాసులకు పన్నుమినహా యింపులుప్రకటించారు. ప్రవాసులందరికీ కూడా కనీస ప్రత్యామ్నాయ పన్నునుంచి మినహాయింపులు ఇస్తున్నట్లు ఆర్థికమంత్రి వివరిం చారు. దేశీయ ఉత్పత్తిరంగాన్ని మరింతగా ప్రోత్స హించేందుకుగాను ఎగుమతులను మరింత పెంచే దిశగా కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ వ్యవస్థల్లో మార్పులు ఉంటాయన్నారు. ఉత్పత్తి రంగంలోప్రధానంగా ఇంధన రంగంలో భారీ యంత్ర పరికరాల తయారీకి లిథియమ్ ఇయాన్ సెల్ బ్యాటరీల తయారీకి సుంకాల మినహా యింపులు కూడా ఇచ్చింది. సంక్లిష్ట ఖనిజవనరులపైనా బేసిక్ సుంకాలను మినహాయించడంవల్ల ఆరంగాలకు కొంతమేర కేటాయింపులు జరిపారు. సేవలరంగంలో కృత్రిమమేధ వినియో గం పెంచుకోవాలని కేంద్రం టెక్నాలజీ రంగంపై ఎక్కు ఫోకస్ పెట్టింది. యథాప్రకారం సెమికండక్టర్ రంగంపై వ్యయం చేస్తోంది. సెమి కండక్టర్‌మిషన్‌కు రూ.40వేల కోట్లు కేటాయింపుల ద్వారా దిగుమతులపై ఆధార పడటాన్ని తగ్గించుకునే లక్ష్యాన్ని వ్యక్తంచేసింది. టెక్నాలజీ రంగానికి ప్రాధాన్యం బడ్జెట్ లో 2047 వరకూ పన్ను విరామాన్ని ప్రకటించారు. ఇంధన రంగంలో అణువిద్యుత్ ప్రాజెక్టులకు సుంకం మినహాయింపుల కొనసాగింపు, విమానయానరంగానికి ఈ సుంకాల నుంచి మినహాయింపులను ప్రకటించారు. గత సంవత్సరంతో పోలిస్తే మినహాయింపులేమీ లేకపోయినా పారిశ్రామిక, టెక్నాలజీ రంగాలకు వెన్నుదన్నుగా నిలుస్తుందని చెప్పుకోవచ్చు.

ఇతరులు అనుసరించడానికి తమనే ఉదాహరణగా తీసుకోవాలని తమకు తామే ఎవరైతే అనుకుంటారో, వారు అభివృద్ధి చెందలేరు.



గోల్డ్‌స్మిత్

చదువు డబ్బు లాంటిది. ఎంత సంపాదించినా అంతకంటే ఎక్కువ సంపాదించడానికి మనస్సు ఉబలాటపడాలి.



జోసఫ్ బిల్లింగ్స్

# ప్రజావాక్కు



### ఆర్థిక సర్వే ఆశాజనకం!

ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే 2026 రానున్న ఏడాది దేశానికి శుభప్రదం అని చెప్తోంది. వృద్ధి రేటు 7శాతానికి అటూ ఇటుగా ఉంటుందని భావిస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లను చూస్తున్న వేళ ఈ దిశగా వృద్ధి సాధించడం మంచి పరిణామం. ఈ యేడు దేశానికి మూలస్థంబంగా ఉన్న వ్యవసాయం దిగుబడుల్లో వృద్ధి చూపించింది. అలాగే సేవల రంగం కూడా పటిష్టంగా ఉండి మెరుగైన స్థితిలో ఉంది. డిజిటల్,మౌలిక సదుపాయాలు,తయారీ రంగాలుస్థిరంగా ముందుకు వెళ్తున్నాయి.అందుకనేనిలకడగా వృద్ధిరేటు ప్రగతిపథంలోనే సాగగలదని ప్రభుత్వపు అంచనా.అయితే రూపాయి విలువ తగ్గుతూ రావడం,అమెరికా విధానాలతో వాణిజ్యం ఒడిదుడుకులకు లోనవుతుండడం ముందున్న సవాళ్లు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### బియ్యంపై సుంకాల పెంపు

ఇటీవల భారత బియ్యంపై భారీసుంకాలు విధించే అవకాశాన్ని ప్రస్తావించడంతో,అంతర్జాతీయ వాణిజ్య వర్గాలలో కొత్త చర్చ మొదలైంది. అమెరికన్ రైతులు భారతదేశం తక్కువ ధరలకు బియ్యం డంపింగ్ చేస్తోందని ట్రంప్ వద్ద ఫిర్యాదుచేశారని వచ్చిన సమాచారం ఈ వివాదానికి మరింత ఊతమిచ్చింది.ఈపరిణామం భారతీయ బియ్యం ఎగుమతులపై మాత్రమే కాదు,రెండు దేశాల ఆర్థిక సంబంధాలపై కూడా స్పష్టమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఎగుమతి దేశం. నాణ్యత, ధరలో పోటీ సామర్థ్యం కారణంగా అనేక దేశాలు భారత బియ్యాన్ని కొనుగోలు చేస్తాయి.

- కె.నాగరాజు, నెల్లూరు

### సీనియారిటీ లిస్ట్

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న లెక్చరర్స్,టీచర్స్‌ను రాష్ట్రస్థాయిలో గురుకులాల సొసైటీల వారీగా సీనియారిటీ లిస్టు ప్రకటించాలి.ఎస్సీఎస్టీ బీసీమైనారిటీ వికలాంగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్స్ సౌకర్యంకల్పించాలి. అదనపు విద్య అర్హతలు,వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందినవారికి ప్రమోషన్ లిస్టులలో ప్రాధాన్యత కల్పించాలి. ఈవిద్యాసంవత్సరం చివరి నాటికి ప్రిన్సిపాల్ సీనియారిటీ లిస్టు ప్రకటించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### ప్రజల్లో అవగాహన అవసరం

భారతదేశంలో ఇటీవలి సంవత్సరాలలో బస్సు ప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రజల రవాణా అవసరాల కోసం బస్సుప్రయాణాలు పెరగడంవలన రహదారులపై వాహనాల సంఖ్య అధికమవుతోంది. అయితే, సరైన రహదారి ప్రమాణాలు లోపించడం, డ్రైవర్లలో అవగాహన కొరవడటం, బస్సు నిర్వహణ లోపాలు వంటి కారణాల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అతివేగం,డ్రైవర్ల అలసట, మోతాదు మించిన ప్రయాణికుల రద్దీకూడా ఈప్రమాదాలకు దోహదపడుతున్నాయి. ప్రతిరోజూఎందరో ప్రయాణికులు బస్సుద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటూ, తమ ప్రియమైన వారిని వదిలిపెట్టి ప్రాణాలను కోల్పోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాలలో, పొరపాట్లను పట్టించుకోకుండా డ్రైవర్లు బస్సులను వేగంగా నడపడం, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం ప్రమాద ఘటనలకు ప్రధాన కారణాలు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పద్మ అవార్డులు

కేంద్రప్రభుత్వం ఈసారి ప్రకటించిన పద్మఅవార్డ్స్ చాలా కింది స్థాయివ్యక్తులకు వారుచేసిన కృషిని గుర్తించినట్టుగా ఉన్నాయి. గత పది సంవత్సరాలుగా ఈ పని కొనసాగుతుంది. అందులో ముఖ్యంగా మొక్కలు పెంచడమే లక్ష్యంగా పని చేసిన వారికి అవార్డు ప్రకటించడం ద్వారా అవార్డులకు రాజకీయాలు దూరం అని చాటినట్టు అయింది. కేరళ రాష్ట్రంలో ఉన్న ఎన్నికల నేపథ్యంలో ఇచ్చారని అనుకున్నా టీ నారాయణన్ గురించి నేటి తరానికి తెలియజేప్పే అవకాశం కనీసం పత్రికల వాళ్లకు అయినా దొరికినందుకు సంతోషం.

- భారత అవినాష్, జనగామ

### ఆర్థిక సహాయం కల్పించాలి

విజ్ఞాన శాస్త్రాన్ని కేవలం వారి చదువులో భాగంగా పరిశోధన చేస్తూ ఒక దృక్పథంతో చేపట్టిన ప్రయోగ ఫలితాలు మనిషి జీవనానికి, ప్రాణరక్షణకు, సౌలభ్యానికి తోడ్పడే మహానుభావుల త్యాగం అమూల్యం,చిరస్మరణీయం.వాటి ఫలితాలు అనుభవించడం చాలా తేలిక. కావున అటువంటి ఆశయాన్ని, కృషిని గుర్తిస్తూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగంతో పాటు మరింత ముందుకు సాగేందుకు కృషి చేస్తే మరిన్ని రంగాల్లో కొన్ని సమస్యలు పరిష్కారం అవ్వొచ్చు. వీటికోసం దేశంలో పరిశోధన చేసే విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రోత్సాహం విరివిగా కల్పించాలి. వారికి అన్ని వనరులు కల్పించాలి.

-బి.మేఘనాథం, విశాఖపట్నం

# ఆకాశమార్గంలో ఆపదలు ఆపలేమా?

**ముఖ్యంగా దేశ జనాభా అవసరాలకు తగినన్ని ఎయిర్‌పోర్టు, విమానాలు, పైలెట్లు లేరన్నది వాస్తవం. అందువల్ల పైలెట్లపై పనిభారం పడుతున్నది. ఏ మనిషికైనా తగినంత విశ్రాంతి లేకపోతే, తీవ్ర ఆందోళనకు గురౌతాడు. ఇది కూడా ప్రమాదాలు జరగడానికి ఒక కారణమే. విమాన ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలాన్ని భద్రతా బలగాలు సీజ్ చేస్తారు. అక్కడ ఉన్న విమాన శకలాలను జాగ్రత్తగా సేకరిస్తారు. ముఖ్యంగా బ్లాక్ బాక్స్‌ను విశ్లేషణ చేస్తారు. ఇలా ఎంతో పగడ్బందీగా దర్యాప్తు చేస్తారు. ఐనప్పటికీ ప్రమాదానికి సరైన కారణాలను లిస్ట్ అవుట్ చేయలేక పోతున్నారు. ఇది మరిన్ని అనుమానాలకు దారితీస్తున్నది. చివరగా ఇంకో విషయం, ఏదైనా విమానం ప్రమాదంలో ఉందని తెలిసిన మరుక్షణంలో, ప్రయాణీకులు ముందస్తుగా ఎయిర్ బెలూన్లతో తప్పించుకునే అవకాశముందా? లేదా? అనే ప్రశ్నలకు నిపుణులు జవాబులు చెప్పాల్సిందే.**



పిల్లా తిరుపతిరావు

ప్రమాద సంఘటనలను నివారించడమే విమానయాన భద్రత ప్రాథమిక లక్ష్యం.కానీ ఇటీవలకాలంలో వరుస విమాన ప్రమాదాలను చూస్తున్నాం. ప్రయాణాల దూరగణాన్ని బట్టి చూస్తే విమానయానమే అత్యంత సురక్షితమైన రవాణా మార్గం. ఒక మైలుకుప్రాణాంతకమైన అన్ని ఇతర రవాణా విధానాలతో పోల్చినప్పుడు వాయు రవాణాయే సురక్షితం. కారులో ప్రయాణించడం కంటే ఆరురెట్లు, రైలులో ప్రయాణించడం కంటే రెండురెట్లు సురక్షితం విమానయానం. విమాన ప్రయాణాలు సురక్షితమని పలురకాల గణాంకాలు ఇలా చెబుతూనే ఉన్నాయి. అయినప్పటికీ ఎయిర్ క్రాఫ్ట్స్ కుప్పకూలుతూనే ఉన్నాయి. పొగమంచు, తక్కువ దృశ్యమాన్యత,ఉరుములు మెరుపులు వాతావరణం అల్లకల్లోలం లాంటి ప్రతికూల పరిస్థితులే విమాన ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. ఐతే ఎక్కువ గంటలు నిడివి గల విదేశీ విమానయానం కంటే తక్కువ గంటల దేశీయ విమానయానంలోనే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఎందుకలా జరుగుతున్నాయో! అర్థం కావడం లేదు. మానవ తప్పిదాలా? లేక సాంకేతిక లోపాలా? లేక ప్రతికూల వాతావరణ పరిస్థితులా? అనేది పలుదర్యాప్తుల అనంతరం కూడా మీమాంసగానే మిగులుతున్నది. భారత్ లోనైతే గతేడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ నుండి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేక్ ఆఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ పై కుప్పకూలింది. ఆ విమాన ప్రమాదం ఆనాడు జనం గుండెల్లో గుబులు రేపింది. 243 మంది ప్రయాణీకులలో ఒక్కరు తప్ప అందరూ మరణించారు. ఈసంఘటన భారత్ సురక్షిత విమానయానానికి పెను సవాల్ విసిరింది. మొన్నజరిగిన ప్రత్యేక విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చనిపోయారు. పైలెట్లు, సిబ్బంది కూడా మరణించారు. ప్రపంచ వ్యాప్తంగా 1970 నుంచి 2026 వరకు సుమారు11,200 విమాన ప్రమాద సంఘటనలు జరిగితే, దాదాపు 84 వేల మంది ప్రయాణీకులు మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఐతే విమాన ప్రమాద సంఘటనల్లో ప్రముఖులు చాలామంది చనిపోయారు. ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1945 ఆగస్టు 18న తైవాన్ మీదుగా టోక్యో వెళ్తూ టేక్ ఆఫ్ సమయంలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించినట్లు విశ్వసనీయ సమాచారముంది. ఐతే నేతాజీ మరణం ఇంకా మిస్టరీగానే మిగిలిపోయింది. 1966లో అణుశక్తి పితామహుడు హోమీబాబా ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో తనువు చాలించారు. 1980లో ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్ గాంధీ తాను నడుపుతున్న ఎయిర్ క్రాఫ్ట్‌కు బలయ్యాడు. 2001లో మాధవరావు సింధియా ఉత్తరప్రదేశ్‌లో గల మెయిన్ పురి దగ్గర విమాన ప్రమాదంలో చనిపోయారు. 2002లో లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి బాలయోగి కైకలూరు సమీపంలో తాను ప్రయాణిస్తున్న హెలికాప్టర్ చెట్టును ఢీ కొట్టగా చనిపోయారు. 2004లో సినీనటి సౌందర్యఎయిర్ క్రాఫ్ట్ ప్రమాదంలో మరణించారు.2009లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి నల్లమల అటవీ ప్రాంతం పావురాలగుట్టలో హెలికాప్టర్ ప్రమాదంలో పరమపదించారు.2011లో దోర్జీ ఖండూ అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి విమాన ప్రమాదంలో మరణించారు. 2021లో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ నీలగిరి జిల్లా



కూనూర్ సమీపంలో భారత వాయుసేన హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు. గతేడాది జరిగిన అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రివిజయ్ రూపానీ ప్రాణాలొదిలారు. ఈ ఏడాది బారామతి ఎయిర్ క్రాఫ్ట్ ప్రమాదంలో అజిత్ పవార్ కన్నుమూశారు. ఇలా జరిగిన విమాన ప్రమాదాల్లో ప్రముఖ వ్యక్తులే కాకుండావారితో ప్రయాణిస్తున్న పైలెట్లు, సిబ్బంది చనిపోవడం గమనార్హం. భారత్‌లోనే కాక ప్రపంచమంతటా ఇలాంటి ఎయిర్ క్రాఫ్ట్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయితే ఈ విమాన ప్రమాదాలకు కారణాలు ఏమిటి?అనే ప్రశ్నకు జవాబులు వెతుక్కోవాల్సిందే. రెండు దశాబ్దాల క్రితమే దేశపౌరులకు చౌక విమానయానాన్ని అందించడానికి కొన్ని కార్పొరేట్ సంస్థలు సిద్ధమయ్యాయి. ఆయా సంస్థలకు చెందిన విమానాల్లో దేశీయంగా ప్రయాణించాలంటే రెండు, మూడు నెలలు ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకుంటే, తక్కువధరకు ప్రయాణం దొరికేది. ఈ విధానంవల్ల కేవలం ధనికులకే పరిమితమైన విమానయానం పేద, మధ్యతరగతి వర్గాలకు వరమయ్యింది.ఐతే ఈక్రమంలో ఆయా వైమానికసంస్థలు ప్రయాణీకుల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు పాటించడం లేదు. తక్కువ ఛార్జీలతో భద్రతగల ప్రయాణం అందించడం ఎవరికైనా కష్టం. కానీ ఆ సంస్థలు తమ ప్రయాణీకులకు భద్రతగల ప్రయాణాన్ని అందిస్తామని చెప్పాయి.పాత విమానాలను సెకండ్ సేల్స్‌లో కొనుక్కొని, వాటికి మరమ్మత్తులు చేసుకొని, ఆకాశయానానికి ఉపయోగించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. విమానాల మెయింటెనెన్స్ సరిగ్గా చేయకపోవడం కూడా ప్రమాదాలకు ఒక కారణమే. అలాగని అన్నివేళలా ప్రమాదాలు సంభవించకపోవచ్చు. కానీ ఎప్పుడో ఒకప్పుడు ప్రమాదాలు జరగటం వల్ల తీవ్రమైన ప్రాణనష్టం ఎదుర్కొనక తప్పదు. రోడ్డు, రైలు మార్గాలలో జరిగే ప్రమాదాలలో వందశాతం ప్రాణనష్టం ఉండదు. కానీ ఎయిర్ ప్రమాదాల్లో ప్రాణనష్టం నూటికి నూరుశాతం ఉంటుంది.అందువల్ల విమానయానాన్ని నడిపే సంస్థలు విమానాల్లో గానీ, ఎయిర్‌పోర్టుల్లో గానీ సాంకేతికంగా నిర్వహణ పరంగా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. వీటి విషయంలో ఏమాత్రం ఏమరపాటు వహించినా భారీమూల్యం చెల్లించుకోక తప్పదు. కొన్ని ప్రైవేట్ ఏవియేషన్ సంస్థలు చార్టర్ ఫ్లైట్స్‌ను అద్దె కొనుగోలు పద్ధతిపై నడుపుతున్నాయి. వీటిని రాజకీయ నాయకులు, సినీనటులు, పారిశ్రామికవేత్తలుతమ వ్యక్తిగత ప్రయాణాలకు,ఎన్నికలప్రచారాలకు విరివిగా వాడుతున్నారు. ఐతే ఈ సంస్థలు తమ విమానాల నిర్వహణలో ఎటువంటి నాణ్యతలు పాటించడం లేదన్నది వాస్తవం. అందువల్లే చాలా ఎయిర్ ప్రమాదాలు జరుగుతున్నాయి. నేడు పేద, మధ్యతరగతి వర్గాలకు సాఫ్ట్వేర్ రంగం అందుబాటులోకి వచ్చింది. ఎక్కువమంది యువతీయువకులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంకా కార్యనిర్వాహక రంగంలో ఆయా వర్గాల పిల్లలు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరంతా కాలపరిమితి దృష్ట్యా విమానయానంపైనే ఆధారపడుతున్నారు. గతంలో భారత ప్రభుత్వం డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో విమాన ప్రమాదదర్యాప్తులు జరిపించేది. 2012 తర్వాత ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఆధ్వర్యంలో దర్యాప్తులు నిర్వహిస్తున్నది. ఐతే ఈదర్యాప్తుల్లో ఎక్కువగా సాంకేతిక లోపాలవల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు తేలుతున్నది. అందువల్ల ఈ దర్యాప్తులు తూతూమంత్రంగా సాగుతున్నాయా? అనే అనుమానం లేకపోలేదు.ఇంకా ఆ దర్యాప్తుల్లో పైలట్ల నిద్రలేమి, పనిగంటల పెంపు, విధి నిర్వహణలో ఒత్తిడి, నిర్లక్ష్యం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా కారణమనే విషయాలు వెల్లడౌతున్నాయి. కానీ నష్ట నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ముఖ్యంగా దేశ జనాభా అవసరాలకు తగినన్ని ఎయిర్‌పోర్టు, విమానాలు, పైలెట్లు లేరన్నది వాస్తవం. అందువల్ల పైలెట్లపై పనిభారం పడుతున్నది. ఏ మనిషికైనా తగినంత విశ్రాంతి లేకపోతే, తీవ్ర ఆందోళనకు గురౌతాడు. ఇది కూడా ప్రమాదాలు జరగడానికి ఒక కారణమే. విమాన ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలాన్ని భద్రతా బలగాలు సీజ్ చేస్తారు. అక్కడ ఉన్న విమాన శకలాలను జాగ్రత్తగా సేకరిస్తారు. ముఖ్యంగా బ్లాక్ బాక్స్‌ను విశ్లేషణ చేస్తారు. ఇలా ఎంతో పగడ్బందీగా దర్యాప్తు చేస్తారు. ఐనప్పటికీ ప్రమాదానికి సరైన కారణాలను లిస్ట్ అవుట్ చేయలేక పోతున్నారు. ఇది మరిన్ని అనుమానాలకు దారితీస్తున్నది. చివరగా ఇంకో విషయం, ఏదైనా విమానం ప్రమాదంలో ఉందని తెలిసిన మరుక్షణంలో,ప్రయాణీకులు ముందస్తుగా ఎయిర్ బెలూన్లతో తప్పించుకునే అవకాశముందా?లేదా? అనే ప్రశ్నలకు నిపుణులు జవాబులు చెప్పాల్సిందే. •

# నకిలీ ఔషధాలను ఆదిలోనే అరికట్టాలి

మహమ్మద్ ఆరిఫ్

ఫార్మా హబ్‌గా హైదరాబాద్‌ను పాలకులు కీర్తిస్తున్నారు. విశ్వ నగరంగా పేర్కొంటూ అనేక ఫార్మా కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. అయితే ఇది ఒక వైపు మాత్రమే. ఇదే విశ్వనగరంలో నకిలీలు రాజ్యమేలుతున్నాయి. మెడికల్ మాఫియా ధన దాహానికి ప్రాణాలు సంకటంలో పడుతున్నాయి. ఏ మెడికల్‌లో నుంచి మందులు కొనుగోలు చేసుకోవాలో? అసలు ఏ మందు అసలుదో? ఏది నకిలీదో? తెలియక అమాయక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలో డ్రగ్ కంట్రోల్ అధికారులు జరిపిన దాడుల్లో వెలుగు చూసినా నకిలీ మందుల దందా ఈ ఆందోళనను మరింత పెంచుతున్నది. అయితే ఇది ఒక మెడికల్ దుకాణానికో, ప్రాంతానికో పరిమితమైనట్లు కనిపించడం లేదు. చాపకింద నీరులా దేశ వ్యాప్తంగా విస్తరించినట్లు అర్థమవుతున్నది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు నకిలీ మందులను తెప్పించి వాటిని బ్రాండెడ్ కంపెనీల పేర్లతో రాష్ట్రంలో చలామణి చేస్తున్నారు. షుగర్, బీపీ, గ్యాస్ట్రిక్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు వాడే మందులే ఎక్కువగా నకిలీ ఉంటుండడం గమనార్హం. రోజూ మందులు వాడకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే రోగులను లక్ష్యంగా చేసుకుంటుండడం తీవ్రఆందోళన కలిగిస్తున్నది. చాక్‌పీస్ పౌడర్, మొక్కజొన్న పిండితో కూడా నకిలీ మెడిసిన్స్ తయారు చేస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖాధికారులు గతంలో గుర్తించారు. డాక్టర్ రెడ్డీస్, అబౌట్, సన్ ఫార్మా గ్లెన్ మార్క్, అరిస్టో, టోరెంట్ కంపెనీల బ్రాండ్లను అతికించి నకిలీ మందులను విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. అంతే కాకుండా మోతాదు కంటే అతి తక్కువ రసాయనాలతో మెడిసిన్స్ తయారు చేస్తున్నట్లు, ఒక ఫార్ములాకు బదులు




మరో ఫార్ములా వాడుతున్నట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. మరోవైపు ప్రభుత్వ డిస్పెన్సరీలకు సైతం నకిలీ మందులు సరఫరా చేసిన ఘటనలు గతంలో వెలుగు చూశాయి. అయితే ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకొని మందులను కొనకపోతే ఉన్న రోగం పోవడమేమో కానీ.. కొత్త రోగాలు వచ్చే ప్రమాదమున్నది. చాలా నకిలీ మందుల్లో అసలు ఔషధమే (యాక్టివ్ ఇంగ్రిడియంట్) ఉండడం లేదు. కేవలం సుద్దపొడి, పిండి కలిపి మందు బిళ్లలుగా తయారు చేస్తున్నారు. దీనివల్ల రోగికి వ్యాధి నయం కాకపోగా సరైన సమయంలో చికిత్స అందక వ్యాధి ముదిరి ప్రాణాపాయ స్థితికి చేరుకునే ప్రమాదముంది. మరికొన్ని నకిలీ మందుల్లో ప్రమాదకరమైన రసాయనాలు వాడుతున్నారు. ఇవి నేరుగా కిడ్నీలు, కాలేయంపై ప్రభావం చూపి పూర్తిగా ఫెయిల్ అయ్యేలా చేస్తున్నాయి. కొన్నేళ్లుగా డీసీఏ అధికారులు వరుసదాడులు చేస్తున్నారు. మెడికల్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నారు. 2024-25లో 400కు పైగా దాడులు నిర్వహించి వందకుపైగా క్రిమినల్ కేసులు నమోదుచేశారు. రూ.పదికోట్లకు పైగా నకిలీ, నాణ్యతలేని మందులు సీజ్ చేశారు. 2025-26లోనూ అనేక కేసులు నమోదు చేశారు. అయినా ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. అధిక లాభాల కోసం కొన్ని మెడికల్ ఏజెన్సీలు, దుకాణాల వారు ఈ నేరంలో భాగస్వాములవుతున్నారు. బ్రాండెడ్ మందులమీద వచ్చే 20 శాతం మార్జిన్ కంటే నకిలీమందుల మీద వచ్చే 200శాతం లాభం వారిని ఆకర్షిస్తున్నది. ప్రభుత్వాలు దాడులతో సరిపెట్టకుండా కఠిన చట్టాలను చేసి ఈ నకిలీ మందులను నియంత్రించాలి. అంతేకాకుండా ప్రతి మందు స్ట్రిప్ మీద క్యూఆర్ కోడ్ తప్పనిసరి చేసి వినియోగ దారుడు దాన్ని స్కాన్ చేసి అసలు, నకిలీని గుర్తించేలా సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి. అన్నింటికీ మించి ప్రజల్లో అవగాహన పెరగాలి. బిల్లులు లేని మందులు కొనడం ఆపేయాలి. •

# కిలో వెండి రూ.7లక్షల మార్క్ దాటేస్తుందా?

జి.సత్యనారాయణరాజు

బంగారం, వెండి అంటే భారతీయులకు ఎప్పుడూ అమితమైన ఇష్టమే. అయితే ప్రస్తుతం పెరుగుతున్న ధరలను చూసి ఇప్పటికే సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.4 లక్షలకు చేరుకుంది. దీంతో వెండి ధర నెక్స్ట్ టార్గెట్ ఏంటన్న చర్చ జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వెండి ధరలు ఆకాశాన్నంటాయి. శుక్రవారం దేశీయంగా తులం బంగారంపై సుమారు రూ.8,000 వరకు తగ్గగా, కిలో వెండిపై రూ.15,000 మేర తగ్గుదల కనిపించింది. అయితే ఇది తాత్కాలికమే అంటున్నారు. రోజూ వెండిధరలు భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తుంది. 25 ఏళ్ల క్రితం కిలో వెండి ధర రూ.7900 ఉండేది. ఆ తర్వాత వెండి ధర 2010 నాటికి 27,255 రూపాయలకి చేరింది. 2012 నాటికి అకస్మాత్తుగా అది 56వేల 900కి చేరింది. ఆతర్వాత హెచ్చుతగ్గులకు లోనైంది. 2020 నాటికి కిలో వెండి 63వేలు దాటింది. 2023 నాటికి కిలో వెండి 78వేల 600కి చేరుకుంది. రెండేళ్ళకే ఇంచుమించు రెండింతలకు చేరడం విశేషం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కిలో వెండి 4 లక్షల మార్క్‌కి చేరింది. 2026 జనవరి చివరికి వెండి ధర పటిష్టంగా పెరుగుతూ 4 లక్షల మార్క్‌కి చేరింది.రాజకీయ ఒత్తిడులు, డిమాండ్‌సప్లైలో వ్యత్యాసం, ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం వెండి ధర పెరగడానికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. గడచిన 28 రోజుల్లో రూ.1,44,000 పెరుగుదలని చూపిస్తుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో మార్చి ఎక్స్‌పైరీ వెండి ఫ్యూచర్స్ ధర 5.62 శాతం పెరిగి 3,79,300 రూపాయలకి చేరింది. కామెక్స్‌లో వెండి ధర 115.42 డాలర్ల దిశగా పెరిగి, ఇప్పుడు 106.55 డాలర్ల నుంచి 113 డాలర్ల పరిధిలో స్థిరపడుతోంది. కొంత లాభం తీసుకునే అమ్మకాల కారణంగా ఈ పరిధిలో నిలిచింది. పెట్టుబడి మార్గంగా వెండిని మదుపరులు భావించడమే తాజా పరిస్థితికి కారణంగా చెబుతున్నారు. సోలార్, నిజు, ఇవి /డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ డిమాండ్ చాలా బలంగా ఉంది. దీనితో పాటు భద్రతా పెట్టుబడిగా కూడా వెండి, ద్రవ్యోల్బణం నుంచి రక్షణగా కూడా వెండి ధరకు మద్దతు వస్తోంది. నిపుణుల ప్రకారం, వెండి ధర 118.50-120 డాలర్ల పరిధిని దాటి పోతే, తదుపరి దశలో 125-140+ డాలర్ల దిశగా త్వరగా చేరే అవకాశం ఉంది. పారిశ్రామిక యుగంలో ఇనుము ఎలా కీలకమైనదైతే, టెక్నాలజీ యుగంలో వెండి కూడా అలాగే ఉందని నిపుణులు చెబుతున్నారు.




రూపాయితో డాలర్ మారకంలో ఎలాంటి మార్పు లేకపోతే, ఔన్స్ 200 డాలర్లు అంటే సుమారు రూ. 7,20,000 సమానంగా ఉంటుంది. అంటే ఈ లెక్కన 2026లోనే కిలో వెండి ధర రూ.7లక్షలకు చేరడం గ్యారంటీ అంటున్నారు. రూపాయి బలహీనంగా ఉండటం వల్ల దేశీయ ధరలు అంతర్జాతీయ దశతో పోల్చితే ఎక్కువగా కనిపిస్తాయి. వెండి ఆభరణాల కోసమే కాదు. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థలో కీలకమైన నిర్మాణ లోహంగా మారిపోతోంది. వెండి పెరుగుదలకు అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ పరిణామాలే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. చైనాతో ఒప్పందం కుదరకపోతే కెనడాపై భారీ సుంకాలు విధిస్తామని, అలాగే దక్షిణ కొరియా ఆటోలు, ఔషధాలు, కలపపై సుంకాలను 25శాతానికి పెంచినట్లు ప్రకటించడం పెట్టుబడిదారులను రిస్క్ ఆస్తుల నుంచి దూరం చేసింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై చేసిన హెచ్చరికలు మార్కెట్లను కలవరపెట్టాయి. పెట్టుబడిదారులు ఆర్థిక ఒత్తిడికి తక్కువగా గురయ్యే ఆస్తుల వైపు మొగ్గు చూపడం సహజం. ఆసియా, యూరప్ మార్కెట్లలో కొత్త పెట్టుబడిదారులు పెద్దఎత్తున బంగారం, వెండిని కొనుగోలు చేస్తున్నారని, ఇది ధరలకు దీర్ఘకాలిక మద్దతుగా మారుతోంది. వాణిజ్య ఉద్రిక్తతలు, వడ్డీ రేట్లపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు కలిసి వెండిని మరోసారి పెట్టుబడిదారుల ఫోకస్‌లోకి తెచ్చాయి. ఈ ట్రెండ్ కొనసాగితే, రాబోయే రోజుల్లో వెండి ధరలు మరిన్ని కొత్త రికార్డుల వైపు తీసుకు వెళతాయని అంటున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగింది. డాలర్ విలువ పడిపోయింది.దీనికితోడు పారిశ్రామిక అవసరాల కోసం వివిధ సంస్థలు వెండి నిల్వలు పెంచుకునేందుకు ఎగబడడంతో.. బంగారంవెండి ధరలు అమాంతం పెరిగాయి. ఈ ఏడాది బంగారం వెండి ధరల్లో పెరుగుదల కొనసాగుతూనే ఉంటుందని మోర్గాన్ స్టాన్లీ లాంటి నివేదికలు చెబుతున్నాయి.రాబోయే రెండేళ్లలో బంగారం, వెండి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకుంటాయని బులియన్ నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునేవారు వెండి, బంగారంపై పెట్టుకుంటే లాభసాటిగా ఉంటుందని చెబుతున్నారు. కాగితపు కరెన్సీపై ఇన్వెస్టర్లకు నమ్మకం తగ్గుతుండటంతో, సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు అందరూ మొగ్గుచూపుతున్నారు. జపనీస్ యెన్ విలువలో ఒడిదుడుకులు, గ్లోబల్ రిస్క్ ఎన్విరాన్‌మెంట్ కూడా వెండి, బంగారానికి రెక్కలు వచ్చేలా చేస్తున్నాయి. 2020 నుంచి ఇప్పటివరకూ కరోనా సంక్షోభం వల్ల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం అయ్యాయి. ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. వడ్డీ రేట్లు దాదాపు జీరో అయ్యాయి. ఆ సమయంలో వెండి ధర 11.69 డాలర్ల వరకు పడిపోయింది. కానీ ఇప్పుడు 800 శాతానికి పైగా పెరిగి 102 డాలర్లకు చేరింది. రాబోయే రోజుల్లో బంగారం కంటే వేగంగా పుంజుకుంటుందని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# బడ్జెట్ వేళ.. కంచిపట్టు చీరె

### తమిళ సంస్కృతిని ప్రతిబింబించిన నిర్మలమ్మ వస్త్రధారణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామ ఆదివారం పార్లమెంట్‌లో బడ్జెట్ సందర్భంగా ఈసారి ఆమె కంచిపట్టు చీర ధరించారు. తమిళనాడుకు చెందిన చేనేత వస్త్ర సంస్కృతికి కంచీపురం సిల్క్ ప్రతిబింబమైన విషయం తెలిసిందే. సంప్రదాయమైన కంచీ పట్టు చీరలో మంత్రి సీతారామన్ బడ్జెట్ ప్రసంగం చేసారు. పర్పుల్ కలర్‌లో ఆ పట్టు చీర ఉన్నది. లైట్ గోల్డెన్ బ్రౌన్ చెక్స్ ఆ చీరపై నేశారు. తమిళంలో ఆ చెక్స్‌ను కట్టం అని పిలుస్తారు. కాఫీ బ్రౌన్ బోర్డర్‌లో ఉన్న ఆ చీరకు థ్రెడ్ వర్క్ చేశారు. ఈ నేపథ్యంలో తమిళ వస్త్రధారణలో మంత్రి నిర్మల ఆకర్షణీంగా తయారయ్యారు. 9వ సారి మంత్రి నిర్మల కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. అయితే ప్రతిసారి ఆమె ప్రత్యేక చీరకట్టులో పార్లమెంట్‌కు హాజరయ్యారు. బడ్జెట్ ప్రసంగం వేళ ఆమె వేషధారణ అందర్నీ ఆకట్టుకునేది. అయితే స్థానిక చేనేతను ప్రోత్సహించే రీతిలో అనేక ప్రాంతాలకు చెందిన చీరలను ఆమె పలు సందర్భాల్లో ధరించారు. 2025లో మంత్రి నిర్మలా సీతారామన్ బీహార్‌కు చెందిన మధుబని ఆర్ట్ శారీలో దర్శనం ఇచ్చారు. హ్యాండ్లూమ్ పట్టు చీరకు పేరుగాంచిన మధుబని డిజైన్‌లో ఆమె గత ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బీహారీ జానపదులకు నివాళిగా ఆ చీరను పద్మశ్రీ గ్రహీత దులారీ దేవి ఆ చీరను మంత్రి నిర్మలకు గిఫ్ట్‌గా ఇచ్చారు. కచ్ని లైన్ స్కెచింగ్, భర్ని కలర్ స్టయిల్స్‌తో ఆ చీరను తయారు చేశారు. 2024లో మంగళగిరి హ్యాండ్లూమ్ చీరలో మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను చదివారు. తెలుపు రంగు చీరకు బ్రైట్ మెజెంటా బోర్డర్ ఉంది. ఫైన్ కాటన్, సింపుల్ జరీ బోర్డర్‌తో ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరికి చెందిన చేనేత కార్మికులు ఆ చీరను రూపొందించారు. ఇక ఏడాది మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో మంత్రి నిర్మల బెంగాల్‌కు చెందిన తుషార్ పట్టు చీరను కట్టుకున్నారు. స్టోరీటెల్లింగ్ ప్యాటర్న్ ఆ పట్టుచీరలో ప్రత్యేకమైన అంశం. 2023లో టెంపుల్ బోర్డర్ సిల్క్ చీరతో ఆమె పార్లమెంట్‌కు వచ్చారు. ఒడిశాకు చెందిన బొమ్‌కాయి చీరకట్టుతో ఆమె 2022లో బడ్జెట్‌ను చదివారు. ఇక 2021లో తెలంగాణకు చెందిన పోచంపల్లి పట్టుచీరలో మంత్రి నిర్మల బడ్జెట్ ప్రసంగానికి హాజరయ్యారు. 2020లో బ్లూ బోర్డర్ ఉన్న పసుపు రంగు సిల్క్ చీరలో ఆమె బడ్జెట్‌కు వచ్చారు. 2019లో పింక్ కలర్ మంగళగిరి చేనేత చీరను ధరించారు.

# మహిళా సంఘాల బలోపేతానికి 'షీమార్ట్'లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 :** మహిళల నేతృత్వంలో రిటైల్ ఔట్‌లెట్‌లను ప్రోత్సహించడానికి బడ్జెట్‌లో చర్యలు చేపట్టినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక మద్దతు కోసం 'షీ మార్ట్'లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. లక్‌పతి దీదీ కార్యక్రమం విజ యం ఆధారంగా సెల్ఫ్ హెల్ప్ ఎంట్రప్రెన్యూర్ (షీ) రిటైల్ ఔట్‌లెట్స్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందజేస్తాం. క్రెడిట్ లింక్డ్ జీవనోపాధి నుంచి స్వయం సహాయక సంస్థల యజమానులుగా మహిళలు మారడానికి ఇది సహాయపడుతుందని మంత్రి సీతారామన్ అన్నారు. మహిళా సమాఖ్య లు, కమ్యూనిటీల యాజమాన్యంలో ఏర్పాటు చేసే రిటైల్ అవుట్‌లెట్‌లను స్వయం సహాయక వ్యవస్థీకృత మార్టులు (షీ మార్ట్) అని అంటారు. గ్రామీణ మహిళలు నిర్వహించే వ్యాపార సంస్థలకు




బలమైన మార్కెట్ సృష్టించడం, స్థానిక ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడం దీని లక్ష్యం.

మహిళా స్వయం సహాయక బృందాలను బలోపేతం చేయడం, మహిళా యజమానులు వ్యాపార రంగంలో రాణించడం, మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులను సృష్టించడానికి ఈ పథకం దోహదపడుతుంది.

## విదేశీ ఆస్తులు వెల్లడించని వారికి మరో అవకాశం!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** విదేశీ ఆస్తులు వెల్లడించని వారికి మరో అవకాశం కల్పించారు. భారత పౌరసత్వం ఉన్న పౌరులు తప్పనిసరిగా విదేశీ ఆస్తులు, ఆదాయాల వివరాలు ఇవ్వాలి. లేదంటే తర్వాత వాటిపై పన్నులతోపాటు భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తారు. తాజా బడ్జెట్ 2026లో ఇలాంటివారికి కాస్త ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నారు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్. విదేశీ ఆస్తులు వెల్లడించని వారిని రెండు కేటగిరీలుగా విభజించారు. మొదటిది కేటగిరి విదేశాల్లో ఒక కోటి వరకు ఆదాయం లేదా ఆస్తి కలిగి, ఆ విషయం వెల్లడించకపోతే ఇకపై సాధారణ పన్ను 30 శాతం చెల్లించాలి. అదనంగా పెనాల్టీ బదులు మరో 30 శాతం పన్ను చెల్లిస్తే చాలు. ఇక కేటగిరి బిలో విదేశాల్లో ఐదు కోట్ల విలువైన ఆస్తులు లేదా ఆదాయం ఉన్నవారిని పరిగణిస్తారు. వీరు ముందుగా ఆస్తి వివరాలు వెల్లడించకుంటే తర్వాత రూ.1 లక్ష చెల్లిస్తే చాలు. ఇదంతా తర్వాత ఆరు నెలల్లోనే చేయాలి. ఎన్ఆర్ఐకి సంబంధించిన ఆస్తి కొంటుంటే అమ్మే వాళ్లకు టీడీఎస్ కట్ చేసి డబ్బు చెల్లించాలి. ట్యాన్‌తో సంబంధం లేకుండా ప్యాన్ నెంబర్‌తో టీడీఎస్‌ను డిపాజిట్ చేయొచ్చు. బెట్టింగ్, ఇతర ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నందున గేమింగ్ సంస్థలపై పన్నులు రెట్టింపు చేసింది. సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)ని పెంచింది. సెక్యూరిటీ గార్డులు, డ్రైవర్లు వంటి మ్యాన్ పవర్ సంస్థలు అందించే సేవలపై పన్ను తగ్గించారు.




# వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** ప్రతి కుటుంబం, వర్గం, ప్రాంతం, రంగానికి వన రులు, సౌకర్యాలు, అవకాశాలను అందుబాటులో ఉండేలా చూడటం ద్వారా ప్రతి ఒక్కరూ అర్థవంతమైన తీరులో భాగస్వాములు కావాలన్న 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్'కు లక్ష్యానికి అనుగుణంగా ఉందని కేంద్ర ఆర్థిక, కార్పోరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ఆర్థిక మంత్రి ఒక సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఉత్పాదకత పెంపు, వ్యవస్థాపకత ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం. ఉపాధి అవకాశాలు, శిక్షణ, నాణ్యమైన సహాయక పరికరాల ద్వారా దివ్యాంగులను శక్తిమంతులను చేయటం. మానసిక ఆరోగ్యం, ట్రామా కేర్ పొందేలా బల హీనవర్గాలకు సాధికారత కల్పించడం. అభివృద్ధి, ఉపాధి అవకాశాలను వేగవంతం చేయడానికి పూర్వోదయ రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతంపై దృష్టి సారించడం' అని నిర్మలా సీతారామన్ వివరించారు.

**రైతుల ఆదాయం పెంచటం**

రైతుల ఆదాయాన్ని పెంచే విస్తృత లక్ష్యంలో భాగంగా 500 జలాశయాలు, అమృత్ సరోవర్‌ల సమగ్ర అభివృద్ధి, తీర ప్రాంతాలలో మత్స్య రంగ విలువ వ్యవస్థను బలోపేతం చేయడం, చేపల రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి అంకురాలు మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తూ మార్కెట్ అనుసంధానాలను కల్పించే నిబంధనలను బడ్జెట్‌లో పొందుపరిచారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కీలకమైన రంగాల్లో పశుసంవర్ధక రంగం ఒకటిగా ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన ఉపాధి అవకాశాలను కల్పించడానికి ప్రభుత్వం ఈ విధానాల ద్వారా పశుసంవర్ధక రంగంలో వ్యవస్థాపకత అభివృద్ధికి మద్దతునిస్తుంది. రుణ ఆధారిత రాయితీ పథకం, పశుసంవర్ధక సంస్థల విస్తరణ, ఆధునికీకరణ. పశుసంపద, డైరీ, పౌల్ట్రీ ఆధారిత సమగ్ర విలువ ఆధారిత అనుసంధాన వ్యవస్థలను సృష్టిని పెంపొందించడం. పశుకాపరుల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటును ప్రోత్సహించడం.

తీరప్రాంతాల్లో కొబ్బరి, చందనం, కోకో, జీడిపప్పు వంటి అధిక విలువ కలిగిన పంటలకు మద్దతు ఇవ్వడం ద్వారా "ఉన్నత విలువ కలిగిన వ్యవసాయం'8 గురించి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రధానంగా దృష్టి సారించారు.'ఈశాన్య రాష్ట్రాల్లో అగర్ చెట్లు.. పర్వత ప్రాంతాల్లో బాదం, వాల్‌నట్స్, పైన్ నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్ సాగుకు కూడా మద్దతు లభిస్తుంది' అని అన్నారు.

'ప్రపంచంలోనే కొబ్బరి ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉంది. దాదాపు 10 మిలియన్ల రైతులు సహా 30 మిలియన్ల మంది ప్రజలు జీవనోపాధి కోసం కొబ్బరిపై ఆధారపడుతున్నారు. కొబ్బరి ఉత్పత్తిలో పోటీతత్వాన్ని మరింత పెంచడానికి, ప్రధాన కొబ్బరి సాగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉత్పాదకత లేని చెట్ల స్థానంలో కొత్త మొక్కల రకాలను నాటడం వంటి వివిధ చర్యల ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచేందుకు నేను ఒక కొబ్బరి అభివృద్ధి పథకాన్ని ప్రతిపాదిస్తున్నాం' అని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంలో భాగంగా పచ్చి జీడిపప్పు, కోకో ఉత్పత్తిలో భారత్‌ను స్వయం సమృద్ధిగా మార్చడానికి, ఎగుమతి పోటీ తత్వాన్ని పెంచేందుకు, 2030 నాటికి భారతీయ జీడిపప్పు- కోకోలను అంతర్జాతీయ ప్రీమియం బ్రాండ్‌లుగా మార్చేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని 2026-27 బడ్జెట్ ప్రతిపాదించింది. భారతీయ చందన వ్యవస్థకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు, సాగు పంట అనంతర ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వాలతో భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేయనుంది.

ఎక్కువ దిగుబడినిచ్చే పాత తోటలను పునరుద్ధరించడానికి.. వాల్‌నట్స్, బాదం, పైన్ నట్స్ వంటి వాటిని అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడాన్ని విస్తరించేందుకు, యువతను భాగస్వామ్యం చేస్తూ విలువ జోడింపు ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే ప్రత్యేక కార్యక్రమానికి బడ్జెట్ మద్దతునిస్తుంది.

**భారత్ విస్తార్**

వ్యవసాయ వనరులను పొందేందుకు వర్చువల్ ఇంటిగ్రేటెడ్ వ్యవస్థ (భారత్ విస్తార్) ప్రారంభించనున్నట్లు ఆర్థికమంత్రి ప్రతి పాదించారు. 'విస్తార్'ను బహుభాషా ఏఐ సాధ నంగా రూపొందించనున్నారు. ఇది అగ్రిస్టాక్ పోర్టల్‌లను, వ్యవసాయ పద్ధతులకు సంబంధించిన ఐకార్ ప్యాకేజీని ఏఐ వ్యవస్థలతో అనుసంధానిస్తుంది. ఇది వ్యక్తిగతీకరించిన సలహాల విషయంలో మద్దతునివ్వటం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుంది. దీనితో పాటు రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కల్పించటంతోపాటు నష్టభయాన్ని ఇది తగ్గిస్తుంది.

> రైతుల ఆదాయం హెచ్చింపు
>
> దివ్యాంగులు, బలహీన వర్గాలకు అండదండలు
>
> పూర్వోదయ రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతంపై ప్రత్యేక దృష్టి
>
> లక్షిత చర్యలను ప్రకటించిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల
>
> కొబ్బరి ప్రోత్సాహక పథకం, చందనం సాగుకు ప్రోత్సాహం
>
> జీడిపప్పు, కోకో, అక్రోటు, బాదం, పైన్‌నట్స్ కోసం ప్రత్యేక కార్యక్రమాలు

# ఐదు మెడికల్ హాబ్‌లు, లక్ష ఎహెచ్‌పిలు

### వైద్య అనుబంధ నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక పథకం

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రూ. 53.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ. 1,05,530 కోట్లను కేటా యించారు. దేశాన్ని వైద్య పర్యాటక రంగానికి ప్రపంచ గమ్యస్థానంగా ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా ఐదు ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో రాష్ట్రాలకు మద్దతు ఇస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. వైద్య అనుబంధ నైపు ణ్యాల అభివృద్ధికి ప్రత్యేక పథకం తీసుకువస్తున్నట్లు తెలిపారు. సుమారు లక్ష ఎహెచ్‌పిల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

నాణ్యమైన ఆయుర్వేద ఔషధ ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యేక పథకం తీసుకువస్తున్నట్లు చెప్పారు. మూడు కొత్త ఆయుర్వేద అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, జామ్‌నగర్‌లో ఆయుర్వేద ఔషధ అభివృద్ధి సంస్థ నెలకొల్పనున్నట్లు పేర్కొన్నారు. సుమారు లక్ష హెల్త్ ప్రొఫెషనల్స్‌ను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆయుర్వేద, యోగా, మానసిక ఆరోగ్య సేవలతోపాటు వైద్య విద్య విస్తరణపై దృష్టి సారించినట్లు చెప్పారు. యోగా, ఆయుర్వేద సేవల కోసం సుమారు 1.5 లక్షల సేవకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్ సహా విదేశాల్లో యోగా, ఆయుర్వేదానికి పెరుగుతున్న డిమాండ్‌ను ఇది సూచిస్తోందన్నారు. ఆయుష్ పార్మసీలు, డ్రగ్ టెస్టింగ్



ల్యాబోరెటరీలు, ఆయుర్వేద ఉత్పత్తుల ఎగమతులకు కృషి చేస్తామని ప్రతిపాదించారు. కొవిడ్19 తర్వాత ఆయుర్వేదం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందిందని తెలిపారు.

మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాల్లో అంతరాలను పరిష్కరించేందుకు ప్రముఖ మానసిక ఆరోగ్య సంస్థ అయిన ఎన్ఐఎం హెచ్‌ఏఎన్ఎస్ (నిమ్‌హాన్స్)2.0ని స్థాపించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఈ చర్య మానసిక ఆరోగ్య సంరక్షణ, ట్రామా సేవలకు కేంద్రం నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నట్లు చెప్పారు. మానసిక ఆరోగ్యం, ట్రామా కేర్‌కు నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని.. ఇప్పటి వరకు ఉత్తర భారతదేశంలో మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం ఎలాంటి జాతీయ సంస్థలు లేవన్నారు. అందువల్ల తాము తాజాగా నిమ్‌హాన్స్-2.0ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఇందుకోసం రాంచీ, తేజ్‌పూర్‌లలో జాతీయ మానసిక ఆరోగ్య సంస్థలను ప్రాంతీయ అత్యున్నత సంస్థలుగా అప్‌గ్రేడ్ చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశవ్యాప్తంగా అత్యవసర ట్రామా కేర్ సౌకర్యాలను బలోపేతం చేయడానికి చర్యలను తీసుకుంటున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వైద్య అత్యవసర పరిస్థితులు తరచుగా కుటుంబాలపై, ముఖ్యంగా పేదలపై ఊహించని ఆర్థిక భారాలను మోపుతాయని ఆమె అన్నారు.

ఇందుకోసం అత్యవసర, ట్రామా కేర్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా ఆసుపత్రులలో ఈ సామ ర్థ్యాలను 50 శాతం బలోపేతం చేస్తామని ప్రకటించారు. దేశంలో పశువైద్య వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్టు తెలిపారు. పశువైద్య కళాశాలలు, పారా పశువైద్య కళాశా లలు, బ్రీడింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. పశు వైద్య వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహంతో పాటు ప్రత్యేక రుణాలు, ప్రోత్సాహాలు అందించేలా నూతన విధానం తీసుకువస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతరామన్ స్పష్టం చేశారు.

## ఆరు కీలక రంగాల్లో సంస్కరణలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** ఆర్థిక సుస్థిరత కోసం ఆరు కీలక రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆదివారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె ప్రసంగించారు. చాంపియన్ ఎంఎస్ఎంఇల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. రూ. 10 వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయోఫార్మా శక్తి పథకం తీసుకొస్తున్నామని తెలిపారు. ఫార్మా, విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో కొత్త విద్యా సంస్థలు ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. దేశీ సెమీ కండక్టరన రంగం వృద్ధి కోసం ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0 తీసుకొస్తున్నామని నిర్మాలా సీతారామన్ తెలిపారు. సెమీ కండక్టర్ మిషన్ 2.0 కోసం రూ. 40 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఎపి సహా ఐదు రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించ నున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఒడిశా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేక మైనింగ్ మిషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రపంచ స్థాయి కంటైనర్ ఉత్పత్తి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. హైటెక్ టూల్ రూమ్స్, జౌళిరంగం ఆధునీకరణ, పరిశ్రమలకు విద్యా సంస్థల అనుసంధానం వంటి అంశాలపై దృష్టి సారించినట్లుగా పేర్కొన్నారు.

మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామి నిర్మలాసీతారామన్ తెలిపారు. జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. బయోఫార్మా, సెమీకండక్టర్, ఎంఎస్ఎంఇలకు చేయూత అందిస్తామని.. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. దీర్ఘకాలిక భద్రత, నగరాల అభివృద్ధికి ఆర్థిక జోన్లు ఏర్పాటు చేస్తున్నామని, క్రీడా ఉత్పత్తుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేస్తామని అన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# విద్యకు రూ. 1.39 లక్షల కోట్లు

### బడ్జెట్‌లో 2.6 శాతం నిధులు

### ఐదు వర్సిటీ టౌన్‌షిప్‌ల ఏర్పాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రూ. 53.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ. 1,39,289 కోట్లను కేటాయించింది. ఇది బడ్జెట్‌లో 2.6 శాతం. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రధాన పారిశ్రామిక లాజిస్టిక్స్ కేంద్రాలకు సమీపంలో 5 యూనివర్సిటీ టౌన్‌షిప్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. టౌన్‌షిప్‌లలో నివాస సౌకర్యాలు, పరిశోధన మౌలిక సదు పాయాలతో పాటు యూనివర్సిటీలు, కాలేజీలు ఉంటాయి. దేశవ్యాప్తంగా 15,000 కంటే ఎక్కువ పాఠశాలల్లో కంటెంట్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు మద్దతు అందిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు.

పశువైద్య కళాశాలలు, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్స్ ప్రయోగశాలలకు రుణ సంబంధిత మూలధన సబ్సిడీ మద్దతు పథకాన్ని ప్రకటించారు. గుజరాత్ జామ్‌నగర్‌లోని ఆయుష్ ఫార్మసీలు, ఔషధ పరీక్ష ప్రయోగశాలలు, డబ్ల్యూహెచ్‌వో సంప్రదాయ వైద్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వెయ్యి కంటే ఎక్కువ గుర్తింపు పొందిన భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం



సహాయక పరికరాల ఉత్పత్తిని పెంచడానికి ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నిధులు కేటాయించనున్నట్లు ప్రతిపాదించారు. విద్య నుంచి ఉపాధి, వ్యవస్థాపకత వరకు అనే స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయనున్నామని, వికసిత్ భారత్‌కు కీలకమైన సేవా రంగంపై దృష్టి సారించే చర్యలను సిఫార్సు చేయనుందని ఆర్థికమంత్రి తెలిపారు.

కృత్రిమమేధ(ఏఐ)తో పాటు ఆవిర్భవిస్తున్న కొత్త సాంకేతికతలకు మద్దతిచ్చేందుకు నిధులు కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతిపాదిత కమిటీ ఆర్థిక వృద్ధికి కీలకమైన చోదక శక్తిగా సేవల రంగంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలను సిఫార్సు చేస్తుందని నిర్మల అన్నారు. యువ భారత్ ఆకాంక్షలను నెరవేర్చడానికి స్పష్టమైన మార్గాన్ని అందించడం ఆ చొరవ లక్ష్యమన్నారు.

యువ భారతదేశం ఆకాంక్షలను నెరవేర్చేందుకు చర్యలను అందించడానికి, ఆర్థిక వృద్ధికి కీలకమైన చోదకంగా సేవల రంగంపై దృష్టి సారించే చర్యలను సిఫార్సు చేయడానికి హై పవర్‌తో కూడిన సంస్థల స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చెప్పారు.

కృత్రిమ మేధస్సుతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు. రైతులు, మహిళలు, యువత, దివ్యాంగులతో సహా ప్రజలందరికీ కొత్త అవకాశాలను పొందేందుకు వీలుగా సాంకేతికతను స్వీకరించడం కోసం ఏఐ మిషన్, నేషనల్ క్వాంటం మిషన్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫండ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అండ్ ఇనోవేషన్ ఫండ్‌ల ద్వారా కొత్త సాంకేతికతలకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని మంత్రి ప్రకటించారు.

## సంక్షేమం, అభివృద్ధే కేంద్ర బడ్జెట్

### కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆర్థిక క్రమశిక్షణతో దేశాన్ని అద్భుతంగా ముందుకు నడిపించే బడ్జెట్ ఉపాధి అవకాశాలను, మౌలిక వసతులకు పెద్దపీట వేసిన బడ్జెట్ అన్నారు. రక్షణ, రైల్వే, ఫార్మా, అగ్రికల్చర్, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి, గ్లోబల్ బయోఫార్మా మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా భారతదేశం ఎదగడంలో హైదరాబాద్ కీలక పాత్ర వికసిత్ భారత్ రూరల్ అజీవికా మిషన్ గ్రామీణ్‌కి నిధుల పెంపు ఉచితం కంటే ఉపాధి అవకాశాలు కల్పించడమే బడ్జెట్ లక్ష్యం అన్నారు. గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే బడ్జెట్‌ను రూపొందించారన్నారు.

## హైదరాబాద్-పుణే, బెంగళూరు-చెన్నై మధ్య

# ఏడు హైస్పీడ్ కారిడార్లు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 1:** హైదరాబాద్ సహా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 బడ్జెట్ ప్రసంగంలో కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం ముంబాయి-అహ్మదాబాద్ మధ్య హైస్పీడ్ రైలు కారిడార్, అనేక రాష్ట్రాలు, జిల్లాలను కలిపే తూర్పు, పశ్చిమ రవాణా కారిడార్ల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. మొత్తం 7 నగరాల మధ్య హైస్పీడ్ ట్రైన్ కారిడార్లు ప్రకటించగా.. అందులో మూడు హైదరాబాద్ నుంచే ఉన్నాయి. హైదరాబాద్ -పుణె, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్ -చెన్నై మధ్య హైస్పీడ్ మెట్రో ట్రైన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వీటితో పాటు ముంబై-పుణె, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాశి, వారణాశి -సిలిగుడి మధ్య కూడా హైస్పీడ్ ట్రైన్ కారిడార్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హైస్పీడ్ ట్రైన్ కారిడార్ల ద్వారా గంటల కొద్దీ సాగే ట్రైన్ ప్రయాణం తగ్గనుంది. హైదరాబాద్ నుంచి ముంబై, చెన్నై, బెంగళూరు వెళ్లే ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుంది. నగరాల మధ్య దూరం తగ్గి, రవాణా అత్యంత వేగంగా మారుతుంది. ఈ ట్రైన్ కారిడార్లు కేవలం రవాణాకే పరిమితం కాకుండా రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వృద్ధికి తోడ్పడనున్నాయి. ఈ ప్రాజెక్టులు హైదరాబాద్‌ను ఒక ప్రధాన ఆర్థిక హబ్‌గా మారనున్నాయి. దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు 12.2లక్షల కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

గతేడాది 11.2లక్షల కోట్లు కేటాయింపులు చేయగా ఈసారి స్వల్పంగా పెంచారు. హైదరాబాద్‌సహా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. అంతేకాక పశ్చిమ బెంగాల్‌లోని డాంకునీ, గుజరాత్‌లోని సూరత్ మధ్య కొత్త రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పర్యావరణపరంగా సుస్థిర ప్రయాణికుల వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను అభివృద్ధి చేయబోతున్నాం. అవి నగరాల మధ్య గ్రోత్ కనెక్టర్లుగా పనిచేస్తాయి. ముంబయి-పుణె, పుణె -హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్ -చెన్నై, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి అని వివరించారు. నగరాలు దేశానికి వృద్ధి చోదకాలు, ఆవిష్కరణలు, అవకాశాలకు కేంద్రాలు. ఇప్పుడు టైర్2, టైర్3 నగరాలపై దృష్టి సారించాం అని పేర్కొన్నారు. టెంపుల్ టౌన్లపై కూడా. వాటికి ఆధునిక మౌలిక సదుపాయాలు, కనీస సదుపాయాల కల్పన, వాటి సామర్థ్యాన్ని పెంపునకు వచ్చే ఐదేళ్లలో రూ.5వేల కోట్లు వ్యయం చేసేందుకు ప్రతిపాదిస్తున్నాం. ఛాలెంజింగ్ పద్ధతిలో ఆ ప్రణాళికల అమలు కోసం సంస్కరణ, ఫలితాల ప్రాతిపదికన ఆర్థిక మెకనిజం ఏర్పాటు చేస్తున్నాం అని నిర్మలా సీతారామన్ చెప్పారు. వచ్చే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జల మార్గాలువచ్చే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తేనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఒడిశాలో ఖనిజ సంపద కలిగిన తాల్చేర్, అంగుల్ ప్రాంతాలను, కళింగనగర్ పారిశ్రామిక కేంద్రాలను, పారాదీప్, ధమ్రా ఓడరేవులతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. అందుకోసం అవసరమైన మానవ వనరుల అభివృద్ధి కోసం రీజినల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో శిక్షణా సంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ జలమార్గాల పరిధిలోని యువతకు శిక్షణ, నైపుణ్యాలను పొందేందుకు అవి ఎంతగానో ఉపయోగపడుతాయని ఆర్థికమంత్రి తెలిపారు.

జలమార్గాల అవసరాల కోసం వారణాసి, పట్నాలో నౌకల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రైలు, రోడ్డు మార్గాల నుంచి జలమార్గాలకు మారటాన్ని ప్రోత్సహించేందుకు కోస్టల్ కార్గో ప్రమోషన్ స్కీమ్‌ను ప్రారంభించనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. 2047 నాటికి దేశీయ జలమార్గాలు, తీర ప్రాంత షిప్పింగ్ వాటాను 6శాతం నుంచి 12శాతానికి పెంచటమే లక్ష్యమన్నారు

### దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.12.2 లక్షల కోట్లు

### వచ్చే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జల మార్గాలు




## క్లౌడ్ సేవలు, డేటా సెంటర్లకు

### 20 యేళ్లు పన్నుల ఊరట

### కేన్సర్ చికిత్స పరికరాలపై సుంకాల తగ్గింపు

### తగ్గనున్న 17 రకాల ఔషధాల ధరలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో బడ్జెట్ 2026 ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈసారి బడ్జెట్‌లో ఈసారి టాక్స్ పేయర్లకు పెద్దగా ఊరట లభించలేదు. ఏప్రిల్ 1 నుంచి అమలు కానున్న కొత్త పన్నుల్లో ఏవైనా పన్ను మినహాయింపులు, కోతలు ఉండొచ్చని భావించినా బడ్జెట్‌లో అలాంటివేమీ ప్రకటించలేదు. దేశంలో పెట్టుబడులు పెట్టి, క్లౌడ్ సర్వీసెస్ అందించే డాటా సెంటర్లకు మాత్రం సరళమైన పన్నులు విధించారు. ఈ ప్రకారం 2047 వరకు టాక్స్ హాలిడే ఉంటుంది. కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు సీతారామన్. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో 7 కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి. కొత్తగా వచ్చే టెక్నాలజీలపై సమీక్ష జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తారు. సెమీ కండక్టర్ల తయారీ సహా, ఇతర సేవారంగాలకు ప్రోత్సాహకంగా ఐదేళ్లలో రూ.40,000 కోట్లు కేటాయిస్తారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను సైన్యానికి రూ.2.19 లక్షల కోట్లు కేటాయిస్తారు. ఇది గత ఏడాదికంటే 21.84 శాతం అదనం. మొత్తం రక్షణ రంగానికి రూ.7.85 లక్షల కోట్లు కేటాయించారు. ఇది మన జీడీపీలో 11 శాతం. వేగంగా, స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు తయారీ రంగం, ఇతర చిన్న పరిశ్రమలు వంటి ఆరు కీలక రంగాకు ప్రోత్సాహం అందిస్తారు. ఇండియాను బయో గ్లోబల్ ఫార్మా హబ్‌గా మార్చేందుకు బయో ఫార్మ శక్తి మిషన్ పేరుతో ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయిస్తారు. మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసి వస్త్ర తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తారు. ఖాదీ, చేతి కళా ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు మహాత్మా గాంధీ గ్రామ సమాజ్ పథకాన్ని అమలు చేస్తారు. బ్యాంకింగ్ రంగాన్ని సమీక్షించేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. అలాగే విదేశీ మారక వ్యవస్థను ప్రోత్సహించేందుకు, భారతీయ ఈక్విటీలలో విదేశీయులు పెట్టుబడులు పెట్టేందుకు కూడా కమిటీలను ఏర్పాటు చేస్తారు. దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరాలకు ఏడు హై స్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తారు. ఇందులో హైదరాబాద్‌కు సంబంధించి రెండు రైళ్ల నడుస్తాయి. ఒకటి చెన్నై, రెండోది పుణే. రేర్ ఎర్త్ మినరల్స్ (అరుదైన ఖనిజాలు) కోసం చైనా వంటి దేశాలపై ఆధారపడకుండా నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేస్తారు. తమిళనాడు, ఏపీ, కేరళ, ఒడిశాలో ఈ కారిడార్లు ఏర్పాటవుతాయి. మెడికల్ టూరిజంను ప్రోత్సహించేందుకు ప్రత్యేక హబ్స్ ఏర్పాటు చేస్తారు. దీనిలో భాగంగా ఆయుష్ కేంద్రాల పేరుతో ఐదు మెడికల్ హబ్స్ ఏర్పాటు చేస్తారు.

### మూడు ప్రధాన కర్తవ్యాలతో

## తొలి కర్తవ్యభవన్ కొత్త బడ్జెట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** దేశ ఆర్థికవృద్ధి స్థిరంగా కొనసాగుతోందని, యుశక్తి కేంద్రంగా కొత్తబడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట ప్రసంగంలో తెలిపారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తెస్తున్నామని, రైతులు, దళిత ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాలను స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యభవన్‌లో తొలిసారిగా రూపొందించిన కేంద్ర బడ్జెట్‌ను కొత్త పార్లమెంటు హాలు కర్తవ్యభవన్‌లో ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ఉత్పాదకత పోటీ తత్వాన్ని పెంచి సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం, మొదటి కర్తవ్యంలోభాగంగా ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి కీలకమన్నారు. ఏడు వ్యూహాత్మకరంగాల్లో ఉత్పాదకత వేగవంతం, పారిశ్రామికరంగం పునరుజ్జీవం, ఎంఎస్‌ఎంఇల కోసం కొత్త కార్యాచరణ, మౌలికసదుపాయాల కల్పనకు బలమైన ఊదం, దీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం, నగర ప్రాంత ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి వంటివి ఉన్నాయన్నారు. రెండో కర్తవ్యంగా ప్రైవేటురంగ భాగస్వామ్యంతో టూరిజం సర్వీసులు, ఐదు రీజినల్‌మెడికల్ హబ్‌లు, ఆయుష్‌కేంద్రాల అప్‌గ్రేడేషన్, జామ్‌నగర్‌లో ప్రత్యేక పరిశోధన కేంద్రం, ప్రైవేటురంగంలో పశువైద్య, దయాగ్నస్టిక్స్ ఏర్పాటు వంటివి ఉన్నాయని తెలిపారు. ఇక మూడో కర్తవ్యంగా సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ లక్ష్యంతో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం మతం రంగానికి వనరులు, సదుపాయాలు అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యమని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

# రక్షణకు భారీ కేటాయింపు

### గత బడ్జెట్ కంటే పెరిగిన 8 శాతం

### రూ. 6.81 లక్షల కోట్ల నుంచి రూ.7.85 లక్షల కోట్లకు పెంపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 :** దేశ రక్షణ కోసం కేంద్ర బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాద బెదిరింపులు, రక్షణ వ్యయంలో పెరుగుదల నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ భారీ నిధులు కేటాయించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను రక్షణ మంత్రిత్వ శాఖకు రూ. 7.85 లక్షల కోట్ల బడ్జెట్ మంజూరు చేశారు. ఈ పెరిగిన మొత్తం జీడీపీలో 11 శాతానికి సమానం. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ. 6.81 లక్షల కోట్ల కంటే ఇది ఎనిమిది శాతం ఎక్కువ. రఫేల్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, మానవరహిత వైమానిక వాహనాల కాంట్రాక్టుల వంటి అనేక ప్రధాన ప్రాజెక్టులు రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్నాయి. రక్షణ దళాల ఆధునీకరణ కోసం రూ. 2.19 లక్షల కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కంటే ఇది 21.84 శాతం అధికం. గత ఏడాదిలో రక్షణ మంత్రిత్వ శాఖ మూలధన వ్యయం కోసం రూ.1.8 లక్షల కోట్లు. వ్యయంచేసింది. ఈ కోటాలో విమానాలు, ఏరో ఇంజిన్‌ల కోసం రూ. 63,733 కోట్లు కేటాయించారు. రక్షణ సేవల (రెవెన్యూ) కోసం బడ్జెట్ కేటాయింపును అదనంగా 17.24 శాతం పెంచారు. నిర్వహణ, మందుగుండు సామగ్రి, ఇంధనం, మరమ్మతులు మొదలైన ఖర్చులు, సహాయక సిబ్బంది జీతాలతో సహా రోజువారీ కార్యకలాపాల కోసం ఈ నిధులు వినియోగిస్తారు. పెన్షన్ల కేటాయింపును 6.53 శాతం పెంచి రూ. 1.71 లక్షల కోట్లకు చేర్చారు. రక్షణ రంగంలోని యూనిట్ల ద్వారా నిర్వహణ, మరమ్మత్తు లేదా సమగ్ర పునరుద్ధరణ అవసరాల కోసం ఉపయోగించే విమానాల భాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మాఫీ చేస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఏరో ఇంజన్ల కోసం రూ. 63,733 కోట్లను కేటాయించారు. రక్షణ సేవల రెవెన్యూ ఖర్చులు అంటే రోజూవారీ నిర్వహణ, ఇంధనం, మందుగుండు సామాగ్రి, మరమ్మతులు, సహాయక సిబ్బంది జీతాలు మొదలైన వాటికి 17.24 శాతం నిధుల్ని పెంచారు. పెన్షన్ల కోసం గతేడాదితో నిధులతో పోలిస్తే 6.53 శాతం పెంచి, రూ. 1.71 లక్షల కోట్లు కేటా యించారు. బడ్జెట్‌కు ముందు రక్షణ మంత్రిత్వ శాఖ తమ నిధులను కనీసం 20 శాతం పెంపును కోరినట్లు సమాచారం. నివేదికల ప్రకారం, గత 26 ఏళ్లలో భారత రక్షణ వ్యయం ఏకంగా 40 శాతం కన్నా ఎక్కువ పెరిగింది. ఇందులో రక్షణ మూలధన వ్యయం ఎక్కువగా ఉంది.



## తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం

### ఎంపి మల్లు రవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి1:** కేంద్ర బడ్జెట్ నిరాశజనక బడ్జెట్ అని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అభివర్ణించారు. దేశ ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలను పూర్తి నిరాశకు గురి చేసిందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన విజ్ఞప్తులను పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ ప్రాజెక్టులు, హైదరాబాద్ మౌలిక వసతులకు నిధులు ఇవ్వాలని కోరినా అవి ఏవీ ఇవ్వకపోగా, హైదరాబాద్ మెట్రో గురించి ప్రస్తావన లేనే లేదన్నారు. రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై బడ్జెట్‌లో మాట్లాడతారని, ప్రస్తుత భారతను గాలికి వదిలేసి 2047 ఫోకస్ చేస్తూ.. ఇప్పుడున్న సమస్యలను పక్కన పెట్టారని ఎద్దేవా చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెద్ద ఎత్తున ఉందని, నిరుద్యోగ సమస్యను గుర్తించకపోవడం అన్యాయం కాక మరేమిటి? అని ప్రశ్నించారు. 11 ఏళ్లగా 22 కోట్ల మందికి ఉద్యోగాలు ఇవ్వాలి, 2014 నుంచి కార్పొరేట్ సంస్థలకు అనుకూల బడ్జెట్ ఇస్తున్నారని తెలిపారు. వృద్ధి రేటుకు అర్థం ఉండదని, సామాన్య ప్రజలకు ఉపయోగం లేకుండా ఉండే వృద్ధి రేటు ఉందని.. ఉన్నవారు లేని వారికి మధ్య అంతరం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వాన్ని బిజెపి మర్చిపోయిందని విమర్శించారు.

# తయారీ రంగానికి మద్దతుగా పన్నుల సరళీకరణ

### ఇంధన మార్పు, భద్రతను ప్రోత్సహించేందుకు చర్యలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ 2026-27ను ప్రవేశపెడుతూ.. కస్టమ్స్, కేంద్ర ఎక్సైజ్ ప్రతిపాదనల ప్రధాన ఉద్దేశాలను కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. సుంకాల నిర్మాణాన్ని మరింత సరళీకృతం చేయడానికి, దేశీయ తయారీ రంగానికి మద్దతు ఇవ్వడానికి, ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందించడానికి, పన్నుల నిర్మాణంలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి ఈ ప్రతిపాదనలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

చాలా కాలంగా కొనసాగుతున్న కస్టమ్స్ సుంకం మినహాయింపులను తొలగించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తూ.. దేశంలో తయారవుతున్న వస్తువులు లేదా దిగుమతులు చాలా స్వల్పంగా ఉన్న వస్తువులపై ఇస్తున్న కొన్ని మినహాయింపులను తొలగించాలని బడ్జెట్ ప్రతిపాదించింది. అదేవిధంగా ఏదైనా ఒక నిర్దిష్ట వస్తువుపై వర్తించే సుంకం రేటును తెలుసుకునే ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు వివిధ కస్టమ్స్ నోటిఫికేషన్లలో ఉన్న ప్రభావవంతమైన రేట్లను నేరుగా టారిఫ్ షెడ్యూల్‌లోనే చేర్చాలని బడ్జెట్ ప్రతిపాదించింది. ఎగుమతులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎగుమతి చేసే సముద్ర ఆహార ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే నిర్దిష్ట ముడి సరుకులపై సుంకం లేని దిగుమతుల పరిమితిని పెంచాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. గత ఏడాది ఎగుమతి టర్నోవర్ ఎఫ్ఓబి విలువలో ప్రస్తుతం ఉన్న 1 నుంచి 3 శాతానికి ఈ పరిమితిని పెంచాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం తోలు లేదా సింథటిక్ పాదరక్షల ఎగుమతులకు అందుబాటులో ఉన్న నిర్దిష్ట ముడి సరుకులపై సుంకం లేని దిగుమతులను ఇకపై షూ అప్పర్స్(షూ పైన ఉండే భాగం) ఎగుమతులకు కూడా వర్తింపజేయాలని బడ్జెట్ ప్రతిపాదించింది. తోలు లేదా వస్త్ర దుస్తులు, తోలు లేదా సింథటిక్ పాదరక్షలు, ఇతర తోలు ఉత్పత్తుల ఎగుమతిదారుల కోసం తుది ఉత్పత్తిని ఎగుమతి చేయడానికి ఇచ్చే కాలవరిమితిని ప్రస్తుతమున్న 6 నెలల నుంచి 1 సంవత్సరానికి పెంచాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు.

శక్తి మార్పు, ఇంధన భద్రతను పటిష్టం చేసే లక్ష్యంతో బడ్జెట్‌లో పలు కీలక ప్రతిపాదనలు చేశారు. 'లిథియం-అయాన్ బ్యాటరీల తయారీకి ఉపయోగించే ముడి సరకులకు ఉన్న ప్రాథమిక కస్టమ్స్ సుంకం మినహాయింపును.. ఇకపై బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల కోసం వాడే లిథియం- అయాన్ బ్యాటరీల తయారీకి కూడా విస్తరించాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. సౌరశక్తి రంగానికి సంబంధించి సోలార్ గ్లాసు తయారీలో ఉపయోగించే సోడియం యాంటిమోనేట్ దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని కేంద్రమంత్రి ప్రతిపాదించారు.

అణుశక్తి రంగాన్ని మరింత ప్రోత్సాహిస్తూ.. అణు విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమైన వస్తువుల దిగుమతిపై ప్రస్తుతం ఉన్న ప్రాథమిక కస్టమ్స్ సుంకం మినహాయింపును 2035 సంవత్సరం వరకు పొడిగించాలని శ్రీమతి నిర్మలా సీతారామన్ సిఫార్సు చేశారు. అంతేకాకుండా ఈ మినహాయింపును వాటి ఉత్పత్తి సామర్థంతో సంబంధం లేకుండా అన్ని అణు ప్లాంట్లకు వర్తింపజేయాలని ఆమె ప్రతిపాదించారు. దేశంలో కీలక ఖనిజాల శుద్ధికి అవసరమైన ముడి వస్తువుల దిగుమతికి కూడా ప్రాథమిక కస్టమ్స్ సుంకం నుంచి మినహాయింపు ఇవ్వాలని బడ్జెట్ ప్రతిపాదించింది. సిఎన్ జీలో బయోగ్యాస్ మిశ్రమాన్ని ప్రోత్సహించేందుకు బయోగ్యాస్ మిశ్రమ సిఎన్ జీపై పై చెల్లించాల్సిన కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని లెక్కించేటప్పుడు అందులోని బయోగ్యాస్ విలువను పూర్తిగా మినహాయించాలని బడ్జెట్ ప్రతిపాదించింది.

విమానయాన రంగానికి సంబంధించి.. పౌర, శిక్షణ, ఇతర విమానాల తయారీకి అవసరమైన విడిభాగాలు, పరికరాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. రక్షణ రంగంలోని యూనిట్లు నిర్వహించే నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర పునరుద్ధరణ అవసరాల కోసం వాడే విమాన విడిభాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి సరుకులపై కూడా ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని బడ్జెట్ ప్రతిపాదించింది.

వినియోగదారు ఎలక్ట్రానిక్స్ రంగంలో విలువను మరింత పెంచే లక్ష్యంతో.. మైక్రోవేవ్ ఓవెన్ల తయారీలో ఉపయోగించే కొన్ని నిర్దిష్ట విడిభాగాలపై ప్రాథమిక కస్టమ్స్ సంకాన్ని మినహాయించాలని బడ్జెట్ ప్రతిపాదించింది.

ప్రపంచ వాణిజ్య అంతరాయాల కారణంగా ప్రత్యేక ఆర్థిక మండళ్లలోని (సెజ్) తయారీ యూనిట్లు తమ పూర్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను బడ్జెట్ పరిగణనలోకి తీసుకుంది. దీని పరిష్కారం కోసం సెజ్‌లలో అర్హత పొందిన తయారీ యూనిట్లు ఒకేసారి వర్తించే



వెసులుబాటుతో తమ ఉత్పత్తులను దేశీయ మార్కెట్లకు రాయితీ పన్ను రేట్లపై విక్రయించేలా ఆర్థిక మంత్రి ఒక ప్రత్యేక ప్రతిపాదన చేశారు. ఇలా దేశీయ మార్కెట్లో నిర్వహించే విక్రయాల పరిమాణం, ఆయా యూనిట్లు చేసే ఎగుమతులు ఒక నిర్ణీత శాతానికి మాత్రమే పరిమితం అవుతాయి. స్థానిక మార్కెట్లోని ఇతర యూనిట్లకు సమానమైన పోటీ వాతావరణాన్ని కల్పిస్తూనే ఈ చర్యలను అమలులోకి తీసుకురావడానికి అవసరమైన నియంత్రణ మార్పులు చేపట్టనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు.

## దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేషన్ ల్యాబ్‌లు

# 'ఆరెంజ్ ఎకానమీ'కి ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** దేశంలో యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగం అభివృద్ధిచెందుతున్న తరుణంలో మీడియా, వినోదం, మేధోసంపత్తి వంటిక్రియేటింగ్ రంగాలను మరింతగా వృద్ధిలోనికి తీసుకువస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పేర్కొన్నారు. ఈ మూడు రంగాలనే 'ఆరెంజ్' ఎకానమిగా వర్ణిస్తారు. విఎఫ్‌ఎక్స్,గేమింగ్; కామిక్స్, డిజైన్,టూరిజం వినోదం వంటివి అన్నింటినీ ఆరెంజ్ ఎకానమీగా పరిగణిస్తారు. 2030 నాటికి 20 లక్షలమంది నిపుణులు అవసరమని కేంద్రం అంచనావేసింది. ఈ డిమాండ్‌కు అనుగుణంగానే ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌క్రియేటివ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో దేశంలో మొత్తం 15 వేల పాఠశాలలు, 500 కళాశాలల్లో ఎవిజిసి కంటెంట్‌క్రియేటర్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయాలని బడ్జెట్‌లోప్రతిపాదించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించి డిజిటల్, సృజనాత్మకరంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించడం, కొత్తతరం సృష్టికర్తలను పెంపొందించేలక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యాచరణను రపారంభించింది. తూర్పు భారతావనిలోనేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఏర్పాటుచేస్తామన్నారు. శిక్షణపొందిన డిజైనర్లకొరత ఎక్కువ ఉందని, అందుకే ఈ సంస్థను ఏర్పాటుచేస్తామని మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దీర్ఘకాలికసుస్థిర ఆర్థికవృద్ధికి సృజనాత్మక ఆధారిత రంగాలే చోదకశక్తులని ఆర్థికసర్వేలో ఇప్పటికే పొందుపరిచారు. ఉపాధికల్పన,పట్టణసేవలు పర్యాటక రంగాలకు ఈ క్రియేటివిటీ అత్యవసరమని ఆమె అన్నారు. అయితే కొన్ని చట్టపరమైన అడ్డంకులు ఉన్నట్లు గుర్తించడంతోకేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లోనే తాజా ప్రతిపాదనలుచేసింది.




# విద్యుత్‌కు రూ.1,09,029 కోట్లు

### పునరుత్పాదక ఇంధనానికి పెద్దపీట
### రూ.32,917.70 కోట్లు కేటాయింపు
### సూర్యఘర్‌కు రూ.22 వేల కోట్లు
### బడ్జెట్‌లో ఇంధన పరివర్తనకు ప్రాధాన్యత



**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేంద్రం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక అంచనా బడ్జెట్‌లో విద్యుత్‌కు ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగానికి పెద్దపీట వేసింది. మొత్తంగా విద్యుత్ రంగానికి ఈ బడ్జెట్‌లో రూ.1.09.029 కోట్లు కేటాయింపులు చేసింది. ఇటీవల కాలంలో దేశంలోని సౌర విద్యుత్ రంగం వేగవంతమైన వృద్ధిని సాధించింది. ఇది స్థిరమైన అభివృద్ధి, ఇంధన భద్రత కోసం కేంద్ర ప్రభుత్వ ఎజెండాకు అనుగుణంగా ఉంది. ఇంధన పరివర్తనలో భాగంగా సౌర శక్తి మరియు ఇతర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు నిధులు పెంచింది. దీనికి సంబంధించిన నిధులను రూ.32,914.7 కోట్లకు పెంచింది. ఈ కేటాయింపులు వికసిత్ భారత్ (డెవలప్డ్ ఇండియా) లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన ఇంధన భద్రత మరియు స్థిరమైన అభివృద్ధికి దోహదపడతాయి. ముఖ్యంగా రూఫ్‌టాప్ సోలార్ కోసం ప్రధానమంత్రి సూర్య ఘర్ (పిఎంఎస్‌జి) పథకానికి రూ.22 వేల కోట్లు కేటాయింపులు చేసింది. ఇది గృహాలకు విద్యుత్ సదుపాయాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే సౌర విద్యుత్ గ్రిడ్‌ల ఆధునికీకరణకు రూ.1,775 కోట్లు కేటాయించడం ద్వారా ఇంధన పరివర్తనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ప్రస్తుత 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ఈ విభాగానికి రూ.1,500 కోట్లు కేటాయించగా, ఈ కొత్త బడ్జెట్‌లో మరో రూ.225 కోట్లు అదనంగా కేటాయింపులు పెంచింది. పునరుత్పాదక సామర్థ్యం వేగంగా పెరుగుతున్న కొద్దీ, అధికవోల్టేజ్ నెట్‌వర్క్‌లను బలోపేతం చేయడం మరియు నిల్వ నేతృత్వంలోని గ్రిడ్ వశ్యత వ్యవస్థ విశ్వసనీయత మరియు సామర్థ్యాన్ని పెంచనున్నాయి. గ్రామీణ ఇంధన పరివర్తనలో భాగంగా పిఎం కుసుమ్ వంటి పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో సౌరశక్తి వినియోగాన్ని పెంపొందించడం లక్ష్యంగా చర్యలు చేపట్టనుంది. అలాగే ప్రధానంగా రైతులకు నాణ్యమైన విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు, వారికి అదనపు ఆదాయం వచ్చేలా వ్యవసాయ పంపుసెట్లను సౌరశక్తితో అనుసంధానించడంపై పూర్తి స్థాయిలో కేంద్రీకృతం కానుంది. అలాగే సౌర పార్కులు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధుల సమకూర్పుపై ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. 2030 నాటికి భారతదేశం 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని సాధించే దిశగా పయనిస్తున్నందున, మౌలిక సదుపాయాల సంసిద్ధత, గ్రిడ్ స్థిరత్వం మరియు నైపుణ్యం కలిగిన మానవశక్తి లభ్యతతో సహా ప్రధాన పెట్టుబడి నిబద్ధతల నుండి క్షేత్రస్థాయిలో అమలు వైపు దృష్టి క్రమంగా మారుతోంది. ఈ కేంద్ర బడ్జెట్ భారతదేశం యొక్క స్వచ్ఛమైన ఇంధన ఆశయాలు కాగితపు ప్రణాళికలకు మించి నమ్మకమైన, స్కేలబుల్ విద్యుత్ ఉత్పత్తిగా అనువదించబడిందని నిర్ధారించుకోవడానికి కీలకమైన క్షణంగా పరిగణించబడుతోంది. గ్రీన్ ఎనర్జీ కారిడార్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ప్రోత్సాహకాలు, గ్రిడ్ స్థిరత్వాన్ని నిర్ధారించడానికి ఎఫ్‌డిఆర్ఇ, హైబ్రిడ్ ప్రాజెక్టులకు మద్దతుతో సహా ప్రసార మౌలిక సదుపాయాలకు నిరంతర విధాన మద్దతు అవసరాన్ని హైలైట్ చేస్తుంది. క్రమబద్ధీకరించబడిన ఆమోదాలు మరియు వేగవంతమైన అమలు సమయ పాలనలతో పాటు దీర్ఘకాలిక నిల్వ మార్కెట్ విధానాలపై ఎక్కువ స్పష్టత ప్రాజెక్ట్ బ్యాంకింగ్ మరియు డెలివరీ ఖచ్చితత్వాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుందని కేంద్రం పేర్కొంది.

# సాగు, అనుబంధ రంగాలకు రూ. 1,62,671 కోట్లు

### ఎఐ టూల్‌తో అగ్రిస్టాక్ పోర్టల్ ఏర్పాటు
### భారత్ విస్తార్ పేరిట సాంకేతికతకు ప్రాధాన్యత
### కిసాన్ క్రెడిట్‌కార్డు రూ. 5 లక్షలకు పెంపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** రైతులకు అధిక ఆదాయా లు, యువత సాధికారత, సమగ్ర మత్స్యకార అభివృద్ధికి ప్రాధాన్యతా లక్ష్యంగా చేసుకుని కేంద్ర 2026-27 బడ్జెట్‌లో వ్యవసాయ కార్యక్రమాలను ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు మొత్తంగా రూ.1,62,671 కోట్ల మేర కేటాయింపులు జరిపింది. ముఖ్యంగా సాంకేతికతతో నడిచే వ్యవసాయానికి పెద్ద ప్రోత్సాహకంగా 2026-27 కేంద్ర బడ్జెట్‌లో భారత్ విస్తార్‌ను ప్రారంభించనుంది. దేశంలో వ్యవసాయంపై ఆధారపడిన 46.1 శాతం మంది రైతులు, శ్రామిక శక్తిని లక్ష్యంగా చేసుకుని చిన్న విస్తీర్ణం కలిగిన వారికి మద్దతు ఇవ్వడానికి, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఖచ్చితమైన వ్యవసాయంలో ముందడుగు వేసేందుకు దోహదపడుతుందని వెల్లడించింది. అగ్రిస్టాక్ పోర్టల్‌లు, భారత వ్యవసాయ పరిశోధన మండలి యొక్క వ్యవసాయ పద్ధతులను అధునాతన ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వ్యవస్థలతో అగ్రిస్టాక్ పోర్టల్ ఏర్పాటు చేయడం ద్వారా రైతులు వనరులను ఎలా యాక్సెస్ చేయాలో మరియు నిర్ణయాలు తీసుకునే విధానాన్ని మార్చడానికి ఒక బహుళ సాధనంగా బడ్జెట్‌లో పేర్కొంది.

తద్వారా రైతులకు విత్తనాల నుండి మార్కెట్ ధరల వరకూ అన్ని వివరాలు డిజిటల్‌గా అందుబాటులోకి వస్తాయి. భారత్ విస్తార్ టూల్‌తో కేంద్ర ప్రభుత్వ అగ్రి స్టాక్ వెబ్‌సైట్లను, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) వ్యవసాయ మార్గదర్శకాలను, అధునాతన ఏఐ సిస్టమ్‌లను అనుసంధానిస్తారు. దేశ రైతుల వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి ఖిభారత్ విస్తార్‌లోని ఏఐ సమాచారం దోహదపడుతుల్లు. పంటసాగు చేపట్టే క్రమంలో ముప్పును తగ్గించే విలువైన సలహాలను అందించడం ద్వారా దేశంలోని కోట్లాది మంది రైతులను ఏఐతో ఏకీకృతం చేయాలనే భారత సర్కారు విజన్ కూడా సాకారం అవుతుందని వెల్లడించింది. రైతులు తమతమ ప్రాంతీయ భాషల్లోనే ఈ టూల్ ద్వారా వ్యవసాయ సూచనలను పొందే వీలుంటుంది. ఈ వేదిక ప్రధానంగా వ్యవసాయ ఉత్పాతదకతను పెంచడం, నష్టాలను తగ్గించేందుకు అవసరమైన మద్దతును అందిస్తుంది. ఇక గ్రామీణ ఉద్యోగాలను ప్రోత్సహించేందుకు పశు పోషణకు బలమైన మద్దతును బడ్జెట్‌లో కల్పించింది. క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ కార్యక్రమం, పశు సంస్థల విస్తరణ, ఆధునీకరణ, పాడి, పశువులు, కోళ్ల కేంద్రీకృత ఇంటిగ్రేటెడ్ సృష్టితో పాటు, పశువుల రైతు ఉత్పత్తి సంస్థలకు ప్రోత్సాహం కల్పించనుంది. కొబ్బరి, జీడిపప్పు, గంధం, కోకో, అగర్ చెట్లు, బాదం, వాల్‌నట్లు, పైన్ గింజలు వంటి తీరప్రాంత, అనుకూలమైన ప్రదేశాల్లో ప్రోత్సహించనుంది. ప్రపంచంలోనే అతి పెద్ద కొబ్బరి ఉత్పత్తిదారు అయిన భారత్ 10 మిలియన్ల మంది రైతులతో సహా 30 మిలియన్ల మందికి జీవనోపాధిని కొనసాగిస్తోంది. కీలక రాష్ట్రాల్లో ఉత్పాదకత లేని చెట్ల స్థానంలో అధిక దిగుబడి ఇచ్చే మొక్కలతో భర్తీ చేయడం వంటి వాటి ద్వారా ఉత్పత్తిని పెంచడానికి ప్రోత్సాహక పథకం అమలు చేయనుంది. మత్స్య రంగంలో 500 జలాశయాలు, ఇతర నీటి వనరుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను ప్రారంభించనుంది.

తీర ప్రాంతాలలో మత్స్య సంపద గొలుసును బలోపేతం చేయడం, స్టార్టప్‌లు, మహిళా నేతృత్వంలోని సమూహాలు, చేపల రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా మార్కెట్ సంబంధాలను పెంపొందిస్తుంది. గ్రామీణ, పట్టణ



ప్రాంతాల్లో నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో పశుసంవర్ధకానికి, సీతారామన్ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ కార్యక్రమం, పశువుల పాడి మౌలిక సదుపాయలను మెరుగుదల ద్వారా వివరణాత్మక మద్దతును అందించనుంది. పశువైద్య నిపుణుల లభ్యతను పెంచడానికి, ప్రైవేట్ రంగంలో పశువైద్య మరియు పారా వెట్ కళాశాలలు, పశువైద్య ఆసుపత్రులు, రోగనిర్ధారణ ప్రయోగశాలలు మరియు సంతానోత్పత్తి సౌకర్యాల స్థాపనకు మద్దతు ఇచ్చే పథకానికి మద్దతుగా రుణలింక్డ్ మూలధన సబ్సిడీని ప్రతిపాదించింది. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధిని, వ్యవసాయ ఉత్పాతదకతను పెంచడానికి, వ్యవసాయ గృహాల కొనుగోలు శక్తిని బలోపేతం చేసేందుకు, వ్యవసాయ వర్గాలకు సార్వత్రిక సేవలను అందించేందుకు సంస్కరణలను అమలు చేయడం, ప్రతీ వ్యవసాయ కార్యక్రమాల నుండి రైతులు, గ్రామీణ ప్రజలు నేరుగా ప్రయోజనం పొందేలా చర్యలు చేపట్టనుంది.

రాబోయే రెండేళ్లలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా ప్రోత్సాహకాలను అమలు చేయనుంది. పప్పుధానాలు, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయనుంది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే రుణాల పరిమితి 3 నుండి రూ.5 లక్షలకు పెంచింది. కూరగాలు, పండ్లు, చిరుధాన్యాల ఉత్పత్తి, ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యక్రమం చేపట్టనుంది. తదుపరి 6 ఏళ్ల పాటు మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్ ప్రారంభించి ముఖ్యంగా కందులు, మినుములు, మసూర్ పప్పులపై దృష్టిసారించనుంది.

## ఖేలో ఇండియాకు ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ఢిల్లీలో ప్రవేశ పెట్టిన 2026-27 బడ్జెట్‌లో క్రీడారంగానికి పెద్దపీట వేశారు. క్రీడా బడ్జెట్ కేటాయింపులను పెంచడం, దేశీయంగా క్రీడా పరికరాల తయారీని ప్రోత్సహించడం, ఖేలో ఇండియా మిషన్‌ను మరో పదేళ్లపాటు పొడిగించడం వంటి కీలక నిర్ణయాలు ప్రకటించారు. క్రీడా రంగానికి 4480 కోట్ల రూపాయలు కేటాయించడం గమనార్హం. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ బిడ్ దాఖలు చేసిన క్రమంలో ఈ నిర్ణయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, 'నాణ్యమైన, తక్కువ ధరకే క్రీడా పరికరాలను అందించే గ్లోబల్ హాబ్‌గా ఎదిగే సత్తా భారత్‌కు ఉంది'అని అన్నారు.

# ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుస్థిర ప్రగతి
### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే విధంగా, దేశంలో మౌలికవసతులకు పెద్దపీట వేస్తూ రక్షణ రంగాన్ని మరింత శక్తివంతం చేసుకుంటూ, రైల్వే, ఫార్మా, అగ్రికల్చర్, మహిళా సంక్షేమం వంటి అనే అంశాలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతి వారం జరిగే కేబినెట్ సమావేశాల్లో ఏదైనా ఒక సంస్కరణ తీసుకొస్తుందని, బడ్జెట్‌లోనూ, విదేశీ పెట్టుబడులు, ఐటి, క్రిటికల్ మినరల్ సెక్టార్‌లో, టాక్స్ విషయంలోనూ చాలా సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. 2, 3 లక్షలనున్న వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపును రూ.12.50 లక్షలకు పెంచారని, సామాన్యులు వాడే వస్తువులపై టాక్స్ తగ్గించారన్నారు.

ఇది రిఫామ్స్ ఎక్స్ ప్రెస్ బడ్జెట్ అని, తాత్కాలికంగా లబ్ధి చేకూర్చడం కంటే దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ ఇది అన్నారు. అనేక రాష్ట్రాలు, ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని, దేశం అన్ని రాష్ట్రాలను కలుపుకుంటూ వికసిత భారతనిర్మాణం దిశగా దూసుకెళ్తుందని, ఈ బడ్జెట్ దేశాభివృద్ధికి బాటలు వేసే బడ్జెట్, సుస్థిరమైన ఆర్థిక ప్రగతి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్తు తరాల్లో నమ్మకాన్ని కలిగించే బడ్జెట్ అన్నారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా వేస్తున్న తొలి అడుగు ఈ బడ్జెట్. తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్ అనేక రకాలుగా మేలుచేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ పన్నుల వాటాగా, గతేడాదితో పోలిస్తే 13.5శాతం వృద్ధిరేటుతో పన్నుల వాటా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో, పన్నుల వాటాగా రూ.29,280 కోట్లు రాగా, అది 2026-27 సంవత్సరానికి 13.5శాతం పెరుగుదలతో రూ.33,180 కోట్లు కేటాయించారని అన్నారు. దేశంలో 7 హైస్పీడ్ రైల్ కారిడార్స్ ప్రకటిస్తే.. అందులో మూడు (హైదరాబాద్-పూణే, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై) హైదరాబాద్ నగరం నుంచే ప్రారంభం అవుతున్నాయని, ఇది మనమంతా గర్వించాల్సిన విషయం అన్నారు. రింగ్ రోడ్డు, ఐటి, బయోఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల అభివృద్ధిలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరానికి మూడు హై స్పీడ్లు రావడం మరింత లాభం చేయనుందని, ఈ బడ్జెట్‌లో ప్రకటించిన బయోఫార్మా శక్తి (స్ట్రాటజీ ఫర్ హెల్త్ కేర్ అడ్వాన్స్‌మెంట్ త్రూ నాలెడ్జ్, టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్) కార్యక్రమం ద్వారా ఫార్మా కేపిటల్‌గా, వ్యాక్సిన్ క్యాపిటల్‌గా ఉన్న మన హైదరాబాద్ నగరానికి చాలా మేలు జరగనుందన్నారు. గ్లోబల్ బయోఫార్మా మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా భారతదేశం ఎదగడంలో హైదరాబాద్ కీలకపాత్ర పోషించేందుకు వీలుకలుగుతుందన్నారు. ఎరువుల సబ్సిడీకి నిధులు గతంతో పోలిస్తే సుమారు రూ.7 వేల కోట్లు అదనంగా కేటాయించిందన్నారు. మొత్తం రూ.1.26 వేల కోట్లు ఎరువుల సబ్సిడీ కోసం కేటాయించిందని,. ఇందులో సింహ భాగం తెలంగాణకే కేటాయించినట్లు తెలిపారు. యువతులకు.. ల్యాబ్, క్లాసెస్ కారణంగా.. ఇళ్లకు దూరంగా ఉండి చదివే వారికి ఇబ్బంది అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి జిల్లాకు ఒక గర్ల్స్ హాస్టల్ నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఖర్చు పెట్టుకునే నిధులపైన పన్నును 5 లక్షల నుంచి 2లక్షలకు తగ్గించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉపాధి కల్పనను ప్రోత్సహించే బడ్జెట్. వ్యవసాయంతో కమర్షియల్ క్రాప్స్‌ను ప్రోత్సహించడం, మహిళలను ప్రోత్సహించడం ఇవన్నీ ఉపాధి అవకాశాలను పెంచడమే అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు అవినీతికి కొమ్ముకాస్తున్నాయి. రెండు పార్టీలపై ప్రజల్లో విశ్వాసం పోయింది. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారని, కెసిఆర్ కుటుంబం డబ్బుల వాటాకోసం కొట్టుకుంటుంటే రేవంత్ సర్కారులో మంత్రులు డబ్బుల వాటాకోసం కొట్లాడుకుంటున్నారని అన్నారు. క్రిటికల్ మినరల్స్ విషయంలోనూ.. ఎనర్జీ, మినరల్ సెక్యూరిటీ కోసం చాలా నిర్ణయాలు తీసుకున్నారు... ఒడిశా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుకుంటూ.. రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్ ఏర్పాటుచేస్తున్నామని,. రేర్ ఎర్త్, క్రిటికల్ మినరల్స్ ఎక్స్ ప్లొరేషన్, ప్రాసెసింగ్ కోసం ఈ కారిడార్ ఎంతో ఉపయుక్తం కానుందని, క్రిటికల్ మినరల్స్‌పై మనం 98శాతం దిగుమతులపై ఆధారపడుతున్నాం. దీన్ని తగ్గించుకుని ఆత్మనిర్భరత సాధించేందుకు ఈ నిర్ణయం ఎంతో ఉపయుక్తం కానుందని కేంద్రమంత్రి వెల్లడించారు.

# వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సందర్భంగా, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లలో బడ్జెట్ ప్రత్యక్ష ప్రసారాన్ని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ వికసిత్ భారత్ నిర్మాణ సంకల్పం ఇక ఆశయంగా మాత్రమే కాకుండా, వాస్తవంగా మారే దిశగా దేశాన్ని దృఢంగా ముందుకు నడిపిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్ గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్‌కు హైస్పీడ్ రైల్ కారిడార్ల ప్రకటనతో రాష్ట్రం జాతీయ వృద్ధి యంత్రంగా మరింత బలపడనుందని అన్నారు. ఇది మార్పును తీసుకొచ్చే బడ్జెట్ అని పేర్కొంటూ, ఆర్థిక బలమునుంచి జాతీయ సామర్థ్యానికి, అంత్యోదయం నుంచి అభ్యుదయానికి దేశాన్ని నడిపించే స్వర్ణయాత్రకు ఈ బడ్జెట్ పునాది వేస్తుందన్నారు. పచ్చని పొలాలు, బలమైన ధాన్యాగారాలు, ప్రతి కుటుంబంలో చిరునవ్వులు ఇవన్నీ ఈ బడ్జెట్ లక్ష్యాలని వివరించారు.



ఆత్మనిర్భర్ భారత్ దృష్టితో రూపొందిన ఈ బడ్జెట్ దేశీయ తయారీ రంగానికి ఊతమివ్వడంతో పాటు, ఇంధన భద్రతను బలోపేతం చేస్తోందని, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే దిశగా కీలక సంస్కరణలను తీసుకొస్తుందని అన్నారు. ఉపాధి సృష్టి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, కొనుగోలు శక్తి వృద్ధి, నాణ్యమైన విద్యా-వైద్య సేవల విస్తరణకు ఈ బడ్జెట్ బలమైన పునాదిని వేస్తోందన్నారు. ఈ నిరంతర విధానాల ఫలితంగా భారతదేశం సుమారు 7 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగుతోందని, పేదరికం తగ్గింపులో చారిత్రాత్మక పురోగతి సాధించిందని తెలిపారు.

# పర్యాటకానికి మెరుగులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** పర్యాటకరంగం అభివృద్ధికోసం కేంద్ర బడ్జెట్‌లో ఈసారి నిధులు కేటాయింపులు పెంచారు. ఆతిథ్యరంగంపై మరింతగా అవగాహణ పెంచేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ సంస్థను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ జాతీయ మండలిని మరింతగా అప్‌గ్రేడ్‌చేస్తామని ప్రకటించారు. బోధన, పరిశ్రమరంగం, ప్రభుత్వానికిమద్య ఈ సంస్థలు వారధిగా నిలుస్తాయని కేంద్ర మంత్రి సీతారామన్ అన్నారు. పర్యాటకరంగం వృద్ధికోసం బడ్జెట్‌లో 2480 కోట్ల రూపాయలు కేటాయించారు. ప్రత్యేకించి ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి 6832 కోట్లు కేటాయించడం సింహభాగం పర్యాటకానికి కేటాయింపులు జరపడం కీలకంగా మారింది. పర్యాటక రాష్ట్రాలుగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ము కాశ్మీర్‌లతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని అరుకులోయ, తూర్పు ఘాట్లు, పశ్చిమ ప్రాంత ఘాట్‌లు పోథిగై మలై వంటి వాటిని మరింతగా వృద్ధిచేయాలని నిర్ణయించారు. ఒడిశా, కర్ణాటక, కేరళల్లో తాబేళ్ల పెంపం సైట్లను కూడా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. 15 పురావస్తు కేంద్రాలను మరింతగా అభివృద్ధిచేస్తామని ప్రకటించారు. గుహలు, సొరంగాలను ప్రత్యేక వాక్‌వేలసాయంతో మరింతగా వినియోగంలోకి తెస్తామన్నారు. అంతర్జాతీయ ప్రయాణాలను మరింతగా అందుబాటులోకి తెస్తున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. అంతర్జాతీయ టూర్‌ప్రోగ్రామ్‌లలో టిసిఎస్‌నుప్రస్తుతం ఐదుశాతం, 20శాతం రేట్లను ఒకే శ్లాబ్‌గా రెండుశాతానికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. పూర్వోదయ రాష్ట్రాలయిన బీహార్; జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో పర్యాటకరంగం అభివృద్ధికోసం నాలుగువేల ఈబస్‌లను కూడా కేటాయస్తామని తెలిపారు. అలాగే వైద్యటూరిజం అభివృద్ధికోసం ఐదు ప్రాంతీయ మెడకిల్ హబ్‌లను ఏర్పాటుచేస్తోంది. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యంలో ఇవి ఏర్పాటవుతాయి. సమీకృత ఆరోగ్య కాంప్లెక్స్‌లను ఏర్పాటుచేసి సేవలందిస్తాయి. సమిష్టిగా వైద్యసేవలు, విద్యాబోధన, రీసెర్చి వనరులు కూడా ఈ కేంద్రాల్లో ఉంటాయి. ఈసారి ఈశాన్యరాష్ట్రాలను కూడా పర్యాటక రంగం అభివృద్ధికి కీలకం చేసింది. ఏడు ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలను వృద్ధిలోనికి తీసుకు రానున్నట్లు కేంద్ర మంత్రి తన బడ్జెట్‌ప్రసంగంలో ప్రస్తావించారు.

15 పురావస్తు కేంద్రాల అభివృద్ధికి చర్యలు



# బిసిలకు 42 శాతం బిఫామ్‌లు అన్ని పార్టీలు ఇవ్వాలి

## సిఎం, అన్ని పార్టీలకు ఆర్.కృష్ణయ్య బహిరంగ లేఖ



**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** : చట్ట పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి కోర్టు స్టే ఉందని ఇవ్వలేదు. పార్టీ పరంగా బి ఫారాలు ఇవ్వడానికి అన్ని పార్టీలు బీసీలకు 42 శాతం బి ఫారాలు ఇచ్చి మాట నిలుపుకోవాలని కాంగ్రెస్ పార్టీని రాజ్యసభ సభ్యుడు,బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు.బిఫారంల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ ముందుకువస్తే అన్ని పార్టీలు కూడా ఇవ్వడానికి ముందుకు వస్తాయన్నారు. ఈ మేరకు ఆయన సిఎంకు, అన్ని పార్టీల అధినేతలకు లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఇస్తామని వాగ్దానం చేసి అసెంబ్లీలో చట్టం చేసి జీవో తీసి కోర్టు స్టే సాకుతో తప్పించుకుంది. కోర్టు స్టే వచ్చిన తర్వాత పార్టీ పరంగా ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అనేకసార్లు ప్రకటించారు.ఇప్పటికైనా మాట ప్రకారం పార్టీపరంగా 42 శాతం బి ఫారం లు ఇవ్వాలని కృష్ణయ్య ముఖ్యమంత్రిని పిసిసి అధ్యక్షున్ని కోరారు. అదే విధంగా హైకోర్టులో ఉన్న రిజర్వేషన్ల కేసును ఫుల్ బెంచ్ మీదకు తొందరగా తీసుకురావాలని అలాగే ప్రముఖ న్యాయవాదులు చేత వాదించాలని కోరారు. కేసు ఆధారాలు బలంగా ఉన్న 42 శాతం రిజర్వేషన్ల జీవో నెంబర్ 9 రాజ్యాంగ బద్ధంగా చట్టబద్ధంగా న్యాయబద్ధంగా ఉంది. ఎట్టి పరిస్థితులలో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే సుప్రీంకోర్టు అగ్రకులకు 10శాత్తం రిజర్వేషన్లు పెట్టినప్పుడు కేసులో 50 సీలింగ్ ఎత్తివేసింది. పైగా ఇందిరా సహానీ కేసులో ఎంపరికల్ డాటా ఉంటే 50 సీలింగ్ ను అధిగమించవచ్చునని సుప్రీం కోర్టు అభిప్రాయం కూడా ఉన్నదన్నారు.

మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు 22 శాతం మాత్రమే కేటాయించారు.

ఎన్నికల వాగ్దానం కామారెడ్డి డిక్లరేషన్ లో 42 శాతం ప్రకటించి ఆచరణలో కేవలం 20 రెండు శాతం కేటాయించి బీసీలకు అన్యాయం చేశారని కృష్ణయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

**అత్యల్పంగా సంగారెడ్డిలో 12.8, అత్యధికంగా పెద్దపల్లిలో 17.1, హైదరాబాద్‌లో 15.8 డిగ్రీలు**

**ఫిబ్రవరి రెండవ వారం నుంచి ఏప్రిల్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వడగళ్ల వానలు కురిసే అవకాశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగుతున్నాయి. కొన్నిచోట్ల రాత్రి చలిగాలుల ప్రభావం వు న్నా ఉష్ణోగ్రతలు మాత్రం 12.8 డిగ్రీలు అంతకు ఎక్కువగానే వున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది ఒక డిగ్రీ వరకు ఎక్కువగా వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఫిబ్రవరి మొదటి వారంలోనే రాష్ట్రంలో ఎండల తీవ్రత మొదలయ్యాయి. రాత్రిపూట వాతావరణం కొంత మే ర చల్లగానే వున్నా పగటిపూట ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల వరకు వుండడం, కొన్నిచోట్ల 26 డిగ్రీలు దాటడం గమనార్హం. ఈ నెల రెండవ వారం ను ంచి ఎండల తీవ్రత మరింత పెరగడంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలలో క్యూములో నింబస్ మేఘాలు ఏర్పడే పరిస్థితులు వున్నాయని, కొన్ని చోట్ల ఇప్పటికే ఇలాంటి మేఘాలు కనిపిస్తు న్నాయని వాతావరణ శాఖ అధికారులం టున్నారు. గత ఏడాది మార్చి నెలలో క్యూములో నింబస్ మేఘా లు ఏర్పడగా వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పుల వల్ల ఈ ఏడాది నెల రోజుల ముందుగానే ఇవి ఆవిర్భవించే అవకాశాలున్నాయని వారం టున్నారు. దీని కారణంగా పలు జిల్లాలలో వడగళ్ల వానలు కురిసే అవకాశం వుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఆదివారం రాత్రి ఉష్ణో గ్రత అత్యల్పంగా సంగారెడ్డి కోహిర్‌లో 12.8 డిగ్రీలు వుండగా అత్యధికంగా పెద్దపల్లిలోని రామగిరిలో 17.1 డిగ్రీలుగా వుంది. రాజధాని హైదరా బాద్‌లో 15.8 డిగ్రీలుగా వుంది. ఈ ఏడాది మార్చి నుంచే దంచికొట్టనున్న ఎండలు ఇదిలావుండగా ఈ ఏడాది చలికాలం ముగియడంతో ఎండల ప్రభావం మొదలైంది. గడచిన వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత కొంత పెరిగింది. రాత్రివేళ ఓ మోస్తరు చలిగావున్నా పగటిపూట ఎండ తీవ్రత 24 నుంచి 26 డిగ్రీల వరకు వుంటోంది. ఫిబ్రవరి నెల రెండవ వారంలో ఇది 30 డిగ్రీల వరకు వుండే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులంటున్నారు. ఇదే సమయంలో రాత్రివేళ ఉష్ణోగ్రతలు 20 డి గ్రీల నుంచి 24 డిగ్రీల వరకు పెరిగే వీలుందని వారంటున్నారు. మార్చి నెలలో పగటిపూట ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుంచి 38 డిగ్రీల వరకు పె రిగే వీలుందని, రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 22 డిగ్రీల నుంచి 26 డిగ్రీల వరకు పెరిగే వీలుందని అధికారులు చెబుతున్నారు.

# ఇది వికసిత భారత్ బడ్జెట్..

## ఇది ప్రజారంజక బడ్జెట్ : ఎంపి ఈటల

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** భారతదేశంలో సుస్థిరమైన ప్రభుత్వ నడుస్తుందరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో ఉన్న మోడి ప్రభుత్వం దూరదృష్టితో దీర్ఘకాలిక నిర్ణయాల వల్ల భారత జిడిపి ఏడు శాతం పెరిగిందని, గత సంవత్సరం 50 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెడితే ఈ సంవత్సరం 53 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. అనేక ప్రజారంజక విషయాల మీద దృష్టి పెట్టారు గంభీరంగా ఉన్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి గత బడ్జెట్లో నాలుగు లక్షల కోట్ల రూపాయలు కేటాయించగా, ఈసారి కూడా పెట్టారు. మేకిన్ ఇండియా మేడిన్ ఇండియా అనుగుణంగా యువశక్తి దేశ పురోగమనములో భాగస్వాములు చేయాలని లక్ష ్యంతో బడ్జెట్ పెట్టారు. అనేక మందుల మీద ఇంపోర్ట్ టాక్స్ తగ్గించారు. క్యాన్సర్‌తో పాటు 17 రకాల మందుల మీద పన్ను రాయితీ ఇచ్చి పేద రోగులకు ఉపశమనం కల్పించారు. ప్రతి జిల్లా కేంద్రంలో ట్రామా కేర్ సెంటర్ పెట్టాలని నిర్ణయించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకానికి పేరు మారిస్తే ఆ పథకమే తీసేస్తున్నట్లుగా ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేశాయి కానీ గత బడ్జెట్లో 81 వేల కోట్ల రూపాయలు బడ్జెట్ పెడితే ఈసారి లక్షా యాభైవేల కోట్ల రూపాయల పై చిలుకు ఈ బడ్జెట్ పెట్టారు. గ్రామీణ పేదలకు మరింత ఉపాధి కల్పిస్తున్నారు. దేశ భవిష్యత్తు క్యాపిటల్ ఎక్స్పెండిచర్ మీద ఆధారపడి ఉంటుంది పోయినసారి 11 లక్షల కోట్ల రూపాయలు పెడితే మీద పన్ను రాయితీ ఇచ్చి పేద రోగులకు ఉపశమనం కల్పించారు. ప్రతి జిల్లా కేంద్రంలో ట్రామా కేర్ సెంటర్ పెట్టాలని నిర్ణయించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకానికి పేరు మారిస్తే ఆ పథకమే తీసేస్తున్నట్లుగా ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేశాయి కానీ గత బడ్జెట్లో 81 వేల కోట్ల రూపాయలు బడ్జెట్ పెడితే ఈసారి లక్షా యాభైవేల కోట్ల రూపాయలు ఈ బడ్జెట్ పెట్టారు. గ్రామీణ పేదలకు మరింత ఉపాధి కల్పిస్తున్నారు.



## ప్రముఖ నటుడు రఘునాథరెడ్డి కన్నుమూత

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** టాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు రఘునాథరెడ్డి కన్నుమూశారు. ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన శనివారం రాత్రి కుషాయిగూడ ప్రథమపురి కాలనీలోని ఆయన నివాసంలో గుండె పోటుతో తుదిశ్వాస విడిచారు.ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రఘునాథరెడ్డికి కృష్ణా జిల్లా కుందేరు గ్రామం. కృష్ణారెడ్డి, సామ్రాజ్యమ్మ దంపతులకు జన్మించారు. ఆపై విజయవాడ, మచిలీపట్నంలలో ఆయన విద్యాభ్యాసం జరిగింది. సౌత్ సెంట్రల్ రైల్వే లాలగూడ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నప్పుడు నాటకాల నుంచి పరుచూరి బ్రదర్స్ సహకారంతో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో దాదాపు 350కు పైగా సినిమాల్లో నటించారు. శోభన్‌బాబు 'సర్పయాగం' చిత్రంతో ఇండస్ట్రీలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అడుగుపెట్టిన ఆయన ఆపై 'కలిసుందాం రా, ఒసేయ్ రాములమ్మ, ఒరేయ్ రిక్షా, చీమల దండు, ఇంద్ర, డాన్, తమ్ముడు, రాయలసీమ రామన్నచౌదరి, సీమ సింహం, మల్లీశ్వరి, సంక్రాంతి, శ్రీరామ రాజ్యం'.. ఇలా పలు సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు. చివరిగా 2018లో సుబ్రహ్మణ్యపురం సినిమాలో నటించిన రఘునాథరెడ్డి అనారోగ్యం కారణంగా సినిమాలకు గుడ్‌బై చెప్పారు.

## బిఆర్ఎస్ అంటే బ్లాక్ మెయిల్ రాష్ట్ర సమితి

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అంటే బ్లాక్ మెయిల్ రాష్ట్ర సమితి అని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం గాంధీ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అరాచక పాలనపై విచారణలు చేస్తున్నామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ప్రమేయం ఉన్నటు వంటి నేతలు విచారణ జరుగుతున్నాయని, ఫోన్ ట్యాపింగ్ ఘోరమైన నేరం అన్నారు. కెటిఆర్, హరీష్, సంతోష్ మాదిరి కెసిఆర్‌కి సిట్ నోటీసులు పంపి విచారణ చేస్తున్నారని అన్నారు. కెసిఆర్ విచారణను భూతద్దంలో చూడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కెసిఆర్ నీతిమంతుడనీ, అన్యాయమని అనడం గగ్గోలు పెట్టడం, కెసిఆర్ రాజరిక పాలనలో ఉన్నామనే భ్రమలో ఉన్నారన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని, చట్టం తన పని తాను చేసుకుంటే పోతుంటే నిందలు వేయడం విచార కరమన్నారు. చట్టం ఎవరికి చుట్టం కాదని, గతంలో శిబూ సొరెన్, మాయావతి, జయలలిత, లాలు ప్రసాద్ యాదవ్, యడ్యూరప్ప లాంటి ముఖ్యమంత్రులు విచారణలు ఎదుర్కొన్నారని, టెలిగ్రాఫ్ యాక్ట్ ప్రకారం విపత్కర పరిస్థితుల్లో మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేసే అవకాశం ఉందన్నారు. కెసిఆర్ ఆజ్ఞ లేనిదే ఫోన్ ట్యాపింగ్ జరగలేదని, పారిశ్రామిక వేత్తలు, సినీతారల ఫోన్ ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్.

# చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద తల్లీ, బిడ్డల ఆత్మహత్యలపై వీడని మిస్టరీ

## అర్ధరాత్రి వేళ ముప్పావు గంట రైల్వే స్టేషన్‌లో తిరిగినా, పట్టాలపై వెళ్లినా పట్టించుకోని పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** చరపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఘట్‌కేసర్ మార్గంలో శుక్రవారం అర్ధరాత్రి 12,40 గంటల సమయంలో బోడు ప్పల్‌కు చెందిన విజయశాంతి రెడ్డి (38) ఆమె కుమార్తె చేతనా రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (16)లు గూడ్సు రైలు కిందపడి ఆత్మహత్య చే సుకోవడం మిస్టరీగా మారింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా వున్న విజయశాంతి రెడ్డికి ఆర్థిక సమస్యలు లేవు. భర్త ఉద్యోగరీత్యా దుబాయ్‌లో వుంటున్నాడు. బోడుప్పల్‌లో తన తల్లితో పాటు ఆమె వుంటున్నది. ఇద్దరు పిల్లలు హాస్టల్‌లో వుంటూ చదువుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఉద్యోగం ము గించుకుని బయటకు వచ్చిన విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలను కారులో ఎక్కించుకుని అర్ధరాత్రి వరకు పలుచోట్ల తిరిగింది. తమ బంధువు చనిపోయాడని హాస్టళ్ల నిర్వాహకులకు చెప్పి ఇద్దరు పిల్లలను తన వెంట కారులో ఎక్కించుకున్న విజయశాంతి పలుచోట్ల తిరిగాక అర్ధరాత్రి 12 గం టల సమయంలో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చింది, ఆ సమయంలో చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ఎలాంటి రైళ్ల రాకపోకలు లేవు. ఈ సమయంలో కా రును స్టేషన్ బయట ఆపిన విజయశాంతి రెడ్డి దాని తాళాలను కుమారుడు విశాల్ రెడ్డి జేబులో వుంచింది. దీని తరువాత ఇద్దరు పిల్లలతో స్టేషన్ లో అటు ఇటూ తిరిగినట్లు చెబుతున్నారు. ఆ సమయంలో స్టేషన్‌లోని పోలీసులు ఆమెను వాకబు చేసి వుంటే ఆత్మహత్యను నివారించే వుండేవా రేమోనని కుటుంబీకులు చెబుతున్నారు. అర్ధరాత్రి వేళ ఒక మహిళ ఇద్దరు పిల్లలతో రైళ్ల రాకపోకలు లేని సమయంలో స్టేషన్‌లో ఎందుకు తచ్చాడు తుందనే దానిపై ఆ సమయంలో భద్రతగా వుండే రైల్వే పోలీసులు ఎవరూ పట్టించుకోలేదు. ఆఖరుకు ఆమె తన ఇద్దరు పిల్లలను తీసుకుని చర్లపల్లి నుంచి ఘట్‌కేసర్ మార్గంలో పట్టాలపై వెళ్లిన సమయంలోనూ ఎవరు గమనించి అడ్డుకోలేదు. టీనేజిలో వున్న ఆమె ఇద్దరు పిల్లలు కూడా ఇదంతా ఎందుకు చేస్తున్నావమ్మా...? అని అడగలేదు. ఇద్దరు పిల్లలు తల్లిని గట్టిగా వాటేసుకుని పట్టాలపై నడుచుకుంటూ పోతున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన గూడ్సు రైలు వీరిని ఢీకొంది. గూడ్సు రైలు ఇంజన్ డ్రైవర్ దూరం నుంచే గమనించి అదేపనిగా హారన్ మోగించినా తల్లిబిడ్డలు ప ట్టించుకోలేదు. చివరకు రైలు ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనపై సికింద్రాబాద్ రైల్వే పోలీసులు విచారణ చేబట్టగా వి జయశాంతి రెడ్డి రాసిన సూసైట్ లెటర్ లభించింది. ఇందులో తమ చావుకు ఎవరు కారణం కాదని వుంది.

ఆఖరుకు ఆమె పనిచేసే సాఫ్ట్‌వేర్ కంపె నీలో సహచర ఉద్యోగులను విచారించినా ఎలాంటి సమాచారం లభ్యం కాలేదు. మొత్తానికి ఈ ఘటన ఒక మిస్టరీగా మారింది.

రైల్వే పోలీసులు ఏ మాత్రం గమనించి వున్నా, టీనేజి పిల్లలు తల్లిని కొంతమేర ప్రతిఘటించి వున్నా ఈ ఘోరం ఆగివుండేదేమో?

## హైదరాబాద్‌లో డ్రంకన్ డ్రైవ్ దాడులు.. 356 మంది మందు బాబుల అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** జంట నగరాలలో శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 356 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 302 మంది ద్విచక్ర వాహనదారులు, 21 మంది ఆటో డ్రైవర్లు, 33 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ 143 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 64 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 34 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 16 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, 16 మంది 251 నుంచ 300 పాయింట్ల వరకు ఏడుగు రు, 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించిన వారు ముగ్గురు వున్నట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కో ర్టులు వీరికి శిక్షలు వి ధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ ఆదివారం నాడు మీడియాకు తెలిపారు. జంట నగ రాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన తెలిపారు.

## 25 వరకు జెఇఇ మెయిన్ సెషన్-2 దరఖాస్తుల స్వీకరణ

**ఏప్రిల్ 2 నుంచి 9 వరకు పరీక్షలు**

**దరఖాస్తు షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్‌టిఎ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 01:** దేశంలోని ఐఐటి, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) మెయిన్-2026 సెషన్-2కి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. జెఈఈ మెయిన్ సెషన్-2 దరఖాస్తులను ఆదివారం నుంచే ప్రారంభించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ప్రకటించింది. దరఖాస్తులను ఈ నెల 25 రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. ఫీజు చెల్లించడానికి ఈ నెల 25 రాత్రి 11.50 గంటల వరకు అవకాశం కల్పించారు. సెషన్-2 పరీక్షలను ఏప్రిల్ 2 నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు తెలిపింది. సెషన్-1కి దరఖాస్తు చేసుకున్నవారు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవల్సిన అవసరం లేదని.. గతంలో దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ నంబర్‌తోనే దరఖాస్తు చేసుకోవాలని ఎన్‌టిఏ సూచించింది. కొత్తగా దరఖాస్తు చేసుకొనే వారు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జెఈఈ మెయిన్ మొదటి, రెండో సెషన్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అడ్వాన్స్‌డ్‌కి అర్హత సాధించనున్నారు. ఇప్పటికే జెఈఈ మెయిన్-2026 మొదటి సెషన్‌ను ఈ ఏడాది జనవరి 21 నుంచి 29 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే.

# ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించాలి

**ఉపాధ్యాయులకు నెలనెలా పదోన్నతులివ్వాలి**

**30 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల టిజి టి జెఎసి తీర్మానం**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 01:** తెలంగాణ రాష్ట్రంలోని 30 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు కలిసి తెలంగాణ -టీచర్ జాయింట్ యాక్షన్ కమిటీ(టిజి-టి జేఏసీ)ని ఏర్పాటు చేసుకున్నాయి. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలని, తద్వారా ఉపాధ్యాయులకు ప్రతి నెలా పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జేఏసీ తీర్మానం చేసింది. టిజి- టి జేఏసీ ఛైర్మన్‌గా ఎస్ చంద్రశేఖరరావు, సెక్రటరీ జనరల్‌గా శానమోని నరసింహులు ఎన్నుకున్నారు. జేఏసీ ఏర్పాటు అనంతరం జేఏసీ సెక్రటరీ జనరల్ నరసింహులు మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన టిజి- టి జేఏసీలో పలు తీర్మానాలు చేసినట్టు తెలిపారు. తెలంగాణ రెండవ పిఆర్‌సిని మంచి ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు డిఈవో, ఎంఈవో పోస్టులు మంజూరు చేసి.. పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని తీర్మానించినట్టు తెలిపారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, మోడల్ స్కూల్, గురుకులాల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని తీర్మానించారు. ఉపాధ్యాయులకు నగదు రహిత హెల్త్ కార్డ్సు రూపొందించి, అన్ని ఆసుపత్రులలో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందించాలని, యాక్ట్ 1/2005ను రద్దు చేసి, భాషా పండితులకు నోషనల్ సర్వీస్ అందించాలని,

గురుకులాల టైమ్ టేబుల్‌లో మార్పులు చేయాలని తీర్మానించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతులు, పండిట్, పిఈటి అప్‌గ్రేడేషన్ వంటి సమస్యలను పరిష్కరించినందుకు టిజి- టి జేఏసీ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తుందని జేఏసీ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖర్ రావు, సెక్రటరీ జనరల్ శానమోని నరసింహులు తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారమే ధ్యేయంగా.. 30 ఉపాధ్యాయ-అధ్యాపక సంఘాలతో తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమి టీ (టిజి-టి జేఏసీ) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాంపల్లిలోని టీఎస్జీఓ కేంద్ర కార్యాలయంలో, పీఆర్‌టీయూ-టిజి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది.

## గులాబి నేతలు ఎందుకు భయపడుతున్నారు

**భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** ఫోన్ ట్యాపింగ్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కెపిఆర్‌కు సిట్ నోటీసులు ఇస్తే తెలంగాణ ఆత్మ గౌరవం అంటూ ఎందుకు లబోదిబో మం టున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. గతంలో ముఖ్య మంత్రిగా ఉన్న కెసిఆర్‌కు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ కోసం ఇజ్రాయిల్ నుంచి పరికరాలు కొనుగోలు చేస్తారా? స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్‌లో సిసి కెమెరాలు బంద్ చేసి పరికరాలు, ఫైల్స్ ధ్వంసం చేసి మూసి నదిలో, వికారాబాద్ అడవుల్లో పడేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో పింకీలు చెప్పాలన్నారు. మీరు ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఎవరిని ఎదగకుండా చేద్దామనే కుట్ర చేశారు. ఫోన్ ట్యాపింగ్ ఆధారాలు చేరిపివేసి ఇప్పుడు తెలంగాణ ఆత్మ గౌరవం గుర్తుకు వస్తుందా? కెసిఆర్ హయాంలో తెలంగాణ పౌర హక్కులు హరించబడ్డాయని, ప్రతిపక్ష నాయకులు, అధికారులు, స్వంత బిడ్డ, అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారన్నారు. తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ ను తరిమికొట్టి ఆత్మ గౌరవాన్ని కాపాడారని, దళితులను ముఖ్యమంత్రి చేస్తానని కెసిఆర్ మోసం చేయలేదా అన్నారు. రాయలసీమ వెళ్లి రతనాల సీమను చేస్తాను అన్నప్పుడు తెలంగాణ ఆత్మ గౌరవం ఎటు పోయింది సిట్‌కు సకరించాలని, తప్పు చేస్తే శిక్ష అనుభవించాలన్నారు.

# నాలుగోసీజన్‌లోనూ ప్లేఆఫ్స్‌కు చేరిన ఢిల్లీకేపిటల్స్

## ఐదు వికెట్ల తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**వదోదర, ఫిబ్రవరి 1:** మహిళాప్రీమియర్‌లీగ్‌లలో మూడుసార్లు ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగో సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్ చేరింది. అంతకు ముందు మ్యాచ్‌లో 3 పరుగుల తేడాతో గుజరాత్ చేతిలో ఓడిన ఢిల్లీ గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. మొదట బౌలర్ల విజృంభణతో ప్రత్యర్థిని 122కే కట్టడి చేసి ఆపై లారా వొల్వార్ట్(47), జెమీమా రోడ్రిగ్స్(34 నాటౌట్) మెరుపులతో జయభేరి మోగించింది. 5 వికెట్ల తేడాతో గెలిచిన ఢిల్లీ ఎలిమినేటర్‌కు అర్హత సాధించింది. తప్పనిసరిగా నిలవాల్సిన పోరులో ఢిల్లీ సమిష్టి ప్రదర్శనతో సత్తా చాటింది. స్వల్ప ఛేదనలో ఢిల్లీ ఓపెనర్ లిజెల్లీ లీ(10) త్వరగానే వెనుదిరిగింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన లారా వొల్వార్ట్(47) దూకుడుగా ఆడింది. డేంజరస్ షఫాలీ వర్మ(29)ను శిఖా పాండే ఓవర్లో తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్(34 నాటౌట్), సోఫీ ఎకిల్‌స్టోన్ ఓవర్లో మరినేకాప్(0) సైతం చెత్త షాట్‌తో వికెట్ పారేసుకుంది. 28 బంతుల్లో 25 అవసర మయ్యాయి. హిట్టర్ చిన్నెలీ హెన్రీ కూడా కొంతమేర ఇబ్బంది పడింది. ఆమెను దీప్తి రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ పంపగా ఒత్తిడికి గురయింది. గత మ్యాచ్‌లో చివరిదాకా పోరాడిన నిక్కీ ప్రసాద్4పరుగులేచేసినా నాటౌట్ గా నిలిచి జెమీమాకు అండగా జట్టును విజయ తీరాలకు చేర్చింది . దీప్తి వేసిన 19వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు ధించి 5 వికెట్లతో గెలిచిన ఢిల్లీ 8 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో యూపీ గెలిస్తే ముందంజ వేయాలనుకున్న ముంబై ఇండియన్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. టాస్ ఓడిన యూపీ వారియర్స్‌కు బ్యాటర్ల వైఫల్యంతో స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. మరినే కాప్(3-30), శ్రీ చరణి(2-22), చిన్నెలె హెన్రీ (2-25)లు



దెబ్బతీయడంతో యూపీ ఇన్నింగ్స్ ఆద్యంతం తడబడుతూనే సాగింది. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ల దీప్తి శర్మ(24), సిమ్రాన్ శక్తి(22)లు రాణించారు. ఆఖర్లో శిఖా పాండే(23 నాటౌట్) మెరుపులతో యూపీ స్కోర్ 120 దాటింది. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 122 రన్స్ చేసిందంతే.

## నిర్మలమ్మ ఆర్థిక ప్రణాళికా ఆంధ్రాకు మేలు - కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ ఫిబ్రవరి 01 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ దేశాభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, రైతులు, యువత మీద ప్రత్యేక దృష్టి పెట్టారని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ప్రశంసలు కురిపిస్తూ ప్రకటన విడుదల చేశారు. విదేశీ యాత్రలపై పన్ను తగ్గింపు. పౌర విమానయాన రంగానికి మరింత ఊతమిస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి వికసిత్ భారత్ లక్ష్యాలను మరింత వేగంగా చేరుకునేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. పౌర విమానాల విడిభాగాలపై పన్ను తగ్గించడంతో పాటు, శ్రీకాకుళం జిల్లాలో ప్రధాన పంటగా ఉన్న కొబ్బరి కోలుకునేలా తోడ్పాటు అందివ్వడం శుభపరిణామం అన్నారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ స్థిరమైన ఆర్థిక విధానంతో పాటు పెట్టుబడులు, సంస్కరణలపై బలమైన దృష్టి పెట్టడం ద్వారా, భారతదేశానికి మరింత ప్రగతిని, సుస్థిర అభివృద్ధిని తీసుకురాగలిగిందని రామ్మోహన్ నాయుడు అన్నారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం సామాన్యులను మరింత ఆకట్టుకుందని తెలిపారు. ఏడు నగరాల మధ్య హై స్పీడ్ కారిడార్లు, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ, డేటా సెంటర్ల ఏర్పాటుకు తోడ్పాటు అందివ్వడం ఇలా ప్రతీ అంశం ప్రగతిని సూచిస్తోందని అన్నారు. ప్రస్తుత ప్రపంచ అస్థిరతల నడుమ కూడా ప్రభుత్వం బలమైన, స్థిరమైన ఆర్థిక విధానాన్ని పాటిస్తోందని, 2026-27కి కేంద్ర పెట్టుబడులను గతంలో కంటే అధికంగా రూ.12.2 లక్షల కోట్లకు పెంచడం ద్వారా ప్రభుత్వం తన విజన్‌ను స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బడ్జెట్: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** :భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 ప్రకారం.. ఇండియా అంటే రాష్ట్రాల సమూహం అని, రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన లేనిదే దేశాభివృద్ధి సాధ్యపడదని రాజ్యాంగం చెబితే, కేంద్రం మాత్రం ఈ బడ్జెట్ లో ఆ మూలసూత్రాన్నే విస్మరించింది అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. దేశ జీడీపీలో 5 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్న తెలంగాణ గురించి బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం గర్హనీయమని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రం తరచూ వల్లించే సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అనే నినాదం తెలంగాణ విషయంలో కేవలం నీటి మూటలేనని మరోసారి ఈ బడ్జెట్ లో స్పష్టం అయ్యిందన్నారు. ఓ వైపు అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉంటుందని చెబుతూనే, మరోవైపు నిధుల కేటాయింపుల్లో తెలంగాణ పట్ల రాజకీయ వివక్ష చూపడం రాజ్యాంగ నైతికత నిదర్శనం అన్నారు. బడ్జెట్ అనేది ఆర్థిక హేతుబద్ధత ఆధారంగా రూపొందించాలి. కానీ కేంద్రం రాజకీయ అనుకూలతకు ప్రాధాన్యతనిచ్చి తాజా బడ్జెట్లో తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది అని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో తెలంగాణకు రూ. 22,782 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 10 నెలలు గడుస్తున్నా అందింది కేవలం సుమారు రూ. 4,000 కోట్లు మాత్రమే. అంటే రావాల్సిన దాంట్లో 20 శాతం కూడా అందలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ అనేది సమ న్యాయంగా జరగాలి. కానీ, సహకార సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షాపూరిత సమాఖ్య ధోరణిని ప్రదర్శిస్తుందని తాజా బడ్జెట్ మరోసారి రుజువు చేసింది అని అన్నారు. రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మెట్రో ఫేజ్ 2, గోదావరి, మూసీ అనుసంధానం, బందరు పోర్టుహైదరాబాద్ డ్రైపోర్టు మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే, నాలుగు కొత్త విమానాశ్రయాలు, రైలు కనెక్టివిటీ మెరుగుదల, విభజన చట్టంలోని పెండింగ్ హామీల అమలుకు నిధులు కేటాయించాలని మేము పలుమార్లు కోరినా పట్టించుకోకపోవడం ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలభిస్తోన్న వివక్ష పూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనం అని ఆందోళన వ్యక్తం చేశారు. హై స్పీడ్ రైల్ కారిడార్స్‌తో తెలంగాణకు మమ అనిపించిన కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత వైఖరిపై తెలంగాణ నుంచి బిజెపి తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న 8 మంది ఎంపీలు ఈ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. ఇకనైనా కేంద్రం తన ధోరణిని వీడి, రాజ్యాంగబద్ధమైన సమానత్వం పాటించాలని కోరారు.

## వీటికి బదులుగా..



మధుమేహం ఉన్నవారితో పాటు, అధిక బరువు తగ్గడానికి కొంతమంది చక్కెరకు బదులుగా కృత్రిమ తీపి పదార్థాలను ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ కృత్రిమ తీపి పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ఆహార పదార్థాల్లాగే కృత్రిమ తీపి పదార్థాలు కూడా అందరికీ పడకపోవచ్చు. కొంతమందిలో వీటిని తీసుకోవడం ద్వారా కడుపుబ్బరం, జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి చాలా వరకు వీటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు. క్యాలరీల విషయంలో.. కృత్రిమ తీపి పదార్థాలలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కొన్ని పదార్థాల్లో అయితే అసలు క్యాలరీలే ఉండవు. అందుకే కొంతమంది తమ ఫిటెనెస్ కాపాడుకోవడానికి, బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు కూడా కృత్రిమ తీపి పదార్థాలను తమ ఆహారంలో భాగం చేసుకుంటారు. అయితే ఆరోగ్యకరమైన బరువు ఉండాలంటే శరీరానికి అవసరమైన నిర్ణీత క్యాలరీల విషయంలో రాజీ పడకూడదని నిపుణులు భావిస్తున్నారు. సహజసిద్ధమైనవే..! కృత్రిమ తీపి పదార్థాలు సహజసిద్ధంగా లభించే పదార్థాలను ఎప్పటికీ భర్తీ చేయలేవు. కాబట్టి క్యాలరీలు తగ్గించుకునేవారు.. సహజంగా లభించే ప్రత్యామ్నాయ పదార్థాలను ఉపయోగించడమే మంచిదంటున్నారు నిపుణులు. నిపుణులను సంప్రదించాలి.. అలాగే ప్రత్యేకించి మధుమేహ కృత్రిమ తీపి పదార్థాలను వాడే విషయంలో సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

## అతితో అనర్థాలెన్నో..

అతితో 'అతి' అనేక నర్థాలు తెచ్చిపెడుతుంది. పిల్లల పెంపకం విషయంలోనూ ఈ సూత్రం వర్తిస్తుంది. బిడ్డలను అతిగారాబం చేయడం, మరీ జాగ్రత్తగా చూసుకోవడం కూడా మంచిదికాదని మానసిక నిపుణులు చెబుతున్నారు. కష్టం తెలియకుండా పెరిగే పిల్లల్లో మానసిక ఎదుగుదల లోపిస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ఈగిల్ పేరెంటింగ్‌కి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. పిల్లల్ని సుకుమారంగా రంగా పెంచడమే ఈగిల్ పేరెంటింగ్. ఏది అడిగినా కొనివ్వడం, తప్పు చేసినా వెనకేసుకు రావడం.. ఈ పెంపకంలోని లక్షణాలు. ఈ రకమైన తల్లిదండ్రుల సంరక్షణలో బాల్యం అద్భుతంగా సాగుతుంది.



కానీ, చిన్నారుల భవిష్యత్ మాత్రం అగమ్యగోచరంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్‌లో ఏవైనా సమస్యలు ఎదురైనా.. వారంతట వారు పరిష్కరించుకోలేరట. అన్నిటికీ ఇతరులపైనే ఆధారపడుతుంటారు. తాము తప్పుడు దారిలో వెళ్తున్నట్లు కూడా గుర్తించ లేరని నిపుణులు చెబుతున్నారు. అలాకాకుండా.. పిల్లలకు బాల్యం నుంచే అన్ని పనులూ నేర్పించాలని సూచిస్తున్నారు. కష్టమైన పనులైనా.. పూర్తి చేసేలా ప్రోత్స హించాలి. అర్థంకాని విషయాలను విడమర్చి చెప్పాలి. పిల్లలు అడిగిన ప్రతిదాన్నీ అందివ్వడం ఉత్తమ పేరెంటింగ్ లక్షణం మాత్రం కాదని నిపుణులు అంటున్నారు. పిల్లలకు ఊరికే డబ్బులు ఇవ్వకూడదని చెబుతున్నారు. ఎందుకంటే.. ఉచితంగా వచ్చే డబ్బు సోమరి తనాన్ని పెంచు తుందట. కాబట్టి, వారికి ఏదో ఒక పని అప్పగించి.. పూర్తి చేసిన తర్వాతే డబ్బులు ఇవ్వాలని చెబుతున్నారు. ఈ అలవాటు.. డబ్బులు సులభంగా రావనే విషయాన్ని నేర్పుతుంది. ఇక మరికొందరు పిల్లలు చాలా పెంకిగా ఉంటారు. ఇలాంటివారి విషయంలో కాస్త కటువుగా వ్యవహరించా ల్సిందే! అదే సమయంలో పెద్దరికం పేరుతో ప్రతి విషయానికీ వారిని బాధించడం కూడా మంచి పద్ధతికాదు. పిల్లలకు నచ్చచెప్పడం, వారికి నచ్చేలా చెప్పడం, నచ్చేవరకు చెప్పడం పెద్దలు అలవాటు చేసుకోవాలి.

## నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడుతూ..



చెన్నైలో ఎటు చూసినా పచ్చని అందాలే. కారణం... పట్టణంలో పొద్దు తిరుగుడు పూలను పెంచుతూ 'సన్ఫ్లవర్ సిటీ'గా మారుస్తున్నారు ఓ యువతి. నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడుతున్నారు. తనే

షెఫాలీ దాదాబాయ్,

మనం ప్రయాణం చేస్తున్నప్పుడు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయామనుకోండి. చుట్టూ వాహనాలు. ఇంజిన్ల మోతతో అవి విడుదల చేస్తే పొగ దీనికి మండిపోతున్న ఎండ. అంత వేడిలో ఒక్కసారిగా బంగారు రంగులో మెరుస్తూ పొద్దుతిరుగుడు పువ్వులు కనిపిస్తే వాటి నుంచి వీచే చల్లటి గాలి ముఖానికి తగిలితే ఎంత హాయిగా ఉంటుందో కదా ఆ గాలికి అప్పటిదాకా పడిన ఒత్తిడి మొత్తం పోయి మనసు తేలిక పడుతుంది. చెన్నైలో సరిగ్గా ఇలాంటి వాతావరణం ఉండాలనుకుంటు న్నారు షెఫాలీ, అందుకే సిటీ మొత్తం సన్ఫ్లవర్స్ నిండిపోవాలని కోరుకుంటున్నారు. ఇందుకు ఆమె బ్యాంకు ఉద్యోగాన్ని వదిలి గార్డెనర్ గా మారారు. అంతేకాదు, దీనికోసం ప్రత్యేకంగా ఖిసన్ఫ్లవర్ సిటీఖి పేరుతో ఓ ఉద్యమాన్ని మొదలు పెట్టి. నగరంలో విత్తనాలనూ, మొక్కల్నీ ఉచితంగా అందిస్తూ ఇళ్లు, పెట్రోల్ బంకులూ, పాఠశాలల్లో పువ్వులు పెంచేలా కృషి చేస్తున్నారు. అమెరికా నుంచి తిరిగొచ్చిన షెఫాలీ తన రూఫ్ గార్డెన్‌లో సన్ ఫ్లవర్ విత్తనాలను వేశారట. మొక్కలు పెరిగి పూసినప్పుడు నాకెంతో ఆనందంగా అనిపించింది. ఆ సంతోషం నాకు మాత్రమే పరిమితం కాకూడదనుకున్నా నగరం మొత్తం ఆ అనుభూతి పొందాలనుకున్నా అందుకే 'సన్ఫ్లవర్ సిటీ' దాని మొదలు పెట్టా. ఇప్పటి వరకు పదివేలకు పైగా సన్ఫ్లవర్ మొక్కలను పంచాను. 150కి పైగా ఇళ్లు, పాఠశాలలు, ప్రైవేట్ కార్యాలయాలు, పెట్రోల్ బంకుల్లో వీటిని పెంచుతున్నారు. మొక్కలు, గింజల వివరాలతోపాటూ మందులు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వీడియోల రూపంలో ఇన్‌స్టాలో పోస్టు చేస్తుంటా అని చెబుతారు షెఫాలీ.

**సన్ఫ్లవర్ సిటీగా మెరిసిపోతూ....** ఏప్రిల్, ఆగస్టు నెలల్లో పూసే ఈ పూలతో చెన్నై పూర్తిగా బంగారు వర్ణంలో మెరిసిపోతూ కనిపిస్తుంది. తేనెటీగలు, సీతాకోకచిలుకలు వీటిచుట్టూ చేరతాయి. దాంతో బయోడైవర్సిటీ పెరుగుతుంది. అంతేకాదు, ఈ పొద్దుతిరుగుడు మొక్కలకు మట్టిలో టాక్సిన్‌లను పీల్చే గుణం ఎక్కువ. పైగా తక్కువ నీటితో ఇవి పెరుగుతాయి. అందుకే కొన్ని స్కూళ్లు వీటిని సైన్స్ ప్రాజెక్టుల కోసం పెంచుతున్నాయి. నగరంలో ప్రధాన కూడళ్లు, పెట్రోల్ బంకుల్లో ఈ పూలు కనువిందు చేస్తున్నాయి. దాంతో ఈ మొక్కల దగ్గర ఆగి మరీ సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఆమె ప్రయత్నాన్ని అభినందించాల్సిందే కదూ!

## సమ్మక్క-సారలమ్మ

జగిత్యాల ప్రాంతంలోని పొలవాస క్షేత్రానికి నాయకుడు గిరిజన తెగకు చెందిన మేడరాజుకు అడవిలో ఒక శిశువు దొరికింది. సంతానం లేని అతడు అమ్మవారి ప్రసాదంగా భావించి సమ్మక్క అని పేరు పెట్టి పెంచుకున్నాడు. ఆమెకు పగిడిద్దరాజుతో వివాహం జరిగింది. వీరి సంతానం సారలమ్మ, నాగులమ్మ, జంపన్నలు. ప్రతాపరుద్రుడు రాజ్య కాంక్షతో పొలవాస మీద దండెత్తగా.. ఆ సైన్యం ధాటికి తాళలేని గిరిజనులు మేడారానికి తరలివెళ్లారు. మామ అయిన మేడరాజుకు, పగిడిద్దరాజు ఆశ్రయం ఇచ్చాడు. అది రాజధిక్కారంగా భావించి ప్రతాపరుద్రుడు మేడారం పై మెరుపుదాడి చేశాడు. పగిడిద్దరాజు, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవిందరాజు యుద్ధంలో మరణించారు. వారి మరణాన్ని, సైనికుల పరాజయాన్ని తట్టుకోలేక జంపన్న సంపెంగ వాగులో దూకి ఆత్మార్పణ చేసుకున్నాడు. నాటి నుంచి అది ఖిజంపన్నవాగుఖిగా ప్రసిద్ధమైంది. ఇంత జరిగినా.. సమ్మక్క, సారలమ్మలు కదనరంగం వదిలివెళ్లక ధైర్యంగా పోరాడసాగారు. వారిని నేరుగా ఎదుర్కోవడం అసాధ్యమనుకున్న శత్రువులు వెనుక నుంచి దాడిచేశారు. దాంతో సారలమ్మ వీరమరణం పొందింది. కత్తిపోట్లతో నెత్తురోడుతూ సమ్మక్క చిలకలగుట్టకు వెళ్లి.. అక్కడ అదృశ్యమైంది. అక్కడి నాగమల్లి చెట్టు కింద కుంకుమభరిణెలో తన జీవశక్తిని నిక్షి ప్తం చేసి వెదురుకర్రగా ఆవిర్భవించింది. ఇదీ విధానం... తొలిరోజు సాయంత్రం సారలమ్మను కన్నెపల్లి గ్రామం నుంచి గద్దెమీదికి తీసుకొస్తారు. మళ్లీ జాతర వరకు ఆమె కన్నెపల్లిలో ఉండే దేవాలయంలో ఉంటుంది. అదే రోజు పగిడిద్దరాజును పూనుగొండ్ల (గుట్టపై చింతచెట్టు కింద గుడి) నుంచి గద్దె వద్దకు తీసుకొస్తారు. రెండోరోజు సాయంత్ర ప్రభుత్వ లాంఛనాలతో గద్దె వద్దకు తెచ్చి ప్రతిష్ఠ చేసానతరు. మూడోరోజు సాయంత్రం వరకు జాతర సాగుతుంది. జాతరలో భక్తులు బెల్లాన్ని బంగారంగా పలుస్తూ అమ్మవార్లకు నివేదిస్తారు. సమ్మక్క సారలమ్మ గద్దెల నుంచి చిటికెడైనా బెల్లాన్ని ప్రసాదంగా తెచ్చుకుంటారు.



## స్వీట్‌కార్న్ పకోడి



**కావలసిన పదార్థాలు** పచ్చిమిర్చి: రెండు, ఉల్లిగడ్డ: ఒకటి, కారం: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, కొత్తిమీర తరుగు: కొద్దిగా, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం:** స్వీట్‌కార్న్ ఉడికించి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో స్వీట్‌కార్న్, శనగపిండి, చిన్నగా తరిగిన పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, కారం, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి కొద్దిగా నీళ్లుపోసి ముద్దలా కలపాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి, వేయించ డానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా వేయాలి. సన్నని మంటపై దోరగా వేయించుకుంటే కరకరలాడే స్వీట్‌కార్న్ పకోడి సిద్ధం.

## వంటింటి వ్యర్థాలతో పోషకాలు



మొక్కలు పెంచడం అందరికీ సరదానే. కొన్నాళ్లు బాగానే పూసిన తర్వాత ఆ మట్టిలో సారం తగ్గి నిర్జీవంగా మారిపోతుంటాయి. ఇలాంటప్పుడు దాన్ని సులువుగా ఎలా సారవంతం చేసుకోవాలో తెలుసా? 1.ఒక ఖాళీ కుండీని తీసుకోండి. అడుగున ఒక లేయర్ చిన్న చిన్న రాళ్ళు వేయండి. ఆపై రెండు వరుసల్లో మట్టిని వేసి ఉంచండి. కొనుగోలు కూరగాయల వ్యర్థాలు, పండ్ల తొక్కలు ఉంచి పైన మరోసారి మట్టి వేయండి. ఇలా ఒకదాని తర్వాత మరొకటి వేస్తూ కాసిని నీళ్లు చల్లుతూ ఉండండి. నెలరోజుల లోపే ఆ మట్టి సారవంతంగా మారుతుంది. 2.మొక్క చుట్టూ ఉండే మట్టి తరచుగా బిగుసుకుపోతుంది. అలాకాకుండా ఉండాలంటే ఎండిన ఆకుల్ని పొడి చేసి మట్టిలో కలిపేయండి. ఇది మట్టిని గట్టిపడనివ్వదు. 3. ఆరోగ్యానికి మంచిదని గుడ్డు తింటాం కదా! వ్యర్థం అని పెంకుల్ని పారేయకండి. వాటిని ఎండబెట్టి పొడి చేయండి. ఓ టేబుల్ స్పూన్ పొడి తీసుకుని అరచెక్క నిమ్మరసం కలిపి కరగనివ్వండి. తర్వాత ఓ దీన్ని నీళ్లల్లో కలిపి మొక్కలపై స్ప్రే చేస్తే సరి. కాల్షియం అంది ఆరోగ్యంగా ఉంటాయి. 4. వాడేసిన టీ పొడి, కాఫీ గింజలను పారేయకండి. వీటిని నేరుగా మట్టిలో కలిపినా, నీళ్లల్లో కలిపి చల్లినా మంచిదే. వీటిల్లోని నత్రజని ఆకులను నిగనిగలాడేలా చేసి మొక్కనూ ఆరోగ్యంగా ఉంచుతుంది. 5. బియ్యం, పప్పులు కడిగిన నీళ్లను పారబోయకండి. మొక్కలకు పోస్తే ఇవి మట్టిలో సూక్ష్మపోషకాలను పెంచుతాయి. అంతేకాదు. ప్రతి ఆరునెలలకోసారి కాస్తంత అయినా కొత్త మట్టిని కలపడం మంచిది.

# తెర

## కమల్ హాసన్ షార్ట్ డాక్యుమెంటరీ 'లీడ్ ఆన్ గాంధీ' రిలీజ్



జనవరి 30, 2026 అమరవీరుల దినోత్సవం నాడు, కమల్ హాసన్, గోపాల కృష్ణ గాంధీ సందేశాలతో రూపొందిన "లీడ్ ఆన్ గాంధీ" అనే పవర్ ఫుల్ డాక్యుమెంటరీ విడుదలైంది. భారతదేశ నైతికత, ప్రజాస్వామ్య విలువల నుంచి పుట్టిన గొంతులు ఇందులో ఇంటెన్స్‌గా వినిపిస్తాయి. ఈ డాక్యుమెంటరీ మోహన్‌దాస్ కరంచంద్ గాంధీని హతమార్చిన బుల్లెట్ ప్రయాణాన్ని ఇటలీ గనుల నుంచి, న్యూఢిల్లీ బిర్లా హౌస్ వరకు చూపించిన తీరు ఆలోచన రేకెత్తించేలా వుంది. ఒకే ఒక బుల్లెట్ కథ ద్వారా, హింస ఎలా దేశాలు, సరిహద్దులు దాటుతుందో, శాంతి ఆలోచనలు మాత్రం ఎంత కష్టంగా ప్రయాణిస్తాయో ఈ ఫిల్మ్ స్పష్టంగా చూపిస్తుంది. ఇది కేవలం చరిత్రాత్మక డాక్యుమెంటరీ కాదు, 1948 జనవరి 30న మనం ఏమి కోల్పోయామో ఆలోచింపజేసే ఫిల్మ్. గాంధీ చూపిన నైతిక ధైర్యాన్ని సమాజం మరిచితే పరిణామాలు ఏంటి? అనే అవసరమైన ప్రశ్నలని ఈ ఫిల్మ్ సంధిస్తోంది. కమల్‌హాసన్ దృష్టికోణం ద్వారా, ఈ చిత్రం గాంధీజీ హత్యను నేటి కాలంతో అనుసంధానిస్తూ, కోపంప్రతీకారాలకన్నా ప్రేమ, సత్యం, ఆత్మనియంత్రణకు ఎక్కువ ధైర్యం అవసరమని గుర్తు చేస్తుంది. అమరవీరుల దినోత్సవం నాడు విడుదలైన "లీడ్ ఆన్ గాంధీ" జాతిపితకు నివాళిగా మాత్రమే కాకుండా ప్రజాజీవితంలో సానుభూతి, సంభాషణ, అహింస విలువలను తిరిగి గుర్తు చేసుకునేలా చేసే ఒక బలమైన పిలుపు. గాంధీజీ అనే మనిషిని బుల్లెట్ చంపింది, కానీ ఆయన ఆలోచనలు ఎప్పటికీ నిలిచిపోతాయని ఈ డాక్యుమెంటరీ గుర్తు చేస్తుంది.

## మహిళలే మా కుటుంబ బలం

### రామ్ చరణ్



రామ్ చరణ్, ఉపాసన అపోలో ఆసుపత్రిలో కవలలు ఒక పాప, ఒక బాబుకు జన్మ నివ్వడంతో మెగా కుటుంబంలో ఆనందం రెట్టింపు అయ్యింది. కొణిదెల, కామినేని కుటుంబాల్లో సంబరాలు మొదలయ్యాయి. రామ్ చరణ్ ఈ ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటూ, మాకు ఒక బాబు, ఒక పాప జన్మించారని తెలియజేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలగడం అపారమైన కృతజ్ఞతతో నింపింది. మా జీవితాల్లో మహిళలే మా గొప్ప బలం. ప్రతి క్షణం మా వెంట నిలిచిన అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. డెలివరీకి ముందు తీసుకున్న ఫ్యామిలీ ఫోటో ఇప్పుడు మరింత ప్రత్యేకంగా మారింది. ఆల్‌బ్లాక్ అవుట్‌ఫిట్స్‌లో చరణ్, ఉపాసన ప్రశాంతంగా ఆనందాన్ని వెదజల్లుతూ కనిపించారు. ఫ్లోయింగ్ గౌన్‌లో ఉపాసన మెరవగా, చరణ్ స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకున్నారు .

## 'ఫంకీ' సినిమా రెండవ గీతం రట్టాటటావ్ విడుదల



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని న్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయిక. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న థియేటర్లలో అడుగు పెట్టనున్న 'ఫంకీ' చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు, మొదటి గీతం 'ధీరే ధీరే'కు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా 'రట్టాటటావ్' విడుదలైంది. హైదరాబాద్ లోని ఆర్కే సినీప్లెక్స్‌లో ఈ గీతావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా, రెండో గీతం 'రట్టాటటావ్' కూడా అదే జోరును కొనసాగించడంతో 'ఫంకీ' చిత్రం సంగీత ప్రియులకు మరిచిపోలేని విందును అందించనుందని స్పష్టమైంది. గీతావిష్కరణ కార్యక్రమంలో కథానాయకుడు విశ్వక్‌సేన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మమ్మల్ని సపోర్ట్ చేయడానికి వచ్చిన మీడియా మిత్రులకు కృతజ్ఞతలు కథానాయిక కయాదు లోహర్ మాట్లాడుతూ, రట్టాటటావ్ పాటకు మీ నుంచి వస్తున్న స్పందన సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. దర్శకుడు అనుదీప్ కె.వి. మాట్లాడుతూ, ఈ పాట మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. సినిమా కూడా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇదొక ఫ్యామిలీ ఎంటర్టైనర్. మీ కుటుంబంతో కలిసి ఫంకీ సినిమాని సంతోషంగా చూడొచ్చని అన్నారు.

## 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సాంగ్ లాంచ్

వింటేజ్ బ్లాక్ బస్టర్ కపుల్ హీరో శివాజీ, హీరోయిన్ లయ జంటగా నటిస్తున్న చిత్రం 'సాంప్రదాయిని సుప్పినిసుద్దపూసని'. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ రచన దర్శకత్వం వహించారు. 90ఖ్బి వెబ్ సిరీస్‌లో శివాజీతో కలిసి నటించిన బాల నటుడు రోహన్‌తో పాటు అలీ, ధనరాజ్, రఘుబాబు, 30ఇయర్స్ పృథ్వీ ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఫిబ్రవరి12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ డేట్ సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో హీరోశివాజీ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఈ సినిమా కథ విన్న వెంటనే నచ్చింది. ఈటీవీ విన్ వాళ్ళకి పంపించాను. ఈ ప్రాజెక్టు నాకు అప్పచెప్పారు. ఈటీవీతో నాకు ఎంతో మంచి అనుబంధంగా ఉంది. నేను మళ్ళీ ఈ రోజు మీ ముందు కనిపించడానికి కారణం బాపినీడి. హీరోయిన్ లయ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. 'మిస్సమ్మ', 'అదిరిందయ్యా చంద్రం' 'టాటా బిర్లా 'మధ్యలో 'లైలా' ఇలా ఎన్నో డిఫరెంట్ సినిమాలు చేశాం. మిస్సమ్మ అందరూ చాలా బాగా కనెక్ట్ అయ్యారు రత్నమాలని గుర్తు పెట్టుకున్నారు. ఇక నుంచి ఉత్తరని గుర్తు పెట్టుకుంటారు.



ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఇది చాలా మంచి క్రైమ్ కామెడీ. చాలా రోజుల తర్వాత ఈ జానర్ లో సినిమా వస్తోంది. డైరెక్టర్ సుధీర్ శ్రీరామ్ మాట్లాడుతూ, శివాజీకి ధన్యవాదాలు. ఆయన ఫస్ట్ హీరో, ప్రొడ్యూసర్. ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటాను .

## 'హైకూ' షూటింగ్ స్టార్ట్..

ప్రపంచ స్థాయిఓటీటీదిగ్గజాల్లో ఒకటైన నెట్‌ఫ్లిక్స్.. డిఫరెంట కంటెంట్ సినిమాలు, సిరీస్‌లు రూపొందిస్తూ..

మరోవైపు భారీ కథలు, బడ్జెట ఉన్నస్టార్ హీరోల సినిమాలహక్కులను కూడాసొంతం చేసు కుంటున్నసంగతి తెలిసిందే. తాజాగా ఈ లిస్టులో ఏగన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హైకూ సినిమా కూడాచేరినట్లు నిర్మాతలు సగర్వంగా వెల్లడించారు.

ఈ సినిమా షూటింగ్ పూర్తికాక ముందే డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోవడం విశేషం. సాధారణంగాథియేట్రికల్‌రన్ చూసిన తర్వాతే ఓటీటీ సంస్థలు డిజిటల్ హక్కుల కోసం ప్రయత్నిస్తాయి.

కానీ'హైకూ'సినిమా విడుదలకు ముందే డిజిటల్ డీల్ క్లియర్ కావడం పెద్ద విషయం. ఈరోజు ఉదయం (ఫిబ్రవరి1) షూటింగ్ లాంఛనంగా ప్రారంభమైంది.

తమిళ చిత్రం 'హైకూ' షూటింగ్ కేరళలోని ఇడుక్కి ప్రాంతంలో పూజా కార్య క్రమాలతో ఈరోజు ఉదయం ప్రారంభమైంది.

పేరన్బు, తరమణి వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు రామ్ ముహూర్తపు సన్నివేశంపై క్లాప్ కొట్టి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈసినిమాకు యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్నారు.



విజన్‌సినిమాహౌస్‌బ్యానర్‌పై డా.డి .అరుళనందు, మాథ్యూ అరుళనందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఈ సినిమాకు ప్రియేష్ గురుస్వామిడైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా పనిచేస్తుండగా..

శక్తి ప్రణేశ్‌ఎడిటర్‌గా, బేబీ, కోర్ట్ వంటి నావర్ విాట్ చిత్రాలకు మ్యూజిక్ అందించిన విజయ్‌బుల్గానిన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా వర్క్ చేస్తున్నాను.

## ఎస్ఎస్ఆర్ 61 అనౌన్స్‌మెంట్

రిజినాలిటీకి, వినూత్న ప్రయోగాలకు చిరునామాగా నిలిచిన లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌తో ముందుకు వస్తున్నారు. నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడికి క్రియేటివ్ సహకారం అందించిన తర్వాత, ఇప్పుడు సింగీతం స్వయంగా దర్శకత్వ బాధ్యతలు తీసుకుంటూ ఎ ఎస్ఎస్ఆర్ 61ని తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఇవాళపూజాకార్యక్రమంతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో సింగీతం క్రియేటివిటీ, ఆయన సినిమాలపై ఉన్న ప్రేమ, తరతరాల లదర్శకులపై ఆయన ప్రభావాన్ని గుర్తు చేసే క్లిప్స్ ఆకట్టుకున్నాయి. పుష్పక విమానం, ఆదిత్య 369 లాంటి క్లాసిక్స్‌ను మరోసారి గుర్తు చేశాయి. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్‌పై నాగ్ అశ్విన్ నిర్మిస్తున్నారు. అనుభవం, ఆధునిక ఆలోచనలు కలిసి వస్తున్న ఈ కాంబినేషన్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించడం సినిమాకు మరింత ఎనర్జీని తీసుకురానుంది. వైజయంతి మూవీస్ ఈ చిత్రాన్ని సింగీతం కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ గా అభివర్ణించింది. త్వరలోనే టైటిల్‌తో పాటు మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. ఈ ప్రాజెక్ట్ భారతీయ సినిమాలో ఒక మైలురాయిగా నిలవనుంది.



### మహిళల ఛాంపియన్‌షిప్‌లో
# భారత్ విజయం



**న్యూఢిల్లీ:** ఆతిథ్య నేపాల్‌పై 1-0 తేడాతో విజయంతో భారత్ తమ శాప్ అండర్ 19 మహిళల ఛాంపియన్‌షిప్ 2026 ప్రచారాన్ని ప్రారంభించింది. రెండవ అర్ధభాగంలో ఆట పునఃప్రారంభమైన వెంటనే పెర్ల్ ఫెర్నాండెజ్ (49వ నిముషం) ఆటలో ఏకైక గోల్ చేసింది. భారత్ ప్రారంభంలోనే ఆధిక్యాన్ని పొందాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించినా బంతిని తన నియంత్రణలోకి తీసుకురావడంలో విఫలమైంది. 10వ నిమిషంలో నేపాల్‌కు సొంతంగా ఒక అవకాశం లభించినా భారత గోల్ కీపర్ మున్నీ అడ్డుకుంది. మొదటి అర్ధభాగంలో ఎక్కువ భాగం రెండు జట్లు మిడ్‌ఫీల్డ్ లో పోరాటం చేసినా గోల్ చేసే అవకాశం లభించలేదు. రెండవ అర్ధభాగం ఇరు జట్లు హోరాహోరీగా పోరాడినా, భారత్ దాడిలో ముందుకు దూసుకెళ్లి కేవలం నాలుగు నిమిషాల్లోనే ఆధిక్యాన్ని సంపాదించింది. సబ్‌స్టిట్యూట్ ప్రీతికా నేపాల్‌కు చెందిన మాయా మాస్కేను దాటేసి, బాక్స్‌లోకి దూసుకెళ్లి, కట్‌బ్యాక్ ఇచ్చింది. నేపాల్ గోల్ కీపర్ భారత బ్యాక్‌లైన్‌ను దాటడానికి చేసిన ప్రయత్నాలను యంగ్ టైగ్రెస్‌లు పదే పదే అడ్డుకుంది. ఆతిథ్య జట్టుకు గోల్డెన్ ఛాన్స్ వచ్చినా కెప్టెన్ సుశీల కెసి భారత పెనాల్టీ ప్రాంతంలోకి రాకుండా అడ్డుకుంది. చివరి దశలో భారత్ తిరిగి వేగం పుంజుకుంది, నేపాల్ సమం చేయడానికి అవకాశాలను సృష్టించకుండా నిరోధించింది. 89వ నిమిషంలో ఎలిజబెడ్ చేసిన సుదీర్ఘ క్లియరెన్స్ తర్వాత ప్రీతికా ఛేజ్ చేసి విజయం వైపు దూసుకెళ్లింది.

### థాయిలాండ్ మాస్టర్స్‌లో
# ఛాంపియన్‌గా దేవిక



**న్యూఢిల్లీ:** థాయిలాండ్ మాస్టర్స్ 2026, మహిళల సింగిల్స్‌లో దేవిక సిహాగ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం బ్యాంకాక్‌లోని నిమిబుటర్ స్టేడియంలో జరిగిన 2026 థాయిలాండ్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో దేవిక సిహాగ్ తన జోరును కొనసాగించింది, మహిళల టైటిల్‌ను కైవసం చేసుకునే వరకు తీసుకెళ్లింది. మలేషియాకు చెందిన గో జిన్ వీ 8-21, 3-6 స్కోరు చేసిన తదుపరి గాయం కారణంగా రెండవ గేమ్‌కు దూరం కావడంతో ఫైనల్‌లో చాలా సులభమైన విజయాన్ని సాధించింది. ఇది దేవికకు తొలి వరల్డ్ టూర్ టైటిల్ మరియు 2024లో సింధు సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ టైటిల్ తర్వాత మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు తొలి సూపర్ 300+ టైటిల్‌గా నిలిచింది. సైనా నెహ్వాల్, పివి సింధు తర్వాత బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300+ ఈవెంట్లలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్న మూడవ భారతీయురాలు కూడా దేవిక చరిత్ర సృష్టించింది. ఈ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్‌లో మాజీ టాప్10 క్రీడాకారిణి, హోమ్ ఫేవరెట్ సుపానిడా కటేథాంగ్‌పై భారీ విజయం సాధించిన తర్వాత భారత్ యువ క్రీడాకారిణి దేవిక టోర్నమెంట్ అంతటా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది, వరుస ఐదు మ్యాచ్‌ల్లో గెలిచింది. వాటిలో మూడు సీడెడ్ ఆటగాళ్లపై విజయాలు ఉన్నాయి. ఫైనల్లో ఆమె దూకుడుగా ఆడటం ద్వారా తన ప్రత్యర్థిని మొదటి, రెండో గేమ్‌లో రెండంకెలకు కూడా చేరుకోనివ్వకుండా 21-8 తేడాతో గెలిచింది.

## ప్రో రెజ్లింగ్ లీగ్‌లో..
## ఫైనల్‌కు ఢిల్లీ వారియర్స్



**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026లో ఉత్కంఠభరితమైన సెమీ ఫైనల్ 2లో మహారాష్ట్ర కేసరిని ఓడించి ఢిల్లీ దంగల్ వారియర్స్ ఫైనల్‌కు చేరుకుంది. ఒక బౌట్ నుండి మరొక బౌట్ కు నాటకీయంగా మారిన ఈ పోటీలో ఢిల్లీ జట్టు 5-4 తేడాతో విజయం సాధించింది. 62 కిలోల మహిళల పోటీలో ఢిల్లీ అంజ్లి ద్వారా మొదటి స్థానంలో నిలిచింది. ఆమె దుడోవా బిల్యానా జివ్కోవాపై అద్భుతమైన ప్రదర్శన చేసింది. పవర్ మినిట్‌లో టేక్‌డౌన్‌లు, పుష్అవుట్‌లు మరియు నిర్ణయాత్మక నాలుగు పాయింట్ల మూవ్‌ను మిళితం చేసి, అంజ్లీ 12-4 తేడాతో ఢిల్లీకి తొలి ఆధిక్యాన్ని అందించింది. మహిళల టైలో (57 కిలోలు) మనీషా భన్వాలా కార్లా గొడినెజ్‌పై ఆధిపత్యం చెలాయించడంతో మహారాష్ట్ర 15-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని సాధించి టైను సమం చేసింది. హెవీవెయిట్ పోరులో కెప్టెన్ రాబర్ట్ బరాన్ రెండవ పీరియడ్‌లో ప్రత్యర్థిపై పూర్తి నియంత్రణ సాధించింది రోనక్‌ను 11-1తో ఓడించి మహారాష్ట్రను ఆధిక్యంలో ఉంచాడు. మహిళల పోటీలో (53) నిషు భన్వాలా సారికపై ఆధిక్యం పెంచింది. రెండవ పీరియడ్‌లో మహారాష్ట్ర 7-6 తేడాతో విజయం సాధించి 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఓటమి ఒత్తిడిని ఎదుర్కొంటూ, పురుషుల విభాగంలో (57) శుభం కౌశిక్ పవర్ మినిట్‌లో ఢిల్లీకి అద్భుతమైన నాలుగు పాయింట్లతో లోటును తగ్గించాడు. ఆ తర్వాత నాలుగు పాయింట్ల టేక్‌డౌన్‌తో 11-10 విజయాన్ని సాధించి ఢిల్లీని పోటీలో నిలిపాడు. యూరోపియన్ ఛాంపియన్ అనస్తాసియా అల్బీవా హర్షిత మోర్‌తో తన అనుభవాన్ని ప్రదర్శించడంతో (76) మహిళల 7-5 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌ను తీసుకువచ్చింది. ప్రారంభ పోటీ తర్వాత ఢిల్లీ తొలిసారిగా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

## ఆస్ట్రేలియా ఓపెన్ ఛాంపియన్‌గా అల్కరాజ్



**న్యూఢిల్లీ:** టెన్నిస్ యువ సంచలనం కర్లోస్ అల్కరాజ్ చరిత్ర సృష్టించాడు. హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో సెర్బియా దిగ్గజం నొవాక్ జకోవిచ్‌ను ఓడించి మరో గ్రాండ్ స్లామ్ టైటిల్ సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో ఆదివారం దాదాపు మూడు గంటలపాటు సాగిన ఈ ఫైనల్‌లో మ్యాచ్‌లో జకోవిచ్ పై అల్కరాజ్ 2-6, 6-2, 6-3, 7-5 తేడాతో నెగ్గాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో 11వ టైటిల్‌ను గెలుచుకోవాలనే లక్ష ్యంతో జోకోవిచ్ ఈ ఫైనల్‌ను ఘనంగానే ప్రారంభించాడు. మొదట్లో జకోవిచ్ ప్రత్యర్థి అల్కరాస్‌పై పైచేయి సాధించాడు. తొలి సెట్‌ను 6-2తో గెలుచుకున్నాడు. కానీ రెండో నుంచి సీన్ రివర్స్ అయ్యింది. అల్కరాజ్ ఊహించని రీతిలో కమ్‌బ్యాక్ ఇచ్చాడు. దీంతో 6-2తో ఈ సెట్‌ను దక్కించుకున్నాడు. ఆ తర్వాత మూడో సెట్ ప్రారంభానికి ముందు జకోవిచ్ మెడికల్ బ్రేక్ తీసుకున్నాడు. బ్రేక్ తర్వాత కూడా సెర్బియన్ స్టార్ ఫిట్‌నెస్ లోపం స్పష్టంగా కనిపించింది. కోర్టులో చురుగ్గా కదులుతూ అల్కరాజ్ ఆధిపత్యం ప్రదర్శిస్తుండగా, కమ్‌బ్యాక్ ఇచ్చేందుకు జకోవిచ్ తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. అయినప్పటికీ మూడో (6-3) సెట్‌నూ అల్కరాజ్ నెగ్గాడు. ఇక నాలుగో సెట్ లో ఒక దశలో 5-5తో ఉత్కంఠ నెలకొన్నా చివరికి అల్కరాజ్ 7-5తో నెగ్గాడు.

# వరల్డ్ కప్‌కు కౌంట్‌డౌన్

### ఐదు రోజుల్లో టి20 ప్రారంభం.. 15న భారత్, పాక్ మధ్య హైవోల్టేజ్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ 2026 కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మరో ఏడు రోజుల్లో భారత్, శ్రీలంకలలో ఈ క్రికెట్ పండుగ మొదలుకానుంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 20 జట్లు తలపడుతున్నాయి. ఈ జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. యుఎస్ఎ నమీబియా, నెదర్లాండ్స్ మరియు పాకిస్తాన్‌లతో కూడిన గ్రూప్ ఎ లో భారత్ ఉంది. ఇక ప్రస్తుత ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమ్ ఇండియా మళ్లీ టైటిల్ గెలవాలని పట్టుదలతో ఉంది. ఈ నెల 7వ తేదీన అమెరికాతో జరిగే మ్యాచ్‌తో భారత్ తన ప్రపంచకప్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. అనంతరం 12న ఢిల్లీలో నమీబియాతో తలపడుతుంది. ఇక క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ హైవోల్టేజ్ పోరు 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరగనుంది. గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌ను 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ ఆడుతుంది. ఇక భారత జట్టులో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ వంటి విధ్వంసకర బ్యాటర్లు ఉన్నారు. బౌలింగ్‌లో బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ భరోసా ఇస్తున్నారు. కానీ, ఒక స్టార్ ఆటగాడికి మాత్రం టీ20 వరల్డ్ కప్ ఆడే అదృష్టం ఇంకా కలగలేదు. అతనే స్టార్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్. టీ20 క్రికెట్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ చాహల్ కావడం విశేషం. చాహల్ ఇప్పటివరకు 329 టీ20 మ్యాచ్‌లు ఆడి 23.60 సగటుతో ఏకంగా 384 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ టీ20ల్లోనూ 80 మ్యాచ్‌ల్లో 96 వికెట్లు తీశాడు. ఇంతటి అద్భుత రికార్డు



ఉన్నా, 35 ఏళ్ల చాహల్‌కు ఇప్పటివరకు ఒక్క వరల్డ్ కప్ మ్యాచ్ ఆడే అవకాశం రాకపోవడం గమనార్హం. చాహల్ మాత్రమేకాదు, టీమ్‌ఇండియా స్టార్‌బ్యాటర్ శుభ్‌మన్ గిల్ కూడా ఈ విషయంలో దురదృష్టవం తుడిగా నిలిచాడు. రెండు ఫార్మాట్లలో భారత్‌కు కెప్టెన్‌గా ఉన్నగిల్, ఇప్పటివరకు ఒక్క టీ20 ప్రపంచకప్ కూడా ఆడలేదు. ఈసారి కూడా సెలక్టర్లు గిల్ కంటే సంజూ శాంసన్‌కే మొగ్గుచూపారు. ఇక చాహల్ విషయానికి వస్తే, అతను 2023 ఆగస్టులో వెస్టిండీస్‌తో తన చివరి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత జట్టులో చోటు కోల్పోయిన అతను, ప్రస్తుతం భారత్‌న్యూజిలాండ్ సిరీస్‌లో హిందీ కామెంటేటర్‌గా కొత్త అవతారంలో కనిపిస్తున్నాడు. మైదానంలో ఉండాల్సిన ఆటగాడు మైక్ పట్టుకుని విశ్లేషణలు ఇస్తున్నాడు. సూర్యకుమార్ యాదవ్ లేదా అభిషేక్ శర్మ వంటి బ్యాటర్లను కాదని, బౌలర్‌ను ఎంచుకోవడం చర్చనీయాంశమైంది.




## న్యూ మెక్సికో ఓపెన్‌లో
## కృష్ణకు షాట్‌పుట్ టైటిల్

**న్యూఢిల్లీ:** న్యూ మెక్సికో ఓపెన్-2026లో షాట్‌పుట్‌లో భారత్ షట్లర్ కృష్ణ జయశంకర్ ఇండోర్ మహిళల షాట్ పుట్ జాతీయ రికార్డును తిరిగి రాసింది. ఆమె 16.63 మీటర్ల కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనతో మహిళల షాట్‌పుట్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. న్యూ మెక్సికోలోని అల్బుకెర్కిలో ఆదివారం జరిగిన ఇండోర్ మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో కృష్ణ తన జాతీయ రికార్డును మెరుగుపరుచుకుంది. కృష్ణ తన రెండవ ప్రయత్నంలో 16.63 మీటర్ల బెస్ట్ విసిరి తన మునుపటి భారతీయ రికార్డును (16.03 మీ) అర మీటర్ కంటే ఎక్కువ మెరుగుపరుచుకుని ఈ సంవత్సరంలో తన రెండవ టైటిల్‌ను గెలుచుకుంది. ఆమె 15 మీటర్ల కంటే ఎక్కువ దూరం ఒకే ఒక్క త్రో మాత్రమే చేయగలిగినప్పటికీ, రజత పతక విజేత హన్నా రిచర్డ్‌సన్ 15.94 మీటర్లను అధిగమించగలిగింది. 23 ఏళ్ల కృష్ణ యుఎస్ఎ యొక్క ఎన్‌సిఎఎ లోని నెవాడా విశ్వవిద్యాలయం తరపున పోటీ పడుతోంది. షాట్ పుట్ మరియు డిస్కస్ త్రో రెండింటిలోనూ ప్రాతినిధ్యం వహిస్తోంది.



### ఈక్విటీ మార్కెట్లకు బడ్జెట్ షాక్
# రూ.10 లక్షలకోట్ల టర్నోవర్ లాస్
# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,ఫిబ్రవరి 1:** కేంద్ర బడ్జెట్ 2026 ప్రకటన స్టాక్ మార్కెట్లకు భారీ షాక్ ఇచ్చింది. ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్‌లావాదేవీలపన్ను పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడ్డారు. ఫలితంగా, గత ఆరేళ్లలో బడ్జెట్ రోజున సూచీలు ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. బడ్జెట్ రోజు ట్రేడింగ్‌లో సుమారు 10 లక్షలకోట్లు టర్నోవర్ ఆవిరి అయిపోయిందని ట్రేడర్లు అంచనావేసారు. ఆదివారం జరిగిన ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు దాదాపు 2 శాతం మేర నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 80,723 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 495 పాయింట్లు కోల్పోయి 24,825 వద్ద ముగిసింది. రోజు మధ్యలో అమ్మకాల ఒత్తిడి తారాస్థాయికి చేరడంతో సెన్సెక్స్ ఏకంగా 3,000 పాయింట్ల వరకు పతనమై 79,899.42 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ కూడా 24,572 స్థాయికి పడిపోయింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఎస్టీటీ పెంపును ప్రకటించడమే ఈ అమ్మకాలకు ప్రధాన కారణమైంది. ఫ్యూచర్స్ ట్రేడ్స్‌పై పన్నును 0.02 శాతం నుంచి 0.05 శాతానికి, ఆప్షన్స్ ప్రీమియంపై పన్నును 0.1 శాతం నుంచి 0.15 శాతానికి పెంచారు. ఈ నిర్ణయంతో ట్రేడింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. మార్కెట్‌లోని భయాలకు అద్దం పట్టే ఇండియా విక్స్ సూచీ దాదాపు 12 శాతం ఎగబాకింది. ఈ నష్టాలు కేవలం పెద్ద కంపెనీలకే పరిమితం కాలేదు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 2 శాతం పైగా నష్టపోయాయి. ఐటీ రంగం మినహా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా 6 పతనమవగా, మెటల్ షేర్లు 4 శాతం నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో, ఓఎన్‌జీసీ వంటి షేర్లు 6 శాతం వరకు నష్టపోగా, ప్రతికూల మార్కెట్‌లోనూ విప్రో, టీసీఎస్ వంటి ఐటీ స్టాక్స్ 2 లాభపడి కాస్త ఊరటనిచ్చాయి. బిఎస్ఇలో మొత్తం 1759 కంపెనీలషేర్లు పెరిగితే 2375 కంపెనీల షేర్లు క్షీణించాయి. కేవలం 182 కంపెనీలషేర్లు యధావిదిగా కొనసాగాయి.

## క్రిప్టో లావాదేవీలు జాప్యంచేస్తే జరిమానా
## ఏప్రిల్ 1వ తేదీ నుంచే అమలులోకి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 1:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రిప్టో లావాదేవీలు సకాలంలో తెలియజేయకపోతే జరిమానాలు విధించాలనినిర్ణఇంచారు. కొత్త ప్రతిపాదనలు వచ్చే ఏప్రిల్ 1వ తేదీనుంచి అమలులోకి వస్తాయి. ఆదాయపుపన్ను చట్టం 2025 ప్రకారం సెక్షన్ 509నిర్దేశించిన విధంగా క్రిప్టో లావాదేవీలు వివరాలు సకాలంలో వెల్లడించకపోతే భారీ జరిమానా కూడా ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. క్రిప్టో ఆస్తులు ఎప్పటికప్పుడు చట్టసంస్థలకు నివేదించాలని



కోరారు. రోజుకు రూ.200 చొప్పున జరిమానా ఉండాలనిసూచించారు. సరైన వివరాలు నిర్దిష్టమైన వ్యవధిలో ఇవ్వకపోతే రూ.50వేలు జరిమానా కూడా ప్రతిపాదించారు. నివేదికలు ఇవ్వకపోతే రోజుకు రూ.200, వివరాలు లేకుండా రూ.50వేలు జరిమానాలు ఈ బడ్జెట్ నుంచే అమలవుతాయి. క్రిప్టో ఎక్స్చేంజిలు, ఇతర సంస్థలు ఎప్పటికప్పుడు నిర్దేశిత నియంత్రణ సంస్థలకు నివేదికలు ఇవ్వాల్సి ఉంటుంది. క్రిప్టో కస్టమర్ల రోజువారి లావాదేవీలు ఆదాయపు పన్నుశాఖకు కూడా అందచేయాలి. జాప్యంతో రిటర్నులు దాఖలుచేసినవారికి ఎలాం టి చర్యలు జరిమానా అన్నది మాత్రం స్పష్టంచేయలేదు. అసంపూర్తి వివరాలపైనా స్పష్టత ఇవ్వలేదు.




# ఎంఎస్ఎంఇ రంగానికి
# రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి

**ముంబయి,ఫిబ్రవరి 1:** చిన్నమధ్యతరహాసూక్ష్మ పరిశ్రమలరంగం ఎంఎస్ఎంఇ భారత్ ఆర్థిక వృద్ధికి గ్రోత్ ఇంజిన్ వంటిదని అందుకోసమే ప్రత్యేకంగా రూ.10వేల కోట్లతో గ్రోత్‌ఫండ్ ఏర్పాటుచేసినట్లు కేంద్రంప్రకటించింది. తొమ్మిదవ బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కొన్ని ఉపశమనాలు కల్పించింది. ఈ రంగంలో వృత్తి నైపుణ్యం ఉన్న కార్మిక కొరత ఎక్కువ ఉందని ఏకీభవించారు. ట్రేడ్ రిసీవబుల్స్ వ్యవస్థ (ట్రెడ్స్)ద్వారా ప్రభుత్వం రూ.7 లక్షలకోట్ల నిధులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. ఎంఎస్ఎంఇలనుంచి అన్ని కొనుగోళ్లను ఈ ప్లాట్‌ఫామ్‌పైనుంచే నిర్వహిస్తారు. ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోళ్లు ఎంఎస్ఎంఇలనుంచి మాత్రమే కొనుగోలుచేయాలని నిర్దేశించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా క్రెడిట్ గ్యారంటీ ఫండ్‌ట్రస్ట్ ఏర్పాటుచేసింది. ట్రెడ్స్ ప్లాట్‌ఫామ్‌పై ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ కోసం ఉపకరిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ ఈమార్కెట్‌ప్లేస్ ట్రెడ్స్‌తో మొత్తం సమాచారం పంచుకోవాలి. ఎంఎస్ఎంఇ రంగంలో ఛాంపియన్లుగా పారిశ్రామిక వేత్తలను తీరినచదిద్దే లక్ష్యం ఉందని ఆర్థికమంత్రి వెల్లడించారు. మొదటిసారి వ్యాపారంచేసేవారికి ఈ ఫండ్ తోడ్పాటునిస్తుంది. స్వయం సమృద్ధినిదులు 2021లో ఏర్పాటుచేసారు. ఆనాడు ఎంఎస్ఎంఇలకు రూ.2వేల కోట్లుకేటాయించారు. ఎంజినరేగా తరహాలోనే ఎంఎస్ఎంఇ రంగం కూడా ఉపాధిరంగం రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకూ చెల్లించే విధంగా మార్పులుచేసింది. అలాగే ప్రభుత్వం రూ.1200 కోట్లతో ఫండ్‌ఆఫ్ ఫండ్స్, రూ.9 వేల కోట్లతో గ్యారంటీ ఎమర్జన్సీ క్రెడిట్‌లైన్, రూ.1500 కోట్లు ఎంఎస్ఎంఇ పనితీరు వృద్ధికోసం, రూ.3860 కోట్లు పిఎం విశ్వకర్మ కింద కేటాయింపులు జరిపింది. ఇవన్నీ కూడా ఎంఎస్ఎంఇ రంగానికి ఊతం ఇచ్చేవేనని ఆర్థిక మంత్రి ప్రకటించారు.



# సెక్యూరిటీ లావాదేవీ పన్నుతో
# బ్రోకరేజి సంస్థల షేర్లు ఢమాల్..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** సెక్యూరిటీ లావాదేవీలపై పన్ను విధిస్తున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో పొందుపరచడంతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అలాగే బ్రోకరేజి ఆధారిత ఎక్స్చేంజి సంబంధిత కంపెనీల షేర్లు భారీగాఅంటే 12శాతం పతనం అయ్యాయి. సెక్యూరిటీ లావాదేవీల పన్నును డెరివేటివ్స్‌పై పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌వెల్లడించారు. దీనితో ఎస్టీట ఫ్యూచర్ కాంట్రాక్టులుపై 0.02 నుంచి 0.05శాతం పెరుగుతున్నట్లు వెల్లడి అయింది. ఫ్యూచర్స్ ఆప్షన్ల విభాగంలో ఈపెంపుతో బ్రోకరేజి స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఎంసిఎక్స్ 11.60శాతం క్షీణించి రూ.2232.15 వద్దట్రేడ్ అయితే ఏంజెల్‌వన్ 8.61శాతం క్షీణించి రూ.2320వద్ద స్థిరపడింది. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసులు సంస్థ కూడా 8.06శాం క్షీణించి రూ.303.80 వద్ద ఇనలిచింది. బిలియన్‌బ్రెయిన్స్ గారేజి వెంచర్స్ గ్రో కంపెనీ 5.11శాతం, ఆనంద్‌రాఠి షేర్ బ్రోకర్లు 2.03శాతం చొప్పున క్షీణించాయి. ఫ్యూచర్స్ ఆప్షన్స్ ట్రేడింగ్‌కు కేంద్రం వ్యతిరేకం కాదని, చిన్న ఇన్వెస్టర్లు నష్టాల పాలవుతున్నారని, అందువల్లనే ఎస్టీటి కేవలం ఎఫ్అండ్‌వో రంగంపైనే పెంచామని అన్నారు. 90శాతం మంది రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్అండ్‌వో విభాగంలో నష్టాలపాలవుతున్నారు. లక్షరూపాయల ఫ్యూచర్స్ విక్రయిస్తే ట్రేడర్లు రూ.20 చెల్లించాలి. అంతకుముందురూ.12.50 మాత్రమే ఉండేది. పదివేల ఆప్షన్ కాంట్రాక్టుసేల్‌కు ఎస్‌టిటి రూ.6.25 ఉంచి రూ.10 వరకూ పెంచిందని బ్రోకింగ్ సంస్థలు చెపుతున్నాయి.




# షేర్ల బైబ్యాక్, డివిడెండ్‌లు
# కూడా ఎల్టీసిజియే

### ఆర్థికశాఖ ప్రతిపాదనలు
### ఏప్రిల్ నుంచి అమలులోకి..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** ప్రభుత్వం ఇకపై షేర్ల బైబాక్‌ను కూడా పన్నుల వ్యవస్థపరిధిలోకి తెస్తోంది. బైబాక్ లావాదేవీలనుంచి వచ్చే రాబడులు, డివిడెండ్ ఆదాయాలను కూడా మూలధన లబ్దికిందనే పరిగణించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థీకృత లోపాలను అరికట్టి మధ్యవర్తిత్వ ఛాన్స్‌లు కూడా తగ్గించాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబ్‌లపరిధిలోనే పరిగణించేంది. ప్రత్యేకించి డివిడెండ్ ఆదాయవనరులను ఈకోవలోనే చూసేది. ఇకషేర్ల కొనునగోళ్లు బైబాక్ వంటివి మూలధన లబ్దికిందకే వస్తాయని, అందువల్ల మూలధన లబ్దిపైనా పన్నులు ఉంటాయని సూచించింది. దీర్ఘకాలిక మూలదన లబ్ది పై 12.5శాతం ఉంటుందని నిర్ణయించారు. ప్రమోటర్లు,నాన్‌ప్రమోటర్లు ఈ అధిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఈ పన్నురేట్లు అమలవుతాయి. కార్పొ రేట్‌ప్రమోటర్లు 22శాతం, నాన్ కార్పొరేట్ ప్రమో టర్లు యధావిధిగా 30శాతం పన్ను శ్లాబులోనే చెల్లించాల్సి ఉంటుంది. షేర్లబైబాక్‌పై పన్ను విదింపు ఇన్వెస్టర్లకు ఉపశమనం కలిగిస్తుందని ఆర్తికశాఖ కార్యదర్శి చెపుతున్నారు. ఇప్పటివరకూ భారీ కంపెనీలన్నీ కూడా వేలకోట్ల విలువైన షేర్లను బైబాక్‌చేసిన సంగతి తెలిసిందే. నిఫ్టీ ఐటి సూచీ 0.6శాతం ఆదివారంపెరిగితే విప్రో,టిసిఎస్‌లు రెండు, 1.7శాతం చొప్పున పెరిగాయి.

# బిఎస్ఎన్ఎల్‌కు రూ.28,473కోట్లు




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 1:** ప్రభుత్వరంగంలోని బిఎస్ఎన్ఎల్‌కు కేంద్రం బడ్జెట్‌లో రూ.28,473 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌కంటే 33శాతం తక్కువగానే కేటాయింపులు జరిపింది. వయబులిటీ గ్యాప్‌ఫండింగ్ ద్వారా 476 కోట్లు, ఉద్యోగుల పదవీవిరమణకింద కొంత కేటాయింపులు మొత్తం రూ.30,188 కోట్లు కేటాయించింది. అదనంగా 24 వేల 4జి సైట్‌లు ఏర్పాటుచేస్తోంది. ప్రస్తుతం ఉన్న లక్ష 4జి సైట్లకుతోడు అదనంగా వీటిని ఏర్పాటుచేస్తుంది.2024లో కేంద్రం 56,785కోట్లు కేటాయించింది. 2025లో 82,054కోట్లు కేటాయిస్తే మూలధన వ్యయం కింద బిఎస్ఎన్ఎల్‌కు విడతలవారీగా 2019 నుంచి ఇప్పటివరకూ రూ.3.22 లక్షలకోట్లు విడుదచలేసింది. ఈ మొత్తంలోనే 2022లో 1.64 లక్షలకోట్లు, 4జి, 5జి స్పెక్ట్రమ్‌కోసం 203లో రూ.89వేల కోట్లు కేటాయింపులు జరిపింది. మంబైల్‌సర్వీసులను వచ్చేఏడాదిచివరికి 50 శాతం పెరగాలన్న లక్ష్యం విధించింది. ఫిక్స్‌డ్ లైన్ బిజినెస్ 15నుంచి 20శాం పెంచాలని నిర్ణయిం మచారు. సగటు రాబడి సర్కిళ్లవారీగా రూ.175వరకూ ఉన్నట్లు తేలింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.